అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 7-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 347 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 8.00



ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్

విశిష్ట లోక్‌మత్ పార్లమెంటరీ అవార్డు పురస్కారం 3లో..

ఇది ముమ్మాటికీ తెలంగాణ వ్యతిరేక వైఖరే

కేఆర్ఎమ్‌బీకి ప్రాజెక్టులను అప్పగించటం రాష్ట్రానికి గొడ్డలిపెట్టే

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హెచ్చరిక
- 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ
- జయప్రదానికి మాజీ సీఎం పిలుపు



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎమ్‌బీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటమనేది ముమ్మాటికీ తెలంగాణ వ్యతిరేక వైఖరేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలకు ఇది తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న ఈ వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. కేంద్రం నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు వీలుగా ఈనెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని వెల్లడించారు. ఆ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఎంతకైనా పోరాడుతామని స్పష్టం చేశారు. నాడు ఉద్యమాన్ని నడిపించి రాష్ట్రాన్ని సాధించిన స్ఫూర్తితోనే నేడు మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మించి హక్కులకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు మాజీ సీఎం పిలుపునిచ్చారు. తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ఎండగట్టాలని సూచించారు.

మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కృష్ణా బేసిన్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులతో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. కృష్ణా నదిపైగల ప్రాజెక్టులను కేఆర్ఎమ్‌బీకి అప్పగించటం వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాలను, ఇతర పర్యవసాలను ఆయన ...3లో

ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

- మూణ్నెళ్ల తర్వాత తెలంగాణ భవన్‌లో అడుగు పెట్టిన బీఆర్ఎస్ బాస్
- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు

వివరాలు 3లో



గాంధీభవన్‌లో సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశం...

టార్గెట్ 16..

కనీసం 13 ఎంపీలు గెలవాలి

నల్లగొండలో భారీ బహిరంగసభ

- కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విస్తృతంగా ప్రచారం
- రాష్ట్రం నుంచి సోనియా పోటీ చేయాలంటూ ఏకవాక్య తీర్మానం
- గాంధీభవన్‌లో టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతున్నది. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలుంటే, అందులో 16 సీట్లలో పార్టీ అభ్యర్థులు గెలవాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తక్కువలో తక్కువగా 13 సీట్లను కైవసం చేసుకునేందుకు శాయశక్తుల కృషి చేయాలని క్యాడర్‌కు పిలుపునిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నేతలు కలిసి కట్టుగా కష్టపడి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చారనీ, అదే స్ఫూర్తితో పార్లమెంటు ఎన్నికల్లో పని చేయాలని కోరింది. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశమైంది.

ఇప్పటికే ఇంద్రవెల్లి నుంచి పార్లమెంటు ఎన్నికల శంఖారావాన్ని పూరించిన కాంగ్రెస్...మరో భారీ బహిరంగ సభను నల్లగొండలో నిర్వహించనున్నట్టు, ఆ సభకు సోనియాగాంధీ లేదా ప్రియాంకగాంధీ హాజరు కానున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సభకు రెండు లక్షల మందికి మించి జనసమీకరణ చేయాలని పార్టీ నేతలను అధిష్టానం ఆదేశించింది. సభకు సంబంధించిన స్థలం, సమయాన్ని త్వరలో వెల్లడించనున్నట్టు నేతలు చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... ఆపరేషన్ తర్వాత పార్లమెంటు ఎన్నికల వైపు అడుగులేస్తున్నారు. ఈనెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సభకు కౌంటర్‌గా కాంగ్రెస్ కూడా అదే జిల్లాల్లో బహిరంగసభకు ప్లాన్ చేయడంతో నల్లగొండ నుంచే ఎన్నికల సమరం వేడెక్కనుంది. సూర్యాపేట మినహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ తొలి సభ పెడుతున్నట్టు ప్రకటించడంతో కాంగ్రెస్ మరింత దూకుడు పెంచింది.

పార్లమెంటు ఎన్నికల్లో ఎక్కడా తగ్గొదంటూ పార్టీ శ్రేణులను రేవంత్‌రెడ్డి కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని కాంగ్రెస్ కార్యకర్తలు జనాల్లోకి తీసుకు వెళ్లాలని, ఆ ప్రాజెక్టుపై అసెంబ్లీల్లో చర్చ నిర్వహిస్తామనీ, ఇప్పటికే విచారణ కొనసాగుతున్నదని వివరించారు. అవినీతిలో భాగస్వాములైన ఎవ్వరినీ వదిలి పెట్టబోమని రేవంత్‌రెడ్డి చెప్పారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందులో అధికారులు, రాజకీయ నాయకులు ఎవరున్నా...వదిలి పెట్టబోమని పేర్కొన్నారు. ఎంపీ టికెట్ల కోసం ఇప్పటికే 309 మంది నాయకులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆవివరాలను క్రోడికరించిన 32 పేజీల బుక్‌లేట్‌ను టీపీసీసీ ఎన్నికల కమిటీ సభ్యులకు అందజేశారు. దానిపై టిక్ మార్క్ చేసి, బుధవారం మధ్యాహ్నం లోగా గాంధీభవన్‌లో అందజేయాలని కోరారు.



ఎల్డీఎఫ్ నిరసనకు డీఎంకే మద్దతు

- ఢిల్లీ ఆందోళనలో మేమూ పాల్గొంటాం : పినరయి విజయన్‌కు స్టాలిన్ లేఖ

వివరాలు 11లో



కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి నివాసంపై ఈడీ దాడి

- ఆప్ నేతలపై కూడా...

వివరాలు 11లో



అజిత్ వర్గానికే ఎన్సీపీ

- తేల్చిన కేంద్ర ఎన్నికల కమిషన్
- శరద్ పవార్‌కు షాక్..

వివరాలు 11లో



మధ్యప్రదేశ్‌లో దారుణం

- బాణాసంచా ఫ్యాక్టరీలో మంటలు ఎగిసి పేలుళ్లు
- 11 మంది మృతి.. వంద మందికి గాయాలు

వివరాలు 11లో

కాదేదీ లీకేజీకి అనర్హం..


అగమ్యగోచరంగా నిరుద్యోగుల భవిష్యత్

- రీ-ఎగ్జామినేషన్‌లో తీవ్ర జాప్యం
- మానసిక క్షోభతో అల్లాడుతున్న ఉద్యోగార్థులు
- చట్టాలు, ఆర్డినెన్సులు ఫలితమిస్తాయా అని అనుమానాలు

దేశంలోని పలు రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలకు పాల్పడుతున్న కేటుగాళ్లు నిరుద్యోగుల జీవితాలతో అటలాడుకుంటున్నారు. నెలల తరబడి పోటీ పరీక్షల పుస్తకాలతో కుస్తీ పట్టి, నిద్రాహారాలు లేకుండా కష్టపడి చదివే వేలాది మంది నిరుద్యోగులు తీరా ఆ పరీక్ష పేపర్ లీక్ అయి, పరీక్ష రద్దయితే తీవ్రమైన ఒత్తిడికి, నిరాశా నిస్పృహలకు గురై ఆత్మహత్యకు సైతం పాల్పడుతూ తమ జీవితాలను అర్థాంతరంగా ముగించుకుంటున్న ఉదంతాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ఓ బిల్లును ప్రవేశపెట్టింది. ఇది రాష్ట్రాలకు మోడల్ ముసాయిదాగా ఉపకరిస్తుందని, అయితే అమలు విషయంలో రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెబుతోంది. ఈ నేపథ్యంలో గత ఐదు సంవత్సరాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన పరీక్షా పత్రాల లీకేజీపై 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక పరిశోధన జరిపింది. ఆ వివరాలు...

వివరాలు 3లో

15 రాష్ట్రాల్లో 41 పరీక్షా పత్రాల లీకులు



563కు పెరిగిన గ్రూప్-1 పోస్టులు

60 పోస్టులు అదనంగా మంజూరు

- త్వరలోనే అనుబంధ నోటిఫికేషన్
- ప్రిలిమ్స్ రద్దుకే టీఎస్‌పీఎస్సీ మొగ్గు
- సుప్రీంలో కేసు ఉపసంహరించుకునే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మరో 60 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022, ఏప్రిల్ 26న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టుల సంఖ్య 563కు పెరిగాయి. 60 గ్రూప్-1 పోస్టులను అదనంగా మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని ప్రకటించారు. వీటిలో స్టేట్ ఆడిట్ శాఖలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఒక పోస్టు, డీఎస్పీ పోస్టులు 24, డిప్యూటీ సూపరింటెండెంట్ జైల్స్ పోస్టులు మూడు, జిల్లా ఉపాధి అధికారి పోస్టులు మూడు, ఎంపీడీవో పోస్టులు 19, జిల్లా ...11లో

21న ఎప్‌సెట్ నోటిఫికేషన్

26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- మే 9 నుంచి 12 వరకు రాతపరీక్షలు
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నోటిఫికేషన్ ఈనెల 21న విడుదల కానుంది. మంగళవారం ఎప్‌సెట్ కమిటీ మొదటి సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్లు ఎస్ తారాకళ్యాణి, ఎన్ దర్గాకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు ఎప్‌సెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ ఆరో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. మే తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను ...11లో

పెట్టుబడిదారుల చేతిలో దేశ సంపద

- రిజర్వేషన్లపై పరిమితి ఎందుకు?
- వ్యవస్థలపై పోరాటం తప్పదు : జార్ఖండ్‌లో రాహుల్
- ఒడిషాలో ప్రవేశించిన యాత్ర

రాంచీ : దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ గిరిజనులు, వెనుకబడిన తరగతులు, పేదల భూములను ప్రభుత్వం లాగేసుకొని అదానీ వంటి పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. జార్ఖండ్‌లోని గుమ్లా వద్ద రాహుల్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీల భూమిని కేంద్రం లాగేసుకుంటోందని ఆరోపించారు. 'దేశంలో కేవలం రెండే కులాలు...ధనికులు, పేదలు...ఉన్నాయని ప్రధాని మోడీ చెబుతున్నారు. మరి ఆయన తనది మూడో కులం ఓబీసీ అని ఎందుకు చెప్పుకుంటున్నారు?' అని రాహుల్ ప్రశ్నించారు. అందుకే సంపద ఎవరి చేతిలో ఉందో గుర్తించాల్సి ఉందన్నారు. దేశ సంపద మొత్తం కొందరు ఎంపిక చేసిన బిలియనీర్ల చేతిలోనే ఉండాలని బీజేపీ కోరుకుంటోందని చెప్పారు. దేశంలో సామాజిక న్యాయం సాధించడం ...11లో



బిజినెస్

ఎల్ఐసీ నుంచి కొత్త ఇండెక్స్ ప్లస్ పాలసీ



ముంబయి : బీమా దిగ్గజం ఎల్ఐసీ కొత్త పాలసీని ఆవిష్కరించింది. ఇండెక్స్ ప్లస్ పేరిట యూనిట్ లింక్డ్, రెగ్యులర్ ప్రీమియం, వ్యక్తిగత లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీని అందుబాటులోకి తెచ్చినట్టు ఆ సంస్థ తెలిపింది. జీవిత బీమా కవరేజీతో పాటు పొదుపునకు ఇది మద్దతు చేస్తుందని ఎల్ఐసీ ఛైర్మెన్ సిద్దార్థ మోహంతి తెలిపారు. షరతులకు లోబడి ఐదేళ్ల లాకిన్ పీరియడ్ అనంతరం పాక్షికంగా ఉపసంహరించుకునే వీలుందన్నారు. గ్యారంటీడ్ అడిషన్స్ కూడా ఉంటాయన్నారు. నిర్దిష్ట గడువు ముగిసిన అనంతరం వార్షికంగా చెల్లించే ప్రీమియంలో కొంత శాతాన్ని గ్యారంటీ జోడింపుగా యూనిట్ ఫండ్‌కు జమ చేస్తామన్నారు. ప్లాన్‌లో చేరేందుకు కనీస వయసు 90 రోజులు. గరిష్ఠ వయో పరిమితి హామీ మొత్తం ఆధారంగా 50 లేదా 60 సంవత్సరాలుగా ఎల్ఐసీ నిర్ణయించింది. పాలసీ వివరాలు.. కనీస హామీ మొత్తం వార్షిక ప్రీమియంకు 7 నుంచి 10 రెట్లు. మెచ్యూరిటీకి కనీస వయసు 18 సంవత్సరాలు కాగా గరిష్ఠ వయసు 75 లేదా 85 సంవత్సరాలు. కనీస కాలపరిమితి 10 లేదా 15 సంవత్సరాలు. కనీస ప్రీమియం ఏడాదికి రూ.30,000, అర్ధ సంవత్సరానికి రూ.15,000, త్రైమాసికానికి రూ.7,500, నెలవారిగా రూ.2,500గా నిర్ణయించింది. ఎన్ఎస్ఇ 100 ఇండెక్స్ లేదా ఎన్ఎస్ఇ నిఫ్టీ 50లలోని ఎంపిక చేసిన షేర్లలో పెట్టుపెడులు పెట్టే ఫ్లెక్సీ గ్రోత్ ఫండ్ లేదా ఫ్లెక్సీ గ్రోత్ ఫండ్‌లో ఏదైనా ఎంచుకునే అవకాశం ఉంది. మెచ్యూరిటీ సమయానికి పాలసీదారుడు జీవించి ఉన్నట్టయితే యూనిట్ ఫండ్ విలువతో సమానమైన మొత్తం చెల్లించనున్నట్లు ఎల్ఐసీ తెలిపింది.

పొదిలిలో ఇండియన్ బ్యాంక్ కొత్త శాఖ ఏర్పాటు



ప్రకాశం : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్, అమరావతి జోన్ కొత్తగా ప్రకాశం జిల్లాలోని పొదిలిలో నూతన శాఖను ఏర్పాటు చేసినట్టు ప్రకటించింది. ఈ శాఖను హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేసరామన్ ఎ లాంచనంగా ప్రారంభించారు. ఖాతాదారులకు మెరుగైన రిటైల్, ఎంఎస్ఎంఇ, ఇతర బ్యాంకింగ్ సేవలను అందిస్తామని గణేసరామన్ హామీ ఇచ్చారు. ఉత్తమ పథకాలు, సర్వీసులు అందించడంలో ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ డిఎస్ మూర్తి, భవన యాజమాని యద్ల వెంకటేశ్వర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజి మోటార్ వందేండ్ల ఆఫర్లు

న్యూఢిల్లీ : ఎంజి మోటార్స్ తన వందేండ్ల వేడుకల సందర్భంగా పలు ఆఫర్లను అందిస్తున్నట్టు తెలిపింది. కొనుగోలుదారులకు తగ్గింపు ధరలతో తమ వాహనాలను అందిస్తున్నట్టు పేర్కొంది. ఎంజి జడ్ఎస్ ఇవి ఎగ్జిక్యూటివ్ వేరియంట్ రూ.18.98 లక్షల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది. ఎంజి కామెట్ స్మార్ట్ ఇవిని రూ.6.99 లక్షలతో సొంతం చేసుకోవచ్చని తెలిపింది. ఎంజి హెక్టర్ రూ 14.94 లక్షల వద్ద ప్రారంభమవుతుందని వెల్లడించింది.

ఓకే ప్లే ఇండియా షేర్ల విభజన

హైదరాబాద్ : ప్లాస్టిక్ మౌల్డెడ్ ఫర్నిచర్, అవుట్‌డోర్ ప్లే ఎక్విప్‌మెంట్, ఆటోమోటివ్ పరికరాలు తదితర రంగాల్లో ఉన్న ఓకే ప్లే ఇండియా లిమిటెడ్ తనషేర్లను విభజిస్తున్నట్టు తెలిపింది. ఈక్విటీ షేర్లు 10.1 నిష్పత్తిలో జారీ చేయనున్నట్లు పేర్కొంది. అనగా రూ.10 ముఖ విలువ కలిగిన షేర్‌ను రూ.1 విలువ గల 10 షేర్లగా విభజన చేయడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. కాగా.. దీనికి వాటాదారుల ఆమోదం లభించాల్సి ఉంటుంది.

రూ.15 లక్షల కోట్లకు టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్

ముంబయి : దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తొలిసారి రూ.15 లక్షల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు చేరింది. యూరోప్ అసిస్టెన్స్ సంస్థతో ఒప్పందం కుదిరినట్లు వెల్లడించడంతో మంగళవారం టీసీఎస్ షేర్ 3.93 శాతం పెరిగి రూ.4,129 ఆల్‌టైం గరిష్ఠ స్థాయిని తాకింది. గ్లోబల్ అసిస్టెన్స్ అండ్ ట్రావెల్ ఇన్సూరెన్స్ సంస్థ యూరోప్ అసిస్టెన్స్‌తో ఒప్పందంలో భాగంగా ఆ సంస్థకు 'ఎండ్ టు ఎండ్ ఐటీ అప్లికేషన్ సర్వీసెస్' అందించేందుకు యూరప్ అంతటా తాము డెలివరీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ తెలిపింది.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయంలో సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల(సీఐటీయూ,ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐయూటీయూసీ)జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను నిరసిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను చెప్పాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 10సంవత్సరాలు పూర్తవుతున్నా రైతాంగ, కార్మికవర్గ,ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు.కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించకపోవడంతో మున్సిపల్ కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పని భద్రత, ఉపాధి కరువైందన్నారు. ధరలను నియంత్రిస్తామని వాగ్దానం చేసిన బీజేపీ ప్రభుత్వంలోనే 30 నుంచి 56 శాతం మేరకు ధరలు పెరిగాయన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేశ్ మాట్లాడుతూ.. బీజేపీ రాముని పేరు చెప్పి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మత రాజకీయాలు మంచివి కావని, ఒక రాజకీయ పార్టీ అన్ని మతాలనూ ఐక్యంగా చూడాలని హితవు పలికారు. దేశవ్యాప్తంగా దాదాపు 12కోట్ల మంది ఉద్యోగులను తొలిగించారని తెలిపారు. పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగం సంస్థలైన రైల్వే, ఎల్ఐసీతోపాటు అన్ని సంస్థలనూ ప్రయివేటీకరణ చేస్తున్నారన్నారు. దేశంలో ఐదు లక్షల గ్రామాలల్లో నీళ్ల, కరెంట్ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు.

హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బారామారావు, జేఏసీ నాయకులు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. కార్మిక సంఘాల పోరాటంతోనే హక్కులను సాధించుకోవచ్చన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో పాలించిన కేసీఆర్ కార్మిక వ్యతిరేక విధాలనాను అవలంబించారన్నారు. కార్మికులు, వర్కర్స్‌తోపాటు హక్కుల కోసం పోరాటం చేసిన వారిపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీలో బయోమెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే జాన్, ఐఎఫ్‌టీయూ జీహెచ్ఎంసీ నాయకులు శివబాబు, ఏఐయూటీయూసీ జీహెచ్ఎంసీ నాయకులు అంజనేయులు, జీహెచ్ఎంసీ జేఏసీ నాయకులు జైపాల్‌రెడ్డి, అంజయ్య, అంబాద్, అనురాధ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

రైలు టిక్కెట్లకు డిజిటల్ చెల్లింపులు చేయండి

- ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైల్వే స్టేషన్లలో టిక్కెట్ల కొనుగోలుకై డిజిటల్ చెల్లింపులు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ప్రయాణీకులకు విజ్ఞప్తి చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం అన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో పాయింట్ ఆఫ్ సేల్ మెషిన్లు (పీఓఎస్), ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మెషిన్లు (ఏటీవీఎమ్), యూటీఎస్ మొబైల్ యాప్, యూపీఐ ద్వారా చెల్లింపుల సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామని మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహిస్తూ, నగదు రహిత చెల్లింపులకు దక్షిణ మధ్య రైల్వే ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు.

మహిళల భద్రతకు కొత్త చట్టాలు రూపొందించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు
- అనవసరంగా సోషల్ మీడియా జోలికెళ్లొద్దు :సైకియాట్రిస్ట్, స్టూడెంట్ కౌన్సెలర్ అమ్మాజి



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్రైమ్ బ్యూరో రికార్డుల ప్రకారం దేశంలో ప్రతి గంటకి ఒక మహిళ, విద్యార్థినిపై దాడులు జరుగుతున్నాయని, మహిళల రక్షణకు కొత్త చట్టాలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం నారాయణగూడలోని జాహ్నవి కాలేజ్‌లో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ జరిగింది. ప్రముఖ సైకియాట్రిస్ట్, స్టూడెంట్ కౌన్సెలర్ అమ్మాజి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత హాజరయ్యారు. ఈ సందర్భంగా టి.నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించేలా కొత్త చట్టాలను రూపొందించాలన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళల అభ్యున్నతి కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. ప్రతి మహిళా మరో సావిత్రిబాయిలా, పూలేలా కావాలని కోరారు. అణచివేయబడుతున్న ప్రతి మహిళా అగ్నిజ్వాలై మండాలని, విద్యారంగంతోపాటు రాజకీయాల్లోనూ మహిళలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

స్టూడెంట్ కౌన్సెలర్ అమ్మాజి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో హార్మోన్ల లోపంతో 12, 13 ఏండ్ల వయసులోనే పెడదోవ పడుతున్నారని, దానికి కారణం సోషల్ మీడియా ఇంపాక్ట్ అని తెలిపారు. యూట్యూబ్, టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, సినిమాల్లో అశ్లీల చిత్రాల వల్లనే అలా అవుతున్నారన్నారు. అనవసరమైన వాటికోసం సోషల్ మీడియా జోలికి పోవద్దని సూచించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత మాట్లాడుతూ.. దేశంలో మహిళలు అభివృద్ధిలో వెనుకబడటానికి కారణం మనస్మృతి అని, దాన్ని అనుసరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. స్త్రీని సమాజంలో రెండో తరగతికి చెందిన మనుషుల్లాగా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరస్వతిని చదువుల తల్లిగా కీర్తిస్తున్నా.. ఆడపిల్ల చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సహకరించరని అన్నారు. ఆధునిక సమాజంలో ఉన్న మహిళలు, అమ్మాయిలు దేశ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రగతిశీల ఆలోచనలతో అన్ని రంగాలలో తమ స్థానాన్ని దక్కించుకునేలా మహిళా హక్కులు పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు.

ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కమిటీ అమ్మాయిల అభ్యున్నతి కోసం పాటుపడాలని, ప్రతి అమ్మాయి సమస్య.. తన సమస్యగా భావించి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, శ్రీమన్, సహాయ కార్యదర్శి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

13 మందితో గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

జీఎస్‌సీసీ హైదరాబాద్ జిల్లా గర్ల్స్ కన్వీనింగ్ నూతన కమిటీని 13 మందితో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రమ్య కో-కన్వీనర్లుగా పవిత్ర, జువేర, చరణ్‌శ్రీ, సంధ్య, భావన, కమిటీ సభ్యులుగా కవిత, సుష్మ, సహన, సిద్దిక, చంద్రకళ, గాయత్రి, రాధిక, భవ్యను ఎన్నుకున్నారు.

మార్చి 12న పీజీఈసెట్ నోటిఫికేషన్

- 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ షురూ
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో 2024-15 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) నోటిఫికేషన్ వచ్చేనెల 12న విడుదల కానుంది. మంగళవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో పీజీఈసెట్ కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, పీజీఈసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి, కోకన్వీనర్ బి రవీంద్రారెడ్డి, కోఆర్డినేటర్ బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు పీజీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల 16 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని అరుణకుమారి తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు మే పదో వరకు ఉందని పేర్కొన్నారు. జూన్ ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు పీజీఈసెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై లుక్ ఔట్ నోటీసులు జారీ

- మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావుకు బెయిల్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజాభవన్ ముందు బారికేడ్లను ఢీకొన్న కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ3గా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాభవన్ ముందు ప్రమాదం కేసులో ప్రధాన నిందితుడు సాహిల్, అతని తండ్రి మాజీ ఎమ్మెల్యే షకీల్ దుబాయ్‌లో ఉన్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. సాహిల్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై కూడా లుక్ ఔట్ నోటీసులు జారీ చేశామన్నారు. పంజాగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్, బోధన్ మాజీ ఇన్‌స్పెక్టర్‌ను జడ్జి ముందు హాజరు పరిచామని చెప్పారు. వారిద్దరికీ షరతులతో కూడిన బెయిల్ మంజూరైనట్టు తెలిపారు. కాగా ఈ కేసులో మొత్తం 16 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే, 2022 మార్చిలో జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో ఒక బాబు చనిపోయాడని, ఆ కేసులోనూ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు సాహిల్‌ను తప్పించారనే వార్తలు వచ్చాయన్నారు. ఆ కేసును కూడా తిరిగి విచారణ చేస్తామని.. కోర్టులో ట్రయల్ జరుగుతోందని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యం అంటూ బంధువుల ఆందోళన



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

హైదరాబాద్ కోఠిలోని సుల్తాన్ బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మూడ్రోజుల శిశువు మృతిచెందాడు. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని బర్కత్‌పురా రత్ననగర్ ప్రాంతానికి చెందిన సాయికిరణ్, కవిత దంపతులు. ఈ నెల 3న రాత్రి 8.30 గంటల సమయంలో కవిత పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరింది. అదే రోజు రాత్రి 10:40 గంటలకు కవిత మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు 2.6 కిలోల బరువు ఉన్నాడు. కాగా 5వ తేదీన రాత్రి పసికందును అమ్మమ్మ తన వద్ద కింద పడుకోబెట్టుకుంది. ఆ సమయంలో శిశువు శరీరంలో ఉష్ణోగ్రత తగ్గి నీరసించాడు. వెంటనే ఎస్ఎన్సీయూలో పీడియాట్రిక్ వైద్యులు పరీక్షించి బాబు ఆరోగ్యంగానే ఉన్నాడని తెలిపారు. పుట్టిన 24 గంటలలోపు శిశువులకు ఇచ్చే వ్యాక్సిన్ కూడా ఇచ్చారు. ఇదిలా ఉండగా, మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో శిశువు శరీరం నీలం రంగులోకి మారి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే వైద్యుల వద్దకి తీసుకెళ్లగా.. పరీక్షించారు. పరిస్థితి విషమించి చనిపోయాడు. సాధారణంగా బాబును పడుకోబెట్టి పాలు తాగించడం ద్వారా ఇలా అవుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే పసికందు మృతిచెందడానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి వార్డులో వైద్యులు తక్షణమే రావాలని.. మందుల ట్రేలను, ఫర్నీచర్‌ను కింద పడేయడంతోపాటు సముదాయించేందుకు వెళ్లిన ఆర్ఎంవోను దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి అక్కడికొచ్చారు. పసికందు మృతికి కారణాలు తెలుసుకొని.. బంధువులతో చర్చించి వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు. సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.


ఫోర్జరీ పట్టాతో..రూ.40 కోట్ల భూకబ్జా

కంబాలపల్లిలో భూమి.. మద్దికుంట భూమికి రిజిస్ట్రేషన్

- తహసీల్దార్ ప్రతిపాదన.. ఎన్ఓసీ ఇచ్చిన ఆర్డీఓ
- పేదలకిచ్చిన ఇండ్ల స్థలాల భూమిని కాజేసిన వైనం
- ఫిర్యాదులు పట్టని రెవెన్యూ అధికారులు
- మూడ్రోజుల్లో నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశం
- అయినా విచారణ చేపట్టని అధికారులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నిజాంపూర్‌కు చెందిన మాజీ సైనికుడు గులాం మహముద్‌కు 22 నవంబర్ 1995లో ప్రభుత్వం కంబాలపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 88లో 5 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రొసీడింగ్ నెంబర్ బీ/3883/1995 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గులాం మహమూద్‌కు పట్టా ఇచ్చింది. మద్దికుంటకు చెందిన ఆరీఫుద్దీన్ మహమూద్ కుటుంబ సభ్యులను సంప్రదించి భూమిని అమ్ముతారా అని అడిగారు. అందుకు గులాం మహమూద్ భార్య నజీమున్నీసాబేగం అంగీకరించారు. దీంతో భూమికి సంబంధించి ఒరిజినల్ పట్టా సరిఫికెట్ ఇవ్వాలని కోరగా.. తన భర్త పేరిట ఉన్న సర్టిఫికెట్‌ను ఇచ్చింది. అది తీసుకెళ్లిన ఆరీఫుద్దీన్.. ఒరిజినల్ ప్రొసీడింగ్ సర్టిఫికెట్ నెంబర్ బీ/3883/1995కు బదులుగా ప్రొసీడింగ్ నెంబర్ బీ/3883/22.11.2000గా ఫోర్జరీ సర్టిఫికెట్ సృష్టించాడు. ఫోర్జరీ సర్టిఫికెట్‌తో ఎన్ఓసీ తీసుకున్నారు. కంబాలపల్లిలో గులాం మహమూద్‌కు ప్రభుత్వం ఇచ్చిన భూమికి మార్కెట్ విలువ లేకపోవడంతో.. ఆరీఫొద్దీన్ తన సొంత ఊరైన మద్దికుంటలో 88 సర్వే నెంబర్‌లోని పేదల భూమి ఐదెకరాలను ఫోర్జరీ సర్టిఫికెట్ పెట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. కాగితాల్లో తప్ప పొజిషన్‌లో భూమి లేకపోయేసరికి 88 సర్వే నెంబర్‌లో ఉన్న పేదల ఇండ్ల స్థలాల భూమి రెండెకరాలు, పేదలకు అసైన్డ్ చేసిన మూడెకరాల భూమిని గులాం మహముద్ నుంచి తాము కొనుగోలు చేసినట్టుగా కబ్జా చేశారు.



గుడ్డిగా ఎన్ఓసీ ఇచ్చిన అధికారులు

ఒరిజినల్ ప్రొసీడింగ్ కాకుండా ఫోర్జరీ సర్టిఫికెట్ పెట్టి ఎన్ఓసీ కోరగా.. రెవెన్యూ అధికారులు కనీసం రికార్డుల్ని పరిశీలించకుండా కాసులకు కక్కుర్తిపడి ఎన్ఓసీ ఇచ్చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అర్జీని పరిశీలించి జత చేసిన ప్రొసీడింగ్ సర్టిఫికెట్ ఒరిజినలా కాదా అన్నది కూడా పరిశీలించలేదు. ఏదీ చూడకుండా తహసీల్దార్ ప్రతిపాదనలు పంపగా ఆర్డీఓ కార్యాలయం నుంచి ఎన్ఓసీ జారీ చేశారు. రాజమ్మ పేరిట ఉన్న రెండెకరాల భూమిని కూడా మహ్మద్ ఖాజా పేరిట మార్పిడి చేశారు. లేని వ్యక్తి ప్రకాశ్‌రావు పేరిట మాజీ సైనికుడి కోటాలో ఐదెకరాల్ని కట్టబెట్టారు.

నజీమున్నీసాబేగంను నమ్మించిన వైనం

ఒరిజినల్ ప్రొసీడింగ్ సర్టిఫికెట్‌కు బదులు ఫోర్జరీ చేసి తమ భూమిని కాకుండా మద్దికుంటలో మరొకరి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న విషయాన్ని నజీమున్నీసాబేగం గమనించలేదు. తమ భూమిని అమ్ముకున్నందున కొనుగోలుదారులు సంతకాలు చేయమన్న చోట చేసేశారు. తన భర్త పేరిట ఉన్న భూమిని కాటం మల్లేశం, ఆరీఫుద్దీన్ అనే ఇద్దరు వ్యక్తుల పేరిట భూమి రిజిస్ట్రేషన్ జరిగింది. ఆమెకు ఇంగ్లీష్ రాకపోవడంతో డాక్యుమెంట్‌లో ఏం రాశారో చూడలేదు. ఫోర్జరీ సర్టిఫికెట్ గురించి కొన్నాళ్ల తర్వాత తెలుసుకున్న నజీమున్నీసాబేగం 2018 జూన్‌లో జిల్లా కలెక్టర్‌కు ఒక డిక్లరేషన్ ఇచ్చారు. ఆరీపొద్దీన్ తమ భూమిని కాకుండా మద్దికుంటలో ఉన్న వేరొకరి భూమిని కొనుగోలు చేసినట్టు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసున్నట్టు మాకు తెల్వదని, మాకున్న కంబాలపల్లిలోని భూమిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేశామంటూ ఆమె కలెక్టర్‌కు రాతపూర్వంగా సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చారు.

ప్రకాశ్‌రావు పేరిట భూమాయ

రాజమ్మ భర్త చెన్న బసప్ప పేరును తొలగించి ఎంఆర్ఓ ప్రొసీడింగ్ బీ/3585/95 ద్వారా 1995లో వ్యాపారి మహ్మద్ ఖాజా పేరును చేర్చారు. సర్వే నెంబర్ 88, 55లో రెండెకరాల భూమిని పట్టా మార్పిడి చేశారు. సదాశివపేట మండలంలోని మద్దికుంట గ్రామంలో 88 సర్వే నెంబర్‌లో 95 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. అందులోంచి 19 సెప్టెంబర్ 1975లో ప్రొసీడింగ్ నెంబర్ ఎ5/6987/7 ద్వారా 81 ఎకరాల ప్రభుత్వ భూమిని సదాశివపేట మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన 41 మంది పేదలకు పంచారు. అదే సర్వేనెంబర్‌లో ఉన్న భూమిలోంచి 10 ఎకరాలను ప్రొసీడింగ్ నెంబర్ బీ/3585/93 ద్వారా ఇండ్లు లేని, నైపుణ్యంలేని నిరుపేద కార్మికులకు ఇండ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. మరో 4 ఎకరాలు జాతీయ రహదారికి, మద్దికుంట రోడ్డుకు రెండున్నర ఎకరాలు పోయింది. ఎకరం మాజీ సైనికుడి కుటుంబానికి చెందిన అమీనాబీకి పంపిణీ చేశారు. 20 గుంటలు మాత్రమే కారిజ్ ఖాతాగా ఉన్నది. 88 సర్వే నెంబర్‌లో భూమి మిగల్లేదు. పాత ప్రొసీడింగ్ పేరిటనే సింగరాయపాలెంకు చెందిన జీవీఎస్ఎస్ ప్రకాశ్‌రావు మాజీ సైనికుడి పేర 88 సర్వే నెంబర్‌లో 5 ఎకరాల్ని అదే రోజున పట్టా సర్టిఫికెట్ ఇచ్చినట్టు ఫోర్జరీ పట్టా సృష్టించారు. ప్రకాశ్‌రావుకు భూమి కేటాయించినట్టు రెవెన్యూ రికార్డుల్లో ఏ పత్రాలూ లేవు.



రూ.40 కోట్ల భూమి కాజేసిన తంతు

ఫోర్జరీ సర్టిఫికెట్ పెట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్న మొత్తం 10 ఎకరాల భూముల విలువ రూ.40 కోట్లపైనే ఉంటుంది. ముంబయి హైవే పక్కన ఉన్న భూములు కావడంతో అధిక ధరకు విక్రయాలు సాగాయి. చేతులు మారాక ప్రస్తుతం ప్లాటింగ్ చేసి గజం భూమిని రూ.20 వేల నుంచి రూ.25 వేలకు విక్రయిస్తున్నారు. భూ కబ్జా గురించి అప్పటి తహసీల్దార్ ఆశాజ్యోతి, ఆర్ఐ వీరేశంకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినప్పటికీ భూముల కబ్జా వ్యవహారం గురించి వాళ్లు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.మద్దికుంటలోని 88 సర్వే నెంబర్‌లో ప్రకాశ్‌రావు పేరిట ఐదు ఎకరాలు, మహముద్ పేరిట మరో 5 ఎకరాలను అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జాయింట్ రిజిస్ట్రేషన్ ఉన్న భూమిని ఆరీఫుద్దీన్ ఒక్కడే ఢిల్లీకి చెందిన లతాగుప్తకు విక్రయించారు. ఆమె సదాశివ ఎన్‌క్లేవ్ డెవలప్‌మెంట్ సంస్థకు అప్పజెప్పి ప్లాట్స్ చేసి అమ్ముతున్నట్టు తెలిసింది.

ఫోర్జరీ ప్రొసీడింగ్‌తో రూ.40 కోట్ల విలువ చేసే పదెకరాల భూమిని కబ్జా చేశారు కొంతమంది ప్రబుద్ధులు. కంబాలపల్లిలో భూమి ఉంటే మద్దికుంటలో విలువైన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వ్యక్తి లేకపోయినా అతని పేరిట మాజీ సైనికుడి కోటాలో ఐదెకరాల్ని కాజేశారు. సదాశివపేట రెవెన్యూలో అంతు చిక్కని భూదందా లోగుట్టు వ్యవహారమిది. ఫోర్జరీ పత్రాలతో ఎన్ఓసీకి అర్జి పెడితే గుడ్డిగా తహసీల్దార్ ప్రతిపాదన పంపగా ఆర్డీఓ ఎన్ఓసీ ఇచ్చేశారు. ముంబయి జాతీయ రహదారి వెంట ఉన్న విలువైన భూముల్ని కాజేసిన వైనంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులకు పట్టించుకోకపోవడం గమనార్హం. అసలు విషయం తెలిసి బాధిత కుటుంబం లబోదిబోమంటోంది.

విచారణకు ఆదేశించిన కలెక్టర్

మద్దికుంట భూ కబ్జా గురించి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికి జనవరి 19న ఫిర్యాదు అందింది. భూమి గోల్‌మాల్ జరిగిన లోగుట్టుకు సంబంధించిన ఆధార పత్రాల్ని కలెక్టర్‌కు ఇచ్చారు.స్పందించిన కలెక్టర్ మూడ్రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓకు రాశారు. 16 రోజులైనా ఎలాంటి విచారణ జరగలేదు. కలెక్టర్ ఆదేశాల్ని రెవెన్యూ అధికారులు ఖాతరు చేయకపోవడం గమనార్హం.

సచివాలయం నిర్మాణ ఖర్చెంత...?

- వివాదాస్పదమవుతున్న వ్యయం
- ఐటీ, ఆర్అండ్‌బీ మధ్య చర్చోపచర్చలు
- అవినీతి,అక్రమాలు జరిగాయంటున్న రాజకీయ పక్షాలు
- రూ.50 కోట్ల పనులు పెండింగ్

తెలంగాణ పరిపాలనా సౌధం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం నిర్మాణం వివాదాస్పదమవుతున్నది. ఆ భవనానికి అయిన ఖర్చు విషయంలో మళ్లీ చర్చోపచర్చలు చోటుచేసుకుంటున్నాయి. అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ భారీ నిర్మాణానికి అయిన ఖర్చెంత అంటే ఇతమిద్దంగా ఇంత అని చెప్పలేని పరిస్థితి ఇప్పుడు అధికారవర్గాల్లో కనిపిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక భవనానికి చేసిన వ్యయం విషయంలో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలు గతంలోనే ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడివి మరింత బలపడుతున్నాయి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

కొత్త సెక్రెటేరియట్ టెండర్లతో సంబంధం లేకుండా కొన్ని పనులు చేశారనే విమర్శలు తాజాగా వస్తున్నాయి. సాధారణంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికార పక్షానికి, ప్రతిపక్షానికి మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం, అరోపణలు, విమర్శలు చేసుకోవడం సహజమే.

డీపీఆర్‌లో చేర్చని ప్రార్థన మందిరాలు

సచివాలయం చుట్టుతా నిర్మించిన దేవాలయం, మసీదు, చర్చి ఖర్చు కూడా తొలుత డీపీఆర్‌లో చేర్చలేదని ఆర్అండ్‌బీ చెబుతున్నది. కొత్తగా రోడ్లు సైతం చివరలో వేయాల్సి వచ్చిందనీ, దీంతో సచివాలయం భవన నిర్మాణం ఖర్చు తడిసిమోపెడైందని సమాచారం.

ఐటీ ఖర్చును ఆర్అండ్‌బీ బడ్జెట్‌లోనే చూపించాలని ఆ శాఖ కోరినా సంబంధిత అధికారులు తిరస్కరించారని తెలిసింది. ఈనేపథ్యంలో మొత్తం ఖర్చు రూ.1440 కోట్ల దాకా అయినట్టేనని అధికారులు అంటున్నారు. ఇదిలావుండగా సచివాలయంలో ఇప్పటికీ చేయాల్సి పనులు ఇంకా ఉన్నాయి. ఇప్పుడు కూడా జరుగుతున్నాయి. దాదాపు రూ. 50 కోట్ల మేర పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

అయితే ఈ సచివాలయం నిర్మాణంలో జరిగిన కొన్ని పనులకు అసలు టెండర్లే పిలవక పోవడం పాత సర్కారులోని ఉన్నతాధికారులపై అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. ప్రధానంగా ఐటీకి సంబంధమైన పనుల విషయంలో వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుని అమలుచేశారనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయం సెక్యూరిటీతోపాటు అంతర్గతంగా అవసరమైన ఎలక్ట్రానిక్, కంప్యూటర్ సంబంధమైన నెట్‌వర్కింగ్ పరికరాలు, సాఫ్ట్‌వేర్, ఇతరాలకు దాదాపు రూ. 300 కోట్లు ఖర్చు చేశారు. నిజానికి ఇది రూ. 50 కోట్ల లోపే ఉంటుందని సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హవా నడిపిన ఆ అఖిల భారత సర్వీస్ అధికారి ఈవిషయంలో చొరవ చూపి పరికరాలను కోనుగోలు చేశారని బహిరంగంగానే కొందర రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారు.

నిజానికి ఆ భవనానికి తొలుత వ్యయం రూ.550 కోట్లుగా డీపీఆర్‌లో పేర్కొన్నారు. అందులో జీఎస్టీ మొత్తం కూడా ఉన్నట్టు అప్పట్లో ఆర్అండ్‌బీ అధికారులు సెలవిచ్చారు. ఆ తర్వాత రూ. 611 కోట్లకు అంచనాలు పెంచారు. శంకుస్థాపన చేసిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు భవనానికి సంబంధించి పలు అంశాల్లో సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు పోయారు. సచవాలయ భవనం ప్లాన్ అనేక మార్పులు, చేర్పులకు గురైంది. అప్పటి ముఖ్యమంత్రి, మంత్రులు సలహాలు, సూచనలు వర్కింగ్ ఏజెన్సీ పాటించాల్సి వచ్చింది. చెన్నయ్‌కు చెందిన పొన్ను ఆస్కార్ అర్కిటెక్స్ కంపెనీ సచివాలయాన్ని డిజైన్ చేసింది.షాపూర్జీ–పల్లోంజీ సంస్థ నిర్మించింది. తొలుత 2022 , అక్టోబర్ దసరా పండుగ రోజున సచివాలయాన్ని ప్రారంభించాలని అనుకున్నారు. అయితే నిర్మాణం ఆలస్యం కావడంతో గత ఏడాది ఏప్రిల్ 30 ప్రారంభించారు. మే 30 నుంచి సచివాలయం అధికారికంగా విధుల్లోకి వచ్చింది.

తడిసి మోపెడు..

చివరకు మొత్తం భవన నిర్మాణం పూర్తయ్యేనాటికి ఖర్చు రూ.1140 కోట్లకు చేరినట్టు రోడ్లు, భవనాల శాఖ అధికారులు అంటున్నారు. ఇందులో రూ.100 కోట్లు ఫర్నీచర్‌కే ఖర్చు చేయడం గమనార్హం. అలాగే జీఎస్టీ మొత్తం రూ. 100 నుంచి రూ. 150 కోట్లు ఉందని చెబుతున్నారు. కీలకమైన నెట్‌వర్కింగ్ ఖర్చు మాత్రం రూ.300 కోట్లు అయినట్టు తెలిసింది. ఈ నిధులు ఎలాంటి టెండర్లు లేకుండా ఖర్చుపెట్టారు. సచివాలయం ప్రారంభానికి అప్పటి ప్రభుత్వం తొందరపడిందనీ, పనులు పూర్తికాకముందే చేసిందనే వ్యాఖ్యానాలు అప్పట్లోనే వచ్చాయి. టెండర్లు పిలిచే సమయం లేకపోవడంతో కంపెనీల నుంచి నేరుగా కంప్యూటర్లు, ఇతర పరికరాలు కొనాల్సి వచ్చిందని ఐటీ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో అవీనితి జరిగిందని రాజకీయపార్టీలు ఆరోపిస్తున్నాయి.

ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తమ తొలి పార్లమెంటేరియన్‌గా సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఎంపికయ్యారు. విశిష్ట లోక్‌మత్ పార్లమెంటరీ అవార్డు 2023ను జాన్ బ్రిట్టాస్ అందుకున్నారు. మంగళవారం నాడిక్కడ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో రాజకీయ రంగానికి చెందిన ప్రముఖుల సమక్షంలో నిర్వహించిన ఒక ముఖ్యమైన వేడుకలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, సహాయ మంత్రి రాందాస్ అథవాలే సమక్షంలో జాన్ బ్రిట్టాస్‌కు అవార్డును అందజేశారు. లోక్‌సభలో అత్యుత్తమ కృషికి లోక్‌మత్ అవార్డును ఎంపీ శశిథరూర్ అందుకున్నారు. లోక్‌సభ ఎంపీలు డానిష్ అలీ, మేనకా గాంధీ, హర్‌సిమ్రత్ కౌర్, రాజ్యసభ ఎంపీలు రాం గోపాల్ యాదవ్, సస్మిత్ పాత్ర, సరోజ్ పాండే కూడా లోక్‌మత్ అవార్డులను అందుకున్నారు. పార్లమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఆధారంగా ఈ అవార్డు లభించింది. జ్యూరీ ప్రెసిడెంట్, కేంద్ర మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్, లోక్‌మత్ మీడియా గ్రూప్ చైర్మన్ విజయ్ దర్డా తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.జ్యూరీ ప్రెసిడెంట్, కేంద్ర మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్ జాన్ బ్రిట్టాస్‌ను ప్రశంసించారు. రాజ్యసభలో ప్రశ్నలు, ప్రైవేట్ బిల్లులు, చర్చల్లో పాల్గొనడం మొదలైన వాటితో సహా పార్లమెంటరీ కార్యక్రమాల్లో ప్రావీణ్యం వల్లనే ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, లాల్ కష్ణ అద్వానీ, మురళీ మనోహర్ జోషి, శరద్ పవార్, ములాయం సింగ్ యాదవ్, శరద్ యాదవ్, సీతారాం ఏచూరి, జయా బచ్చన్, సుప్రియా సూలే, ఎన్షికాంత్ దూబే, హేమా మాలిని మరియు భారతీ పవార్ వంటి సీనియర్ నాయకులు గత సంవత్సరాల్లో లోక్‌మత్ అవార్డును అందుకున్నారు. గతేడాది అవార్డు హైదరాబాద్‌కు చెందిన అసదుద్దీన్ ఓవైసీకి దక్కింది.

ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

- మూణ్నెళ్ల తర్వాత తెలంగాణ భవన్‌లో అడుగు పెట్టిన బీఆర్ఎస్ బాస్
- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు
- కేఆర్ఎంబీతో ప్రజల మద్ధతు కూడగట్టుకునేందుకు ప్రయత్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎట్టకేలకు ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్‌లో తెలంగాణ భవన్‌లో సమావేశం నిర్వహించిన అనంతరం ఇప్పుడు మూణ్నెళ్ల తర్వాత మళ్లీ ఆయన ఆ కార్యాలయంలో అడుగు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, అనంతరం ఆయన తుంటి విరగడం, శస్త్రచికిత్స నిర్వహించటం తదితర పరిణామాల నేపథ్యంలో ఆయన ఇప్పటి వరకు ఇంటికే పరిమితమయ్యారు. పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపేందుకు ఓపిక చేసుకుని మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా అక్కడ పెద్ద సంఖ్యలో గుమిగూడిన కార్యకర్తలు, నాయకులు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ జిందాబాద్, బీఆర్ఎస్ జిందాబాద్ అంటూ వారు పెద్దపెట్టున నినాదాలిచ్చారు. మహిళా కార్యకర్తలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం గులాబీ బాస్ కేఆర్ఎంబీపై కీలక సమావేశాన్ని నిర్వహించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాల్లో కారు పార్టీ ఘోరంగా ఓటమి పాలైంది. ఖమ్మంలో 10 స్థానాలకుగానూ కేవలం ఒకే ఒక్క స్థానంలో ఆ పార్టీ గెలిచింది. నల్లగొండలో 12 స్థానాలకుగానూ కేవలం సూర్యాపేటతోనే సరిపెట్టుకుంది. మహబూబ్ నగర్‌లో 14 స్థానాలుంటే 12 స్థానాల్లో ఓడిపోయింది. వరంగల్‌లో కూడా కేవలం 2 స్థానాలకే బీఆర్ఎస్ పరిమితమైంది. ఈ ఫలితాలు మొత్తం గవర్నమెంటునే తారుమారు చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలపై మరోసారి పట్టు సాధించేందుకు వీలుగా కేఆర్ఎంబీ అంశాన్ని కేసీఆర్ తెరపైకి తెచ్చారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపైన్నే మంగళవారం కీలకమైన భేటీ నిర్వహించి, నల్లగొండలో బహిరంగసభకు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించినట్టు తెలిసింది. రేవంత్‌వి పిల్ల చేష్టలంటూ బీఆర్ఎస్ అధినేత ఎద్దేవా చేశారు. తనను, బీఆర్ఎస్‌ను ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారనీ, ఈ విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గులాబీ పార్టీని టచ్ చేయటం రేవంత్ వల్ల కాదంటూ కారు సారు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హేమాహేమీలను ఎదుర్కొన్న చరిత్ర బీఆర్ఎస్ సొంతమని గుర్తు చేశారు. అలాంటిది రేవంత్ వల్ల ఏమవుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలనపైనా, ప్రభుత్వంపైనా ఆయనకు ఎలాంటి అవగాహనా, అనుభవం లేదంటూ కొట్టి పారేశారు. అందువల్లే రాష్ట్రానికి నష్టం చేకూర్చే విధంగా కేఆర్ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు వెళ్లే విధంగా కేంద్రానికి అధికారం అప్పజెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అంశాలన్నింటిని ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ కేసీఆర్ ఈ సందర్భంగా నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సైతం హైదరాబాద్ నందినగర్‌లో గల తన నివాసంలో కేసీఆర్ ... నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నేతలతో విడివిడిగా సమావేశమయ్యారు.

సమన్వయకర్తలు వీరే...

కృష్ణా నదీ ప్రాజెక్టులు, నదీ జలాల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 13న నల్లగొండలో జరిగే బహిరంగ సభకు సమన్వయకర్తలను కేసీఆర్ ప్రకటించారు.

1.హుజూర్ నగర్ - మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్
2.దేవరకొండ - పంజాల గోపిరెడ్డి
3.నల్లగొండ - రవీందర్ సింగ్
4.తుంగతుర్తి - మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి
5. మునుగోడు - నందికంటి శ్రీధర్
6. కోదాడ - ఎమ్మెల్సీ రవీందర్ రావు
7.నకిరేకల్ - మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
8. మిర్యాలగూడ - ఆదర్శ్ రెడ్డి, ముజీబ్
9.సూర్యాపేట - మాజీ మంత్రి జోగు రామన్న
10. నాగార్జున సాగర్ - మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్
11.భువనగిరి - మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, జీ.వీ.రామ కృష్ణా రావు
12.ఆలేరు - మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

ఇది ముమ్మాటికీ తెలంగాణ వ్యతిరేక వైఖరే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా వారికి వివరించారు. రైతాంగ ప్రయోజనాల కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ఉద్యమంలో సాగు, తాగునీటి హక్కులకోసం పోరాడటమే కాకుండా 'మా నీళ్లు మాకే...' అనే ప్రజా నినాదాన్ని ఎత్తుకున్నామని గుర్తు చేశారు. స్వయంపాలన ప్రారంభమైన అనతికాలంలోనే ఆ నినాదాన్ని నిజం చేసి చూపించామని తెలిపారు. కేఆర్ఎమ్‌బీ పేరుతో కృష్ణా నదీ ప్రాజక్టులపై తెలంగాణ హక్కులను కైవసం చేసుకునేందుకు కేంద్రం వేసే ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తాము తిప్పికొట్టామని వివరించారు. అనేక ఒత్తిళ్లను తట్టుకుంటూ పదేండ్లపాటు నీటి వాటాలను కాపాడేందుకు కృషి చేశామని చెప్పారు,. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవగాహన రాహిత్యంతో తీసుకున్న నిర్ణయం వల్ల భవిష్యత్తులో ప్రాజెక్టుల కట్టల మీదికి కూడా పోలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేఆర్ఎమ్‌బీ పరిధిలోకి ప్రాజెక్టులు వెళితే హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలకు సాగు, తాగునీరు అందక తిరిగి కరువుకోరల్లో చిక్కుకునే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా మద్దతుతో ఇలాంటి చర్యలను తిప్పికొడతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, మల్లారెడ్డి, పువ్వాడ అజయకుమార్, సత్యవతి రాథోడ్‌తోపాటు ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్లు ఢిల్లీకి సూట్‌కేసులు మోస్తున్నరు

- ఎన్నికల ఫండ్ కోసం రియల్టర్లు , వ్యాపారులకు బెదిరింపులు
- మోడీ ముందు డబ్బులు పనిచేయవ్
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఎన్నికల ఫండ్ కోసం రియల్టర్లు, వ్యాపారులను బెదిరించి వసూలు చేసిన డబ్బులతో సూట్‌కేసులను తీసుకుని ఢిల్లీకి చేరవేస్తున్నారనీ, అందుకే తరుచూ హైదరాబాద్ టూ ఢిల్లీ తిరుగుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో ఏ పార్టీతోనూ సంబంధం లేని వారే ఎక్కువ ఉన్నారనీ, వారిని బీజేపీ వైపు ఆకర్షితులయ్యేలా ప్రణాళికలు వేసుకుని ముందుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గావ్ చలో కార్యక్రమంలో భాగంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేటలో ఆయన పర్యటించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆ తర్వాత బూత్ ఇన్‌చార్జులు, మహిళాల సంఘాల సభ్యులు, దళితులు, రైతులు, యువకులు, క్రీడాకారులు, అయ్యప్ప, శివ భక్తులు, ఉద్యోగులు, గ్రామ ప్రముఖులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. అందులో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, సర్పంచి శ్రీశైలంగౌడ్, తదితరులు పాల్గొన్నారు. బూత్ ఇన్‌చార్జులు, మహిళా సంఘాల సభ్యుల సమావేశాల్లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల మోడీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర ధరలు పెరగకుండా స్థిరంగా ఉన్నాయనీ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని చెప్పారు. 82 కోట్ల మంది పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తున్న ఘనత మోడీదేనని కొనియాడారు. ఒక్క నిరసన కార్యక్రమం కూడా లేకుండా, ప్రతిపక్షాలు నోరెత్తకుండా మోడీ పాలన కొనసాగుతున్నదని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు దేశంలో 2,400 కిలోమీటర్ల జాతీయ రహదారులను వేయిస్తే..పదేండ్ల మోడీ పాలనలో 5 వేల కిలోమీటర్లకుపైగా జాతీయ రహదారులను వేయించామని తెలిపారు. దేశం అభివృద్ధి కావాలంటే కనెక్టివిటీ ముఖ్యమనీ, అందుకే రైలు, రోడ్డు, విమానయాన, జల రవాణాను పెంచుతున్నామన్నారు. గ్రామంలో ఓటర్లను చేరువకావడానికి బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వ్యాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను, మోడీ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను వాటిలో ప్రచారం చేయాలని సూచించారు. అన్నిపార్టీల కార్యకర్తలు బీజేపీ వైపు ఆకర్షితులయ్యేలా ప్రణాళికలు వేసుకోవాలని ఆదేశించారు. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలోనూ 51 శాతం ఓట్లే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల అమలుపైనా, రైతుబంధు, రుణమాఫీపైనా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల్లోకి వెళ్లాలన్నారు. బూత్‌ల వారీగా పార్టీ బలోపేతం కోసం పలు సూచనలు చేశారు.

యుద్ధప్రాతిపదికన రేషన్‌కార్డులివ్వాలి: కిషన్‌రెడ్డి

రేషన్‌కార్డుల్లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ, యుద్ధప్రాతిపదికన కొత్త వాటిని ఇవ్వాలని జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా అమీర్‌పేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారంటీల హామీలు గారడీగా మారాయని విమర్శించారు. అప్పులు తీసుకుని ముందుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్నదనీ, దీని వల్ల రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్థిక వనరులను సమకూర్చుకునే విషయంలో రేవంత్ ప్రభుత్వానికి స్పష్టత లేదని విమర్శించారు. ఖమ్మం లోక్‌సభస్థానంలోనూ కాంగ్రెస్‌కు చెమటలు పట్టిస్తామనీ, 17 స్థానాలు గెలవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ఎంపీ స్థానం పరిధిలో అసదుద్దీన్ ఓవైసీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

కాదేదీ లీకేజీకి అనర్హం..

న్యూఢిల్లీ : గత ఐదు సంవత్సరాల్లో పదిహేను రాష్ట్రాల్లో పరీక్షా పత్రాల లీకేజీలకు సంబంధించి 41 ఆధారాలను ఈ పత్రిక సంపాదించింది. ఈ లీకేజీల కారణంగా 1.4 కోట్ల మంది నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారు. వారే కాదు...వారి కుటుంబాలు, తదుపరి బ్యాచ్‌ల అభ్యర్థులు కూడా ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఈ లీకేజీల్లో 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా అనేక రాష్ట్రాలకు సంబంధం ఉంది. ఉదాహరణకు రాజస్థాన్‌లో జరిగిన పేపర్ లీకేజీలలో కాంగ్రెస్ పెద్దల హస్తం ఉన్నదని బీజేపీ ఆరోపిస్తే తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్రపై కాంగ్రెస్ విమర్శలు సంధించింది. అయితే రాజస్థాన్‌లో కాంగ్రెస్, తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి పాలయ్యాయి. పలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా ఈ లీకేజీలు సర్వసాధారణమయ్యాయి.

రద్దయితే అంతే సంగతులు

లీకేజీ కారణంగా పరీక్ష రద్దయిన సందర్భంలో దానిని మళ్లీ నిర్వహించేందుకు చాలా కాలం పడుతోంది. ఉదాహరణకు తెలంగాణలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను 2022 అక్టోబర్ 16న నిర్వహించారు.

పేపర్ లీలైందని నిర్ధారణ కావడంతో పరీక్షను గత సంవత్సరం మార్చిలో రద్దు చేశారు. గత సంవత్సరం జూన్ 11న తిరిగి పరీక్ష నిర్వహించినప్పటికీ కొందరు విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో మళ్లీ రద్దయింది. దీంతో 503 పోస్టుల కోసం పోటీ పడిన 3.8 లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణకే ఇంత జాప్యం జరిగితే ప్రక్రియ మొత్తం పూర్తి కావడానికి ఎంత సమయం పడుతుందోనని అభ్యర్థులు వాపోతున్నారు. కనీసం 15 సందర్భాల్లో పరీక్ష రద్దయిన సంవత్సరం తర్వాత కానీ దానిని తిరిగి నిర్వహించలేదు.

గుజరాత్‌లో 2019 నవంబరులో సుమారు నాలుగు వేల క్లర్కులు, ఆఫీస్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షకు ఆరు లక్షల మంది హాజరయ్యారు. అయితే ఆ పరీక్ష రద్దయింది. రెండు సంవత్సరాలకు పైగా వేచి చూసిన తర్వాత 2022 ఏప్రిల్‌లో తిరిగి పరీక్ష నిర్వహించారు.

అసోంలో 597 ఎస్ఐ పోస్టుల భర్తీకి 2020 సెప్టెంబర్ 9న పరీక్ష జరిపారు. పరీక్ష మొదలైన కొద్ది నిమిషాలకే ప్రశ్నాపత్రం వాట్సప్‌లో చక్కర్లు కొట్టడంతో దానిని రద్దు చేశారు. ఈ పరీక్షకు 66 వేలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఇలా అనేక రాష్ట్రాల్లో పరీక్ష రద్దయితే చాలు...తిరిగి నిర్వహించడానికి ఏళ్లూ పూళ్లూ పడుతోంది.

బాధ్యులపై చర్యలేవి?

తెలంగాణలో గత సంవత్సరం జనవరి, ఫిబ్రవరి నెలల్లో అకౌంట్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల నియామకాలకు సంబంధించి నిర్వహించిన మూడు పరీక్షలను రద్దు చేశారు. కానీ ఇప్పటి వరకూ లీకేజీకి కారకులను అరెస్ట్ చేయలేదు.

రాష్ట్రంలోని రెండున్నర లక్షల మంది ఈ పరీక్షలు రాశారు. శాసనసభ ఎన్నికలు, ఇతర కారణాలతో పరీక్షల నిర్వహణ ఇప్పటి వరకూ సాధ్యపడలేదు. హర్యానాలో గత సంవత్సరం జనవరి 15న జరిగిన ఉద్యోగ నియామక పరీక్ష కూడా లీకేజీ అనుమానాలతో రద్దయింది. ఇప్పటి వరకూ ఈ కేసులో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. రద్దయిన పరీక్షను తిరిగి నిర్వహించనూ లేదు.

చట్టాలు, ఆర్డినెన్సులు ఫలితమిచ్చేనా?

పోటీ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకల కారణంగా పలు కుంభకోణాలు వెలుగు చూడడంతో అనేక రాష్ట్రాలు సొంతంగా చట్టాలు‌ రూపొందించుకుంటున్నాయి. రాజస్థాన్‌లో 2021లో ఉపాధ్యాయుల అర్హత పరీక్ష రద్దయింది. ఫలితంగా 12.67 లక్షల మంది అభ్యర్థులు నష్టపోయారు. లీకేజీతో సంబంధమున్న వంద మందిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. లీకేజీ వీరులకు పది సంవత్సరాల వరకూ జైలుశిక్ష, రూ.10 కోట్ల వరకూ జరిమానా విధించేలా దీనిని రూపొందించింది. ఆస్తుల జప్తుకు కూడా వీలు కల్పించింది.

అయినప్పటికీ లీకేజీల జోరు తగ్గలేదు. జార్ఖండ్, ఉత్తరాఖండ్, గుజరాత్, అసోం రాష్ట్రాలు కూడా గత సంవత్సరం చట్టాలు తీసుకొచ్చాయి. ఆర్డినెన్సులు జారీ చేశాయి.

లీకేజీలకు అడ్డుకట్ట వేసేందుకు త్వరలోనే చట్టాలు చేస్తామని మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్, కర్నాటక ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. అయితే కేంద్రం కానీ, రాష్ట్రాలు కానీ ఆమోదించిన చట్టాలు, జారీ చేసిన ఆర్డినెన్సులు ప్రశ్నాపత్రాల లీకేజీలను ఏ మేరకు అడ్డుకోగలవో వేచి చూడాల్సిందే.

పరీక్ష ఏదైనా ఒకటే...

కాదేదీ లీకేజీకి అనర్హం అన్నట్లు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో ఉపాధ్యాయుల అర్హత పరీక్ష మొదలుకొని అసోం, రాజస్థాన్, కర్నాటక, జమ్మూకాశ్మీర్‌లో పోలీస్ నియామక పరీక్షల వరకూ... ఉత్తరాఖండ్‌లో అటవీ శాఖలో నియామకాల పరీక్ష నుండి తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, రాజస్థాన్‌లో ఇంజినీర్ల నియామక పరీక్ష వరకూ... అన్నీ లీకేజీలే. అసోంలో పరీక్ష ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే ప్రశ్నాపత్రం వాట్సప్‌లో ప్రత్యక్షమైంది. రాజస్థాన్‌లో ఓ సర్కారు ఉద్యోగి ప్రభుత్వ కార్యాలయం నుండి ప్రశ్నాపత్రాన్ని దొంగిలించాడు. మధ్యప్రదేశ్‌లో పరీక్ష జరిగితే దాని నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ముంబయి ప్రైవేటు కంపెనీ సర్వర్లను నిందితుడు హ్యాక్ చేశాడు. మహారాష్ట్రలో సోషల్ మీడియాలో పేపర్ లీకైందంటూ ఓ విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


అనుమతి ఒకచోట.. తవ్వేది మరోచోట

ఏజెన్సీలో అక్రమ మైనింగ్..!

- జేసీబీ, టిప్పర్లు, భారీ వాహనాల వినియోగం

నవతెలంగాణ–వాజేడు

ఏజెన్సీలో ఇసుకాసురులు కోట్లు కొల్లగొడుతున్నారు.. అనుమతులు ఒక చోట తీసుకుని.. తవ్వకాలు మరో చోట చేపడుతున్నారు. భారీ యంత్రాల ద్వారా ఇసుకను పెద్దఎత్తున తోడేస్తుండటంతో ఇసుక ర్యాంపు బొగ్గు గనులను తలపిస్తున్నాయి.. అటు ప్రభుత్వాన్ని.. ఇటు ఏజెన్సీ చట్టాలను, ఆదివాసీలను మోసగిస్తూ కాంట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన సరిహద్దు పరిధిలో ఇసుక తవ్వకుండా సరిహద్దులు దాటి తోడుతుండటం గమనార్హం.ఈ తతంగమంతా ములుగు జిల్లా వాజేడు మండలం పరిధి అయ్యవారిపేట–2 ఇసుక ర్యాంపులో జరుగుతోంది.



కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న వైనం

వాజేడు మండలం పరిధిలో ధర్మవరం ఇసుక ర్యాంప్, అయ్యవారిపేట–2 ఇసుక ర్యాంపులు ఉన్నాయి. నెల రోజుల కిందట ధర్మవరం ఇసుక ర్యాంప్‌టాగింది. అయ్యవారిపేట–2 ఇసుక ర్యాంపులో భారీ యంత్రాలతో పనులచేపడుతున్నారు.

పరిమితులకు మించి ఇసుక తోడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2మీటర్ల లోతు వరకే తీయాల్సి ఉండగా.. సుమారు 50 మీటర్ల లోతు వరకు ఇసుకను తీస్తున్నారు. దీంతో భూ గర్భజలాలు అడుగంటాయి. ప్రతి రోజూ వందల లారీల ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో లారీలో 2నుంచి 3వరకు అదనపు బకెట్‌ల ఇసుకను పంపుతున్నారన్న ఆరోపణలున్నాయి. సుమారు 300బకెట్‌ల ఇసుకను అదనంగా తరలిస్తూ కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఒక బకెట్ విలువ ర్యాంప్ వద్ద రూ.2000వేలు, బయట రూ.4000దాకా అక్రమంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు రూ.12లక్షల దాకా అక్రమంగా ధనార్జనకు పాల్పడుతున్నట్టు ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కన్నెత్తి చూడట్లేదు. ఇసుక ర్యాంపులో అక్రమాలు బయట పడకుండా అమాయక ఆదివాసులను కాంట్రాక్టర్లు రక్షణ వలయంగా ఏర్పరచుకొని క్యాంపులోకి ఎవరు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు.

ఇసుక తరలింపునకు ఏకంగా గోదావరిలో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఇసుక ర్యాంపు అక్రమాలపై పలు రకాల ఫిర్యాదులు రెవెన్యూ అధికారులకు వచ్చినా పట్టించుకోకుండా, నామమాత్రంగా పర్యవేక్షణ చేస్తూ చేతులు దులుపుకుంటున్న పరిస్థితి. ఇసుక ర్యాంపులో అక్రమాలపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి, వ్యాపారులపై, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

వాజేడు మండలంలోని అయ్యవారిపేట–2 ఇసుక ర్యాంపులో అవినీతి పేట్రేగిపోతోంది. ఏజెన్సీ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తూ ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు పర్యవేక్షించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. ఇసుక ర్యాంప్‌పై విచారణ జరిపి నిలుపుదల చేయాలి.



కొప్పుల రఘుపతి,
సీపీఐ(ఎం)మండల కార్యదర్శి

నవతెలంగాణ

అలవాటును ప్రతిఘటించకపోతే, త్వరలో అవసరంగా మారుతుంది
- సెయింట్ ఆగస్టిన్

ఈ కడుపు కోతకు బాధ్యులెవరు..?

సంపాదకీయం

మూడు రోజుల కిందట ఆ సంఘటన భువనగిరి ప్రాంత ప్రజల హృదయాల్ని కలచివేసింది. ఇప్పుడు రాష్ట్రం మొత్తం అట్టుడికిపోతున్నది. భువనగిరి ఎస్సీ బాలికల వసతిగృహంలో పదోతరగతి చదువుతున్న పదిహేనేండ్ల వైష్ణవి, భవ్యల 'ఆత్మ'హత్య' దీనికి కారణం. 'వారిద్దరూ ర్యాం

అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ విద్యా విధానం పూర్తిగా మారిపోతున్నది. ఢిల్లీలో మోడీ తెస్తానంటున్న నూతన జాతీయ విద్యా విధానంలో భూతద్దం పెట్టి వెతికినా అమ్మాయిల రక్షణ గురించి ఒక్క ముక్క కూడా కనబడదు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద పిల్లల కోసమంటూ హడావుడిగా తీసుకొచ్చిన గురుకులాల్లో వసతులు కల్పించాల్సిన బాధ్యత ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది. అంతేకాదు ఆడపిల్లలకు రక్షణ కల్పించి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం కూడా ప్రభుత్వానిదే.

గింక్‌కి పాల్పడ్డారు. అందుకే కౌన్సెలింగ్ ఇచ్చాం. ఇంట్లో వారికి ఆ విషయం తెలిసిపోయిందనే భయంతోనే వారు ఆత్మహత్య చేసుకొని ఉంటారు' అనేది పోలీసులకు ఆ హాస్టల్ వార్డెన్ ఇచ్చిన సమాచారం. మరి వారు నిజంగా ఉరి వేసుకోవడం వల్లనే చనిపోతే వీపుపై విపరీతంగా కొట్టిన గాయాలు, చేతిపై, మెడపై పంటితో కొరికిన ఆనవాళ్ళు ఎక్కడి నుండి వచ్చాయని ఆ పిల్లల తల్లిదండ్రుల సూటి ప్రశ్న. వీటికి సమాధానం ఎవరు చెప్పాలి? ఆ తల్లుల కడుపు కోత ఎవరు తీర్చాలి? ఆ తల్లిదండ్రుల గుండె బరువు ఎవరు దింపాలి?

ఇప్పుడు వీరి మరణంతో రాష్ట్రంలో గురుకులాల దుస్థితి మరోసారి అందరి దృష్టికొచ్చింది. ముఖ్యంగా అమ్మాయిల రక్షణ విషయంలో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి నిరుపేదలు ఈ పాఠశాలలు తమకు ఓ వరమనుకున్నారు. తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని ఆశపడ్డారు. కానీ ఈ వసతిగృహాలే ఇప్పుడు తమ పిల్లల పాలిట మృత్యుకుహరాలుగా మారాయని తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల హాస్టళ్లు సమస్యల ఊబిలో కూరుకుపోయాయి. రక్షణ కరువైన అద్దె భవనాలు, శిథిలావస్థకు చేరిన తరగతి గదులు, నాణ్యతలేని ఆహారం, అవినీతికి పాల్పడుతున్న నిర్వాహకులు, తలుపులు లేని మరుగుదొడ్లు, కాలకృత్యాలకు కరువైన నీటి వసతి... వెరసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల గురుకులాలు అన్నట్టుగా ఉన్నాయి.

ఇక అమ్మాయిల రక్షణ గురించి మాట్లాడుకుంటే కడుపు తరుక్కుపోతుంది. ముఖ్యంగా ప్రభుత్వ వసతి గృహాల్లో రక్షణ అధ్వాన్నంగా తయారయింది. ప్రహరీ గోడలు లేని హాస్టళ్లు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. దీంతో ఎవరైనా హాస్టళ్ళ



లోకి చొరబడే అవకాశం ఉంది. నేటికీ అనేక మారుమూల గ్రామాల్లో, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని అమ్మాయిలు హాస్టళ్లలో నీటి సౌకర్యం లేక బట్టలు ఉతుక్కోవడానికి వీధి పంపులపై, చెరువులపై ఆధారపడుతున్నారు. మరుగుదొడ్లు లేక, ఉన్నా ఉపయోగించుకునేందుకు వీల్లేక ఎంతో మంది బహిర్భూమికి బయటకు వెళుతున్నట్టు సమాచారం. ఇలా వెళ్లినపుడు వారి రక్షణకు బాధ్యులెవరు?

ఈ వసతి గృహాలన్నీ వార్డెన్ల ఆధీనంలో ఉండటంతో వారు అనుభవిస్తున్న బాధను, వేదనను చెప్పుకునే ఓ వేదిక లేక అమ్మాయిలు లోలోపలే కుమిలిపోతున్నారు. ఇంట్లో చెప్పుకుంటే చదువుకు దూరమైపోతామనే భయం వారిని వెంటాడుతుంది. అందుకే ప్రతి విద్యా సంస్థలో ఓ ఫిర్యాదు బాక్సు ఉండాలని విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు ఎప్పటి నుండో నెత్తీనోరూ బాదుకుంటున్నాయి. కానీ ఎక్కడా అమలు జరగడం లేదు. అలాగే గతంలో విద్యార్థి సంఘ నేతలు వసతి గృహాలను సందర్శించి అమ్మాయిల సమస్యలను తెలుసుకునేవారు. ఫలితంగా కొంతవరకైనా వారి సమస్యలు పరిష్కారం దొరికేది. వార్డెన్లూ కాస్త జాగ్రత్తగా మసులుకునేవారు. కానీ నేటి విద్యావిధానంలో దీనికి చోటే లేకుండా పోయింది.

వసతిగృహాల్లో జరుగుతున్న అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలు పిల్లలు ఎక్కడ బయట పెడతారో అని అధికారులు ఆ పసిదేహాలతో ఆటలాడుతున్నారు. బయటకు చెప్పుకోలేరనే ధైర్యంతో దాడులకు పాల్పడుతున్నారు. హింసించి వారి నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి దాడే ఇప్పుడు భవ్య, దివ్యల జీవితాన్ని ముగించివేసిందనే వార్తలు వస్తున్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపితేకానీ అసలు నిజాలు బయటకు రావు. ఒక్క మాటలో చెప్పాలంటే సమాజంలో దళిత మహిళలు ఎదుర్కొంటున్న వివక్షే ప్రభుత్వ వసతి గృహాలకూ తాకిందనేది పచ్చినిజం. ఈ సంఘటనపై విచారణ నిజాయితీగా జరిగి అసలైన దోషులకు శిక్షపడితే ఆ తల్లిదండ్రుల వేదన కాస్తయినా తగ్గుతుంది. ఏదిఏమైనా ఈ ఘటన ఇప్పుడు వేలాదిమంది తల్లిదండ్రుల గుండెల్లో గునపంలా గుచ్చుకుంది. తమ అమ్మాయిల భవిష్యత్ ఏంటనే ఆందోళన మొదలయింది. అసలు తమ బిడ్డలను చదివించాలో వద్దో తెలియని అయోమయంలో పడిపోతున్నారు.

అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ విద్యా విధానం పూర్తిగా మారిపోతున్నది. ఢిల్లీలో మోడీ తెస్తానంటున్న నూతన జాతీయ విద్యా విధానంలో భూతద్దం పెట్టి వెతికినా అమ్మాయిల రక్షణ గురించి ఒక్క ముక్క కూడా కనబడదు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద పిల్లల కోసమంటూ హడావుడిగా తీసు కొచ్చిన గురుకులాల్లో వసతులు కల్పించాల్సిన బాధ్యత ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది. అంతేకాదు ఆడపిల్లలకు రక్షణ కల్పించి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం కూడా ప్రభుత్వానిదే.

సార్వత్రిక పెన్షన్ విధానం అమలు చేయాలి

పెన్షన్ సరుకు కాదు, సామాజిక బాధ్యత, ఉద్యోగులకు చట్టం కల్పించిన హక్కు. ఉద్యోగి తన జీవిత కాలంలో 30 ఏండ్ల సర్వీస్‌లో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ జీవిత చరమాంకం వరకు పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతాడు. శేషజీవితం సుఖంగా ఉండాలని కోరుకుంటాడు. కానీ స్థిరపడని పిల్లలు, పిల్లల పెళ్లిళ్లు, అనారోగ్య పరిస్థితులు అతన్ని నిత్యం వెంటాడుతూ ఉంటాయి. భరోసాకు పెన్షన్ అవసరం. అరవైయేండ్లు పైబడిన ఏ పౌరుడికైనా నిర్దిష్టమైన ఆదాయం లేకపోవడం ఇబ్బందికరం. అందుకు సార్వత్రిక పెన్షన్ విధానం రావాలి. బ్రిటిష్ కాలం నుండి ఏదో ఒక రకమైన పెన్షన్ కొంతమందికి మాత్రమే అమలు చేయబడింది. అది సార్వత్రిక కాదు. డి.ఎస్ నకారలాంటి వాళ్లు తమ అనుభవానికి వచ్చిన తర్వాత అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఉన్నది. అది ప్రభుత్వ బాధ్యత కూడా. అందుకు ఉన్నత న్యాయస్థానం ఉద్యోగుల పట్ల గౌరవభావంతో ఉద్యోగి తన జీవితకాలంలో ఎంత సుఖంగా ఉన్నాడో విరమణ పొందిన తర్వాత కూడా అంతే గౌరవప్రదంగా జీవించాలని నిర్దేశించ బడినది. 'పెన్షన్ అనేది హక్కు, భిక్ష కాదు. ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఇవ్వబడినది కాదు. తన జీవిత కాలం పని చేసినందుకు ఇచ్చే బెనిఫిట్ మాత్రమే. పెన్షన్ నుండి ఎవరు మినహాయించుకునే హక్కు లేదు'



అని వై.వి.చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఐదుగురితో కూడిన ధర్మాసనం 17 డిసెంబర్ 1982న ఈ తీర్పునిచ్చింది.

పెన్షన్ అన్ని రంగాల్లో ఒకే రకంగా లేదు. పబ్లిక్ సెక్టార్‌లో పెన్షన్‌పై సీలింగ్ ఉంది. గెజిటెడ్ ఆఫీసర్‌గా రిటైర్ అయిన వారికి కూడా రూ. వెయ్యి నుంచి రూ. నాలుగు వేల వరకు మాత్రమే పెన్షన్ వస్తుంది. కోల్ మైన్స్‌లో రిటైర్ అయిన వారికి కూడా అంతే. ఫ్యామిలీ పెన్షనర్లకు రూ.వెయ్యిలోపే ఉంది. బీఎస్ఎన్ఎల్‌లో రిటైర్ అయిన వారికి లాభాల పైననే పెన్షన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపిఎస్) స్థానంలో 2004 జనవరి 1 నుండి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తెచ్చింది. యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు ఒకరికి ఒకరు సహకరించుకొని 2013లో ఎన్‌పిఎస్ బిల్లు తెచ్చాయి. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ పీఎఫ్‌కు ప్రభుత్వం కూడా సమానంగా కలిపి పెన్షన్ ఇస్తామని చెప్పింది. పీఎఫ్‌గా వసూలు చేసిన డబ్బు ఎక్కడ ఉందో తెలియదు, దానికి జవాబుదారితనం లేదు. ఎన్‌పిఎస్ ఉద్యోగుల పోరాట ఫలితంగా ఓపిఎస్ అమలు చేస్తామని కొన్ని రాష్ట్రాలు ప్రకటించాయి. ఆ రాష్ట్రాలు కేంద్రాన్ని తమ ఉద్యోగుల పీఎఫ్‌ను తిరిగి ఇవ్వమని అడిగినా, ఇవ్వకపోగా ఇవ్వబడదు అని ప్రకటించాయి. ఇది చాలా అన్యాయం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాలు చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగులు కూడా ప్రజల్లో భాగమే మొత్తం జనాభా 1.5 శాతం మాత్రమే. కుటుంబ సభ్యులతో కలిపితే ఆరు శాతం ఉంటారు, శ్రామికశక్తిలో ఐదు శాతం ఉన్నారు. వీరికి ప్రభుత్వ నిధులలో 1.2శాతం మాత్రమే కేటాయిస్తున్నారు, పెన్షనర్లు పెరిగారని గగ్గోలు పెట్టడమే తప్ప ప్రజలకు ప్రభుత్వానికి సారథిగా ఉండి ప్రభుత్వ పథకాలను అమలుచేసే యంత్రాంగం అని ఆలోచించడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం లేకుండా సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయబడవు. ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వాలు మనుగడ సాగిస్తాయి.

తెలంగాణలో సరాసరి జీవితకాలం 70 సంవత్సరాలుగా ఉంది. కొన్ని దేశాలలో 70 ఏండ్లు వచ్చే వరకు పని కల్పిస్తున్నారు. మన రాష్ట్రంలో, దేశంలో 60 నుండి 65 వరకు పనిచేస్తున్నారు. రాజకీయాలలో వయోపరిమితి లేదు. పనిచేయగలిగే వారికి అవకాశం ఇవ్వడం మంచిది. ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్లకు కల్పించే సంక్షేమ కార్యక్రమాల్లో 107 దేశాల్లో మనము 101గా ఉన్నాం. సీనియర్ సిటిజన్లకు ఇచ్చే రైలు రవాణా రాయితీ కూడా రద్దు చేశారు. కొన్ని రాష్ట్రాలు సీనియర్ సిటిజన్లకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇన్‌కమ్ టాక్స్ పేరుతో నెల, రెండు నెలల పెన్షన్ కట్ చేస్తున్నారు. పెన్షన్ జీవనభృతి మాత్రమేనని గుర్తించడం లేదు. పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాక జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కూడా ఈ చర్చ జరుగుతున్నది. అంతర్జాతీయ స్థాయి ఏషియన్ సౌత్ ఏరియా సమావేశము తిరువనంతపురంలో గతేడాది పదోనెలలో నిర్వహించారు. ఆ సందర్భంలో వక్తలు పెన్షన్ విధానంపై ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ కాపాడుకోవడానికి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. 2023లోనే హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనివర్సల్ ఫర్ ఆల్ సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో అరవై ఏండ్లు పైపడ్డ వారికి యూనివర్సల్‌గా రూ.పదివేలు చెల్లించాలని డిమాండ్ వచ్చింది. అది దేశవ్యాప్త ఉద్యమంగా నిర్వహించబడుతున్నది. ప్రస్తుత ప్రభుత్వాలు చిత్తశుద్ధితో లేవు. పెన్షన్ విధానాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీదనే ఉంది. అందుకు ఐక్య పోరాటాలే శరణ్యం.

- పాలకుర్తి కృష్ణమూర్తి, 9440602180

ఎన్ని బాంబులు వేస్తే అంతగా లాభాలు!



■ఎం కోటేశ్వరరావు
8331013288

'అక్కడ మిగిలిందేమీ లేదు' ఐరాస సహాయ సంస్థ గాజాలో పరిస్థితి గురించి తాజాగా చెప్పిన మాట ఇది. ఇజ్రాయిల్ ధ్వంసం గావించిన తమ ఒక ఆసుపత్రి చిత్రాన్ని చూపుతూ 'ఎక్స్' లో వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ నౌకల నుంచి జరుపుతున్న దాడుల కారణంగా తమ ఆహార సరఫరా వాహనాలకు ఆటంకం కలుగుతున్నదని సంస్థ డైరెక్టర్ థామస్ వైట్ పేర్కొన్నాడు. గాజాలో బందీలకు బదులుగా ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న పాలస్తీనా వాసుల విడుదల గురించి అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ మధ్య ప్రాచ్య దేశాల పర్యటనలో ఉన్నాడు. అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు గాజాలో 27,478 మందిని హత్య చేసిన ఇజ్రాయిల్ 66,835 మందిని గాయపరచింది. వారిలో 70శాతానికి పైగా మహిళలు, పిల్లలే ఉన్నారు. ఇరాక్, సిరియా, ఎమెన్‌లపై దాడులకు పూనుకున్న అమెరికా యుద్ధాన్ని విస్తరిస్తున్నదని భద్రతా మండలిలో రష్యా విమర్శించింది. తమ దాడులు ఆరంభం మాత్రమేనని అమెరికా అంతకుముందు ప్రకటించింది. నాటోతో కలసి తమకు ముప్పుతలపెట్టిన ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య 713వ రోజులో ప్రవేశం చింది. ఎంతగా వర్షాలు పడితే అంతగా పంటలు పండుతాయని రైతాంగం, జనం మురిసిపోతారు, కానీ యుద్ధోన్మాదులకు ఎన్ని బాంబులను కురిపిస్తే అంతగా లాభాలు వస్తాయని చరిత్ర రుజువు చేసింది. అందుకే ఏక్కడో ఒక దగ్గర ఉద్రిక్తతలను రెచ్చగొట్టి యు

తాము ఎదురులేని శక్తి అని విర్రవీగుతున్న అమెరికాకు ప్రతి చోటా పరాభవమే మిగులుతోంది. దాన్ని నమ్మితే ఇంతే సంగతులని అనేక దేశాలు అంతర్గతంగా భావిస్తున్నప్పటికీ మిలిటరీ శక్తిగా ఉన్నందున భయపడుతున్నమాట వాస్తవం. చైనా, రష్యాల ముందు అమెరికా పప్పులుడకవని తేలిపోయింది. ఈ పూర్వరంగంలోనే ఐరోపాకు సోవియట్ నుంచి ముప్పు ఉందని చెప్పి నాటోను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే చెబుతూ రష్యాను చుట్టుముట్టేందుకు పూనుకున్నారు. దాన్ని మరింత బలపరుస్తున్నారు. మరోవైపు చైనా నుంచి ఆసియాకు ముప్పు అని ఏ క్షణంలోనైనా తైవాన్ ఆక్రమిస్తుందని ప్రచారం చేస్తున్నారు.ఈ దశాబ్ది చివరికి చైనా వెయ్యి అణ్వాయుధాలను సమకూర్చుకోనుందని అమెరికా రక్షణశాఖ తప్పుడు నివేదికలను ప్రచారంలో పెట్టింది. ఇవన్నీ చైనా ప్రపంచ మిలిటరీ శక్తిగా ఎదుగుతోంది జాగ్రత్త అని ఇరుగు పొరుగుతో పాటు ప్రపంచ దేశాలను ఆయుధపోటీకి ప్రోత్సహించే ఒక వ్యూహంలో భాగమే.

ద్ధాల వరకు కొనిపోవటం నిత్యకృత్యంగా మారింది. ఐరోపాలో ఉక్రెయిన్ సంక్షోభం, మధ్య ప్రాచ్యంలో గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న మారణకాండ సారమిదే. 1990 దశకంలో ప్రచ్ఛన్న యుద్ధంలో తామే గెలిచామని అమెరికా ప్రకటించుకున్నప్పటికీ వర్తమానంలో తిరిగి నాటి పరిస్థితిని అది సృష్టిస్తున్నది. దాని విదేశాంగ విధాన వైఫల్యాలు పెరుగుతున్న కొద్దీ ప్రపంచ మిలిటరీ ఖర్చు కూడా పెరుగుతున్నది. ఎనిమిదేండ్ల వరుస పెరుగుదలలో 2022లో ప్రపంచ మిలిటరీ ఖర్చు 2.24లక్షల కోట్ల డాలర్లకు చేరింది.

గతేడాది అమెరికా విదేశాలకు అమ్మిన ఆయుధాల విలువ 238 బిలియన్ డాలర్లు. ఉక్రెయిన్ సంక్షోభం ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా తేలింది. ఐరోపాలోని అనేక దేశాలు తమ వద్ద ఉన్న పాత ఆయుధాలను ఉక్రెయిన్‌కు బదిలీ చేసి కొత్తవాటిని కొనుగోలు చేస్తున్నాయి. ఐరోపా వెలుపల ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, జపాన్, కెనడా, కతార్ తదితర దేశాలు ఎక్కువగా కొనుగోలు చేశాయి. ఆయుధాల అమ్మకం అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజాన్నిస్తున్నది. అమెరికా ప్రభుత్వం నేరుగా అమ్ముతున్న ఆయుధాలు, మిలిటరీ సేవల విలువ 2022తో పోలిస్తే గతేడాది 51.9 బి.డాలర్ల నుంచి 80.9కి పెరిగింది. ఆయుధ వ్యాపారులు నేరుగా అమ్మిన వాటి విలువ 157.5 బి.డాలర్లు. ప్రభుత్వమే నేరుగా ఆయుధ వ్యాపారం చేస్తున్నదంటే యుద్ధాలను ప్రోత్సహించే విదేశాంగ విధానాలను మరింతగా కొనసాగిస్తున్నదనేందుకు సూచిక. ఆయుధాలను అమ్ముతూ ప్రపంచానికి ముప్పుగా పరిణమించిన రష్యాను దెబ్బతీసేందుకే తామీపని చేస్తున్నట్లు చెప్పుకొంటున్నది. పుతిన్ దళాల నుంచి ఐరోపాను రక్షించే పేరుతో ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల నిధులు ఇవ్వాలని ఐరోపా సమాఖ్య తాజాగా నిర్ణయించింది. అక్టోబరు ఏడున గాజాపై మారణకాండను ప్రారంభించిన ఇజ్రాయిల్ చర్య కూడా మిలిటరీ ఖర్చు, ఆయుధ విక్రయాలు పెరిగేందుకు దారి తీస్తున్నది.

అమెరికా తన ఆయుధాలను ఇతర ప్రాంతాలలో నేరుగా ప్రయోగించి వాటి పనితీరును ఎలా పరీక్షిస్తున్నదో ఇజ్రాయిల్ కూడా తన ఆయుధాలు, నిఘా పరికరాలను గాజా, పశ్చిమగట్టు ప్రాంతాలలో పాలస్తీనియన్లు ప్రయోగ సమిధలుగా వాడుకుంటున్న దుర్మార్గానికి పాల్పడుతున్నది. హైఫా నగర కేంద్రంగా ఉన్న ఎల్‌బిట్ సిస్టమ్స్ అనే సంస్థ తాను రూపొందించిన ఐరన్ స్టింగ్ అనే మోర్టార్ బాంబు ఎలా పని చేసేదీ 2021 నుంచి తన వెబ్‌సైట్‌లో ప్రచారం చేసుకుంటున్నది. గాజాలో ఇప్పుడు హమాస్‌ను అణచే పేరుతో వాటిని ప్రయోగించి చూస్తున్నారు. పట్టణ ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో కూడా నిర్ణీత లక్ష్యాలను చేరే విధంగా వీటిని తయారు చేశారు.గాజా జనసమార్థ్యం గల పట్టణ ప్రాంతమన్నది తెలిసిందే. గురితప్పకుండా ఇక్కడ లక్ష్యాలను చేరితే ప్రపంచవ్యాపితంగా ఎవరికి కావాల్సివస్తే వారికి అమ్మేందుకు ఈ ప్రయోగాలు చేస్తున్నారు. గతంలో ఇలాంటి ప్రయోగాల్లో మారణకాండను సృష్టించిన అనేక ఆయుధాలను ఇప్పుడు ఇజ్రాయిల్ ఎగుమతి చేస్తున్నది. అలాంటి వాటిలో ఏకంగా నలభై గంటల పాటు ప్రయాణించి నాలుగు క్షిపణులను మోసుకుపోగల ఇటాన్ అనే డ్రోన్‌ను ఇజ్రాయిల్ 2007లో గాజా పౌరుల మీద ప్రయోగించింది, అప్పుడు కూడా వీటి దాడిలో పిల్లలే ఎక్కువగా మరణించారు. ఇప్పుడు వాటిని భారీగా విక్రయిస్తున్నది. మన దేశం వందకు పైగా వీటిని కొనుగోలు చేసి అగ్రస్థానంలో ఉంది. ఇజ్రాయిల్ నుంచి ఆయుధాలను కొనుగోలు చేస్తున్న 130కి పైగా దేశాలలో కొలంబియా ఒకటి. అక్కడి అధ్యక్షుడు గుస్టావ్ పెట్రో గాజాలో జరుపుతున్న మారణకాండను ఉగ్రవాదంగా వర్ణిస్తూ ఖండించాడు. దాంతో కొలంబియాకు ఆయుధ విక్రయాలను ఇజ్రాయిల్ నిలిపివేసింది. ఆయుధ వ్యాపార ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఆమోదించలేదు. మారణకాండ, మానవాళిపై నేరాలకు పాల్పడేవారికి ఆయుధాల విక్రయాన్ని ఆ ఒప్పందం నిషేధిస్తున్నది. అందువలన ఇజ్రాయిల్ జరిపే లావాదేవీలన్నీ రహస్యంగానే ఉంటాయి. ఎవరు, ఎవరికి అమ్మిందీ చెప్పదు, కొనుగోలు చేసిన వారు కూడా వెల్లడించరని 2019లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించింది. అందువలన లావాదేవీలు ఎంతన్నది కూడా అంచనా కష్టం. దక్షిణాఫ్రికాలో స్థానిక ఆఫ్రికన్ జాతీయులను అణిచివేసిన జాత్యహంకార పాలకులకు విక్రయించింది. అవసరమైతే అణ్వాయుధాలను కూడా ఇచ్చేందుకు సిద్ధప డినట్లు బహిర్గతం కావించిన పత్రాలు వెల్లడించాయి. ఎల్ సాల్వ డార్‌లో తిరుగుబాటుదార్లను అణచివేసేందుకు అక్కడి నియంతలకు నాపాంబాంబులు, ఇతర ఆయుధాలను విక్రయించింది, వాటితో 75వేల మంది పౌరులు మరణించారు. ఎనిమిది లక్షల మంది ప్రాణాలు కోల్పోయిన ర్వాండా మారణకాండలో కూడా ఇజ్రాయిల్ తయారీ తుపాకులు, బుల్లెట్లు, గ్రెనేడ్‌లు వాడినట్లు తేలింది. బోస్నియా మీద దాడులు చేసిన సెర్బియాకూ, మయన్మార్ మిలిటరీ పాలకులకూ, అజర్‌బైజాన్‌కూ ఆయుధాలను విక్రయించింది. అమెరికా, ఐరోపా దేశాల మాదిరి ఎలాంటి ఆంక్షలనూ విధించదు గనుక ఇజ్రాయిల్ నుంచి ఆయుధాలను కొనుగోలు చేయాలని 2018లో నాటి ఫిలిఫ్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డుటెర్టె ప్రకటించాడు. తాజాగా సవరించిన నిబంధనల ప్రకారం ఎలాంటి అనుమతులతో నిమిత్తం లేకుండా ఎవరికైనా ఆయుధాలను విక్రయించవచ్చు. ప్రస్తుతం గాజాలో మరణించిన, గాయపడిన పాలస్తీనియన్లను పరీక్షించినపుడు కాలిన, ఇతర గాయాలను చూసినపుడు అవి ఎలా జరిగాయన్నది వైద్యులకు సమస్యగా మారింది. గతంలో ఇలాంటి వాటిని చూడలేదని చెప్పారు. దీన్నిబట్టి కొత్త ఆయుధాలను ప్రయోగించారని అను మానిస్తున్నారు.

యుద్ధం అనేక అనర్థాలకు మూలమవుతున్నది. ప్రత్యక్షంగా




ఎన్ని ప్రాణాలు పోతాయో, ఎంతమంది దిక్కులేనివారౌతారో, ఎన్ని కుటుంబాలు ఇబ్బందులు పడతాయో, ఎంత బాధ, వేదన కలుగుతుందో చెప్పలేము. పరోక్షంగా జనాల మీద ప్రత్యేకించి కష్ట జీవుల మీద విపరీత భారాలను మోపుతుంది. కార్పొరేట్ మీడియా వార్తలను ఇస్తుంది తప్ప అది యుద్ధానికి వ్యతిరేకం కాదు. ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండను ఆత్మరక్షణ పేరుతో సమర్థిస్తున్న వారికి మద్దతు ఇస్తున్నది. రష్యాకు నాటో తలపెట్టిన ముప్పును మూసిపెట్టి అది జరుపుతున్న సైనికచర్య మీద చిలవలు పలవలుగా వార్తలు ఇస్తున్నది. దీనంతటికి అమెరికా, దాన్ని సమర్థించే దేశాల లాభాల కాంక్ష, యుద్ధోన్మాదమే కారణం. ఏ నేతా శాంతివచనాలు వల్లించటంలో వెనుకబడటం లేదు.ఆచరణలో ఏదో ఓసాకుతో మిలిటరీ ఖర్చు పెంచుతున్నారు. గతంలో సోవియట్ యూనియన్‌ను మాత్రమే బూచిగా చూపే వారు, ఇప్పుడు రష్యా, చైనాలను పేర్కొంటూ ఆయుధాలను మరింత ఎక్కువగా అంటగట్టేందుకు పూనుకున్నారు. 2020లో డెమోక్రటిక్ పార్టీ మిలిటరీ ఖర్చును తగ్గిస్తామని చెప్పింది. గతంలో రిపబ్లికన్ డోనాల్డ్ ట్రంప్ మాదిరి జో బైడెన్ అధికారానికి వచ్చిన తరువాత ప్రతి ఏటా పెంచి మరోసారి ఎన్నికలకు సిద్ధమౌతున్నాడు. ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ యు

అమెరికా తన ఆయుధాలను ఇతర ప్రాంతాలలో నేరుగా ప్రయోగించి వాటి పనితీరును ఎలా పరీక్షిస్తున్నదో ఇజ్రాయిల్ కూడా తన ఆయుధాలు, నిఘా పరికరాలను గాజా, పశ్చిమగట్టు ప్రాంతాలలో పాలస్తీనియన్లు ప్రయోగ సమిధలుగా వాడుకుంటున్న దుర్మార్గానికి పాల్పడుతున్నది. హైఫా నగర కేంద్రంగా ఉన్న ఎల్‌బిట్ సిస్టమ్స్ అనే సంస్థ తాను రూపొందించిన ఐరన్ స్టింగ్ అనే మోర్టార్ బాంబు ఎలా పని చేసేదీ 2021 నుంచి తన వెబ్‌సైట్‌లో ప్రచారం చేసుకుంటున్నది. గాజాలో ఇప్పుడు హమాస్‌ను అణచేపేరుతో వాటిని ప్రయోగించి చూస్తున్నారు. పట్టణ ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో కూడా నిర్ణీత లక్ష్యాలను చేరేవిధంగా వీటిని తయారు చేశారు.గాజా జనసమార్థ్యం గల పట్టణ ప్రాంతమన్నది తెలిసిందే. గురితప్పకుండా ఇక్కడ లక్ష్యాలను చేరితే ప్రపంచవ్యాపితంగా ఎవరికి కావాల్సివస్తే వారికి అమ్మేందుకు ఈ ప్రయోగాలు చేస్తున్నారు.

ద్ధాలను రెచ్చగొట్టటం, ఆయుధాల వ్యాపా రం, లాభాలు పిండుకోవటం మామూలే. మిలిటరీ ఖర్చు విషయానికి వస్తే 230 దేశాల్లో ఒక్క అమెరికా చేస్తున్న ఖర్చు 227దేశాల మొత్తాని కంటే ఎక్కువ. ఆయుధాల ఎగుమతుల్లో కూడా అదే విధంగా ఉంది. నాటో దేశాలు మిలిటరీ ఖర్చును పెంచాలని డోనాల్డ్ ట్రంప్ తెచ్చిన ఒత్తిడిని జోబైడెన్ కూడా కొనసాగిస్తున్నాడు. అమెరికా చేస్తున్న ఖర్చులో రష్యా మొత్తం పది శాతం కంటే తక్కువే.

తాము ఎదురులేని శక్తి అని విర్రవీగుతున్న అమెరికాకు ప్రతి చోటా పరాభవమే మిగులుతోంది. దాన్ని నమ్మితే ఇంతే సంగతులని అనేక దేశాలు అంతర్గతంగా భావిస్తున్నప్పటికీ మిలిటరీ శక్తిగా ఉన్నందున భయపడుతున్నమాట వాస్తవం. చైనా, రష్యాల ముందు అమెరికా పప్పులుడకవని తేలిపోయింది. ఈ పూర్వరంగంలోనే ఐరోపాకు సోవియట్ నుంచి ముప్పు ఉందని చెప్పి నాటోను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే చెబుతూ రష్యాను చుట్టుముట్టేందుకు పూనుకున్నారు. దాన్ని మరింత బలపరుస్తున్నారు. మరోవైపు చైనా నుంచి ఆసియాకు ముప్పు అని ఏ క్షణంలోనైనా తైవాన్ ఆక్రమిస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఈ దశాబ్ది చివరికి చైనా వెయ్యి అణ్వాయుధాలను సమకూర్చుకోనుందని అమెరికా రక్షణశాఖ తప్పుడు నివేదికలను ప్రచారంలో పెట్టింది. ఇవన్నీ చైనా ప్రపంచ మిలిటరీ శక్తిగా ఎదుగుతోంది జాగ్రత్త అని ఇరుగు పొరుగుతో పాటు ప్రపంచ దేశాలను ఆయుధపోటీకి ప్రోత్సహించే ఒక వ్యూహంలో భాగమే. అణ్వాయుధాలు ప్రపంచానికి ముప్పు అన్నది నిజం, ముందుగా ఎవరు మీటనొక్కినా కొద్దిక్షణాల్లో ఇతరులు కూడా అదేపని చేస్తారన్నది కూడా తెలిసిందే.అదే జరిగితే ప్రపంచం మిగలదు. ఎవరికి వారు తగుజాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇతర దేశాలన్నీ తమ మీద కుట్ర చేస్తున్నట్లు, ముప్పు తలపెట్టినట్లు స్వజనాన్ని నమ్మించటం అమెరికా నిత్యకృత్యాలలో ఒకటి. ఆ పేరుతో అన్ని ఖండాలలోని 80 దేశాలలో 800కు పైగా చిన్నా, పెద్ద సైనిక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంటే ఎక్కడికైనా కొద్ది గంటల్లోనే తన మిలిటరీని దింపగలదు. ఇంతవరకు అమెరికా మీద దాడి చేసిన దేశం ఒక్కటంటే ఒక్కటీ లేదు. బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన తరువాత 1,776 నుంచి ఇప్పటి వరకు అమెరికా 68 దేశాల మీద దాడి చేసింది.అందువలన ముప్పు అమెరికా నుంచి రావాలి తప్ప మరొకదేశం నుంచి వచ్చే అవకాశమే లేదు.

విశ్వవిద్యాలయాలు విధ్వంసం కావాల్సిందేనా?




■ ఆర్ ఎల్ మూర్తి
8247672658

'దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుని నైతిక అభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి' అన్నారు డాక్టర్ బీ.అర్ అంబేద్కర్. పౌరుడు నైతికంగా అభివృద్ధి కావాలంటే అది పాలకులు అనుసరిస్తున్న విధానాలపై ఆధారపడి ఉంటుంది. కానీ నేడు విద్యారంగం సంక్షోభంలోకి వెళ్లిపోయింది. జ్ఞానానికి కేంద్రంగా వర్ధిల్లాల్సిన విశ్వవిద్యాలయాలు విధ్వసానికి గురవుతున్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా జ్ఞాన కేంద్రాలు మసకబారిన కేంద్రాలుగా మారుతున్నాయి.

సమాజ ప్రగతికి విద్యే ప్రధాన ఆయుధం. విద్య మనిషి మానసిక వికాసాన్ని పరిపుష్టి చేస్తుంది. నైతికతను మెరుగుపరుస్తుంది. అట్లాంటి విద్యారంగంపై పాలకులది చిన్నచూపు సమంజసమేనా? వారికి విద్యారంగమంటే ప్రాధాన్యత లేని అంశంగా కనపడటం బాధాకరం. అందుకే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు పతనావస్థకు చేరుతున్నాయి. కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో గత ప్రభుత్వం ఏ ఒక్క విశ్వవిద్యాలయంలో కూడా ప్రభుత్వం టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయలేకపోయింది. కామన్ రిక్రూట్మెంట్ బోర్డ్ పేరుతో కాలయాపన చేసిందే తప్ప చిత్తశుద్ధి లేదు. అన్ని యూనివర్సిటీలలో 2152 ఆచార్యుల పోస్టులు ఖాళీలుండగా ఒక్క ఓయూలోనే 1200కు పైగా ఉండాల్సిన ప్రొఫెసర్‌లు కేవలం 350 మంది మాత్రమే ఉన్నారు. విభాగాలన్నీ కూడా కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ ఫ్యాకల్టీతో నడుస్తున్నాయి.అకాడమిక్ వాతావరణం దెబ్బతిన్నది. వీటితో పాటు యూనివర్సిటీలకు నిధుల లేమి కనబడుతుంది ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే బడ్జెట్ యూనివర్సిటీలలో ఉన్న ఉద్యోగుల జీతాలు ఇవ్వడానికే సరిపోయేది కాదు, కాబట్టి విశ్వవిద్యాలయాల అధికారులు విద్యార్థుల మీద ఫీజుల భారం మోపారు.సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్స్‌లుగా మార్చలేదు. క్యాంపస్ విద్యార్థులు కూడా పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలను పెంచలేదు. దాంతో విద్యార్థులు కోర్సు పూర్తయిన తర్వాత రూ.20వేల పైనే మెస్ బిల్లు చెల్లించే పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా విశ్వవిద్యాలయాల్లో టీసీలు కూడా తీసుకునే పరిస్థితులు విద్యార్థులు లేరన్నది వాస్తవం.

ఆనాడు తెలంగాణ ఉద్యమ కేంద్రాలుగా పనిచేసిన విశ్వవిద్యాలయాలు నేడు సమస్యలతో బోసిపోతున్నాయి. ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ 2023 సంవత్సర ర్యాంకులలో రాష్ట్రంలోని ఒక్క విశ్వ విద్యాలయానికి చోటు దక్కలేదు. వందేండ్లు అయిన సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. ఓయూలో భాగంగా ఉన్న కోటి మహిళా కళాశాలకు కొత్తగా బోర్డు మార్చి మహిళ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పారే తప్పా జరిగిందేమీ లేదు. బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థుల వరస ఆత్మహత్యలు ఎంతోమందిని కలిచివేశాయి. దీనిపై విద్యార్థి సంఘాల నిరసనలు, తల్లిదండ్రుల రోదనలు దేశవ్యాప్తంగా చర్చ అయినా ప్రభుత్వం శాశ్వత పరిష్కారాలను చేపట్టలేకపోయింది. తొమ్మిదేండ్లుగా ఇంచార్జ్ వీ.సీల పాలనలోనే నడుస్తున్నది. విశ్వ విద్యాలయాల ఉపకులపతుల నియమకాలు కూడా పారదర్శకంగా జరగలేదనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దీనికి తోడు అవినీతి. తెలంగాణ యూనివర్సిటీ వీసీ అవినీతి మరకలు యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చాయి. గత కొన్నేళ్లుగా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ టీచింగ్ ఉద్యోగాలు భర్తీ చేయడంలో పాలకుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతోంది. ప్రస్తుత విశ్వవిద్యాలయాల్లో 90శాతం పేద, సామాజిక వెనుకబాటు తరగతికి చెందిన విద్యార్థులే ఉన్నారు. వీరికి ప్రభుత్వం నుండి రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ రెగ్యులర్‌గా అందడం లేదు.

మోడీ ప్రభుత్వం ఫెలోషిపులు కుదించడం వల్ల అత్యధికంగా నష్టపోతుంది తెలంగాణ విద్యార్థులే. రాష్ట్రంలో పరిశోధనా విద్యారంగం కుంటుపడుతున్నది. రాష్ట్ర అభివృద్ధికై పరిశోధనలు విస్తృతం కావాలి. ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేయక పోవడంతో విద్యార్థులు రీసెర్చ్‌కు దూరమవుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాల్లాగా ఫెలోషిప్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం యూనివర్సిటీలోని ప్రతి పీజీ విద్యార్థికి రూ.8వేలు, పీహెచ్‌డీ విద్యార్థికి రూ.30వేల ఫెలోషిప్ సౌకర్యాన్ని కల్పించాలి. అన్ని యూనివర్సిటీలలో మహనీయుల పేర్లతో రీసెర్చ్ సెంటర్స్ ఏర్పాటు చేసి ఫెలోషిప్ సౌకర్యాన్ని ఇవ్వాలి. న్యాక్ గుర్తింపు ఉండి మంచి పేరు ప్రఖ్యాతలు కలిగిన విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యతనుండి గత ప్రభుత్వం పూర్తిగా తప్పుకుంది. పైగా ప్రయివేటు విశ్వవిద్యాలయాలకి పెద్దపీట వేసింది. దీంతో ఇంజనీరింగ్ కళాశాలలు కూడా విశ్వవిద్యాలయాలుగా మారి



న్యాక్ గుర్తింపు ఉండి మంచి పేరు ప్రఖ్యాతలు కలిగిన విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యతనుండి గత ప్రభుత్వం పూర్తిగా తప్పుకుంది. పైగా ప్రయివేటు విశ్వవిద్యాలయాలకి పెద్దపీట వేసింది. దీంతో ఇంజనీరింగ్ కళాశాలలు కూడా విశ్వవిద్యాలయాలుగా మారిపోయాయి. యూనివర్సిటీలన్నీ పోలీస్ నిర్బంధం క్యాంపులను తలపించాయి. క్యాంపస్‌లోని డెమోక్రసీ వాతావరణం దెబ్బతిన్నది. స్టూడెంట్స్ ఎన్నికలు నిర్వహించే బాధ్యతను నిర్వర్తించలేదు. అన్ని విశ్వవిద్యాలయాలలో భూములు కబ్జాలకు పాల్పడినా ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదు. గుళ్లు, గోపురాలు, యాగాల మీద ఉన్న శ్రద్ధ యూనివర్సిటీల మీద లేదనే విమర్శలెన్నో. దానికి ఏనాడూ పాలకులు యూనివర్సిటీల ముఖం తొంగిచూడకపోవడమే.

పోయాయి. యూనివర్సిటీలన్నీ పోలీస్ నిర్బంధం క్యాంపులను తలపించాయి. క్యాంపస్‌లోని డెమోక్రసీ వాతావరణం దెబ్బతిన్నది. స్టూడెంట్స్ ఎన్నికలు నిర్వహించే బాధ్యతను నిర్వర్తించలేదు. అన్ని విశ్వవిద్యాలయాలలో భూములు కబ్జాలకు పాల్పడినా ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదు. గుళ్లు, గోపురాలు, యాగాల మీద ఉన్న శ్రద్ధ యూనివర్సిటీల మీద లేదనే విమర్శలెన్నో. దానికి ఏనాడూ పాలకులు యూనివర్సిటీల ముఖం తొంగిచూడకపోవడమే.

ఇప్పటికే చాలా నష్టం జరిగింది. విధ్వంసానికి గురైన విశ్వ విద్యాలయాల పునర్నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి. గత పాలన నుండి అధికార మార్పిడి జరగడంలో విశ్వ విద్యాలయాల విద్యార్థుల పాత్ర చాలా కీలకమని గుర్తించాలి. అందుకే ప్రభుత్వం యూనివర్సిటీల సమగ్రాభివృద్ధి కోసం అన్ని వర్గాలను కలుపుకొని కార్యాచరణ చేయాలి.కామన్ రిక్రూట్ మెంట్ బోర్డు కాకుండా గత మాదిరిగానే యూని వర్సిటీల వారిగా టీచింగ్ ఉద్యోగాలు తక్షణమే భర్తీ చేయాలి. స్టూడెంట్స్ ఎన్నికలు నిర్వహించాలి. క్యాంపస్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన వారితో వి.సి పోస్టులను భర్తీ చేయాలి. బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలి. ప్రయివేటు విశ్వ విద్యాలయాలను, మార్గదర్శకాలను మార్చి కొత్తవాటి ఏర్పాటుకు అనుమతినివ్వకుండా చూడాలి. విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తి పరిరక్షించాలి. నూతన జాతీయ విద్యా విధానం ముసుగులో బీజేపీ- అర్ఎస్ఎస్ ప్రభుత్వం మనువాద ఎజెండాను అమలు చేస్తూ, రాష్ట్రాల హక్కులు కాలరాస్తుంది. ఫెడరలిజాన్ని బలహీన పరుస్తున్నది. రాష్ట్రాల హక్కులను లాగేసుకుంటున్నది. సైంటిఫిక్ టెంపర్ లేని ఈ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వం గుర్తించాలి. గత పాలనలో ధ్వంసమైన విద్యారంగాన్ని పునర్నిర్మాణం చేయాలి. నేటి యువత సరైన చదువులు అందక, చదివిన వారికి సైతం ఉద్యోగాలు రాక అనేక సమస్యలు, మానసిక ఒత్తిళ్లలో ఉన్న మాట వాస్తవం. టీఎస్పీఎస్సీకి కొత్త కమిటీ వేశారు, మంచి విషయమే కానీ గతం పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారంలోకి రాకముందు హామీనిచ్చిన జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేసి యువత ఆశలను నిలబెట్టాలి.



8న ప్రొఫెసర్ నాగేశ్వర్ ఖమ్మం రాక

నవతెలంగాణ- ఖమ్మం

ఈనెల 8వ తేదీన అఖిలపక్ష కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సెమినార్‌కు ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, జర్నలిజం ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ హాజరుకానున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. మంగళవారం ఖమ్మంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, ఐఎన్టియూసి జిల్లా నాయకులు నరేష్ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జే.రామయ్య, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు ఎమ్‌డి వై పాషా మాట్లాడుతూ ప్రస్తుతం కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ళు తదితర అంశాలపై ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌తో గురువారం సాయంత్రం 6 గంటలకు భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పరిస్థితులను వివరించడం కోసం సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థి, యువజన, మేధావులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి విప్లవ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కే.శ్రీనివాస్, బిఆర్‌టియు జిల్లా నాయకులు పాల్వంచ కృష్ణ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారని మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు కూసుమంచి మండలం పాలేరు చేరుకుంటారు. అక్కడ చేప పిల్లల పంపిణీ చేపడతారు. ఉదయం 10:30 గంటలకు ఖమ్మంరూరల్ మండలం తీర్థాల గ్రామంలో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం త్వరలో రాబోయే మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే కూడలి జాతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆరెకోడు తండాకు చేరుకుని గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటలకు వెంకటగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శిస్తారు. అనంతరం ఒంటిగంటకు గుదిమళ్ల గ్రామంలో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుని.. సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వచ్చి నేరుగా మంత్రిని కలవొచ్చని, సమస్యలు వివరించవచ్చని తెలిపారు.



ఉచిత విద్యుత్ పేదలందరికీ అమలు చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఈ నెల16వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎర్రుపాలెం రామిశెట్టి పుల్లయ్య భవనం నందు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ప్రజలకు రేషన్ కార్డులను అందించలేదని విమర్శించారు, నూతన ప్రభుత్వం రేషన్ కార్డు ప్రాతి పదికన 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పేదలకు అమలు చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని మార్చుకోవాలని అన్నారు. తొలుత లబ్ధిదారులందరికి రేషన్ కార్డులను పంపిణీ చేసిన అనంతరమే, పథకానికి రూప కల్పన చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, సగుర్తి సంజీవరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, గామాసు జోగయ్య, రామిశెట్టి సురేష్, నాగులవంచ వెంకట్రామయ్య, షేక్ లాల, కోటి సుబ్బారెడ్డి, దూదిగం బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఖమ్మం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఈనెల 11, 12 తేదీల్లో జరిగే కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవిపిఎస్) రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ అన్నారు. మండలంలోని నాయుడుపేట గ్రామంలో మంగళవారం కెవిపియస్ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రం, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేవీపీఎస్ ఏర్పడి 25 ఏళ్ల అవుతుందని, ఈ 25 ఏళ్ల సుదీర్ఘకాలంలో దళితుల హక్కుల, సంక్షేమం కొరకు అనేక పోరాటాలు చేసిన చరిత్ర కెవిపిఎస్‌కు ఉందన్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని చింతపల్లి, పొన్నెకల్లు, మద్దులపల్లి గ్రామాల్లో జరిగిన వివక్ష ఘటనలకు అండగా నిలబడింది కెవిపిఎస్ అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు నూకల బాలరాజు, రామనాథం, నందిపాటి లక్ష్మయ్య, వెలుతురు రామనాథం, ఏపూరి వరకుమార్, ఆంటోనీ, సైదులు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల, కేజీబీవీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

గురుకుల, కేజీబీవీ, సమగ్ర శిక్ష అభియాన్‌లలో పని చేస్తున్న సిబ్బందిని తక్షణమే రెగ్యులర్ చేయాలని, కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెంలో గల గురుకుల కళాశాల కేజీబీవీ కళాశాలలో జిల్లా కార్యదర్శి షేక్ నాగురు వలీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిని కాంక్షిస్తూ ఏడవ గ్యారంటీగా తక్షణమే విద్యా కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యాలయాల్లో సమస్యల పరిష్కారం కోసం నిరంతరం యుటిఎఫ్ సంఘం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు రాజారావు, కేజీబీవీ ఎస్ఓ సరిత,యుటిఎఫ్ మండల మహిళా కార్యదర్శి కష్ణ వేణి, జయంతి, రాధిక, అరుణ, కవిత, లిడియా, శేషు, రాణి,భారతి,పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు తమ్మినేని రాక

నవతెలంగాణ-ఖమ్మం

ఇటీవల అనారోగ్యానికి గురైన సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హైదరాబాద్ ఎఐజి హాస్పిటల్‌లో చికిత్స అనంతరం సంపూర్ణ ఆరోగ్యంతో బుధవారం ఉదయం ఖమ్మం జిల్లాకు వస్తున్నారని, పార్టీ జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో ఉదయం 10 గం.లకు జరిగే పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొంటారని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జనరల్‌బాడీ సమావేశానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా ప్రజా సంఘాల బాధ్యులు, మండల కార్యదర్శులు, మండల/ పట్టణ కమిటీ సభ్యులు మరియు జిల్లా సెంటర్ శాఖా కార్యదర్శులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.



వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా

ముందస్తు చర్యలు చేపట్టాలి



- **రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా**

నవతెలంగాణ-కూసుమంచి



వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా అన్నారు. మంగళవారం కూసుమంచి మండలం జీళ్ళచేరువు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద జిల్లా కలెక్టర్ వి పి. గౌతమ్, మిషన్ భగీరథ ఇఎన్సి జి.కృపాకర్‌రెడ్డిలతో కలిసి ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మిషన్ భగీరథ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా కుటుంబాలు, జనాభా, నల్లా కనెక్షన్లు, గ్రిడ్ నుండి నీటి సరఫరా, రోజువారి నీటి డిమాండ్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు నెలలు చాలా కీలకమని, నీటి సరఫరాలో లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకొని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో 957 గ్రామీణ ఆవాసాలకుగాను 2,83,368 ఇండ్లకు, నల్లా కనెక్షన్లు ఉన్నట్లు, సూర్యాపేట జిల్లాలో 817 గ్రామీణ ఆవాసాలకు గాను 2,41,129 ఇండ్లకు నల్లా కనెక్షన్లు, మహబూబాబాద్ జిల్లాలో 1,350 గ్రామీణ ఆవాసాలకు గాను 1,79,517 నల్లా కనెక్షన్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,516 గ్రామీణ ఆవాసాలకు గాను 2,39,997 నల్లా కనెక్షన్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. జల్ జీవన్ మిషన్‌కు సంబంధించి నిధులు వస్తాయని, ఎక్కడైనా తాగునీటి సంబంధ పనులు ఉంటే పూర్తిచేయాలని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా ఏ ఏ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు వస్తాయో, అట్టి గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ మూడు నెలలు నిధులు తాగునీటికే వినియోగించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 10 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించినట్లు, అట్టి నిధులతో 10 శాతం తాగునీటి కోసం వెచ్చించాలన్నారు. అధికారులు అందుబాటులో ఉండాలని, సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు. మండలానికి ఒక ఏఇ ఉండాలని, సమస్యాత్మక మండలాల్లో అవసరమైతే ఇద్దరిని నియమించాలని ఆయన తెలిపారు. జనాభాను బట్టి, ఎంత మేర నీటి సరఫరా జరుగుతుంది, సరఫరా అయిన నీరు అన్ని ప్రాంతాలకు అందుతుందా, అందని ప్రాంతాలకు తాగునీటి సరఫరాకై ఏ చర్యలు తీసుకోవాలి కార్యాచరణ చేయాలన్నారు.

కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ఏఇ వారి వారి కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలన్నారు. మిషన్ భగీరథ నుండి నీటి సరఫరా లేని ప్రాంతాలకు స్థానిక వనరులు, బావులు, బోర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, మిషన్ భగీరథ సిఇలు కె.శ్రీనివాస్, జి.చెంబాస్, లలిత, ఎస్ఇలు సదాశివకుమార్, రాములు, ఇఇలు వాణిశ్రీ, పుష్పలత, నరేందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వంశీ, అరుణ్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



తెలంగాణ రాష్ట్రంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో మంగళవారం డివైఎఫ్ఐ ఖమ్మం రూరల్ మండలం కమిటీ సమావేశం శానం వీరబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బషీరుద్దీన్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేసిన మాదిరిగానే ఈ ప్రభుత్వం తప్పులు చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4, కానిస్టేబుల్ నోటిఫికేషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారని, నోటిఫికేషన్లు భర్తీ అయిన తర్వాత వెంటనే పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి చూపలేని పక్షంలో నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఖమ్మంరూరల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి కృష్ణ, పొన్నం మురళి, నాయకులు తాటి వెంకటేశ్వర్లు, తోట నరేష్‌రెడ్డి, వట్టికోట నరేష్, అనీష్, ఉపేందర్, పాషా, సిరికొండ నగేష్, ప్రవీణ్, అరవింద్, వీరభద్రం, చంటి పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ- నేలకొండపల్లి



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం నేలకొండపల్లి ప్రధాన సెంటర్లో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు గోపి, ఉపేందర్, పగిడికత్తుల నాగేశ్వరావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పగిడికత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను, మతోన్మాదాన్ని యావత్ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. 16న జరిగే సమ్మెలో ప్రజలు, కార్మికులు భాగస్వాములు కావాలని, ప్రభుత్వరంగ కార్యాలయాలు, హోటల్స్, షాపులు స్వచ్ఛందంగా బంద్ చేసేలా చూడాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య, ఐఎఫ్టియు జిల్లా నాయకులు పగిడికత్తుల రామదాసు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేవీరెడ్డి ఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రజాసంఘాల నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, చిరాభిక్షం, పగిడికత్తుల వెంకటేశ్వర్లు, రామదాసు, కట్టుకోల వెంకన్న, బెల్లం లక్ష్మి, దుగ్గి వెంకటేశ్వర్లు, కొప్పుల జానకి, మధు, పెద్దిరాజు నరసయ్య, మందడపు మురళి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

గ్రామ పంచాయతీ విధులను ప్రత్యేక అధికారులు సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందే సేవలలో ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేక అధికారులకు, గ్రామ పంచాయతీ విధులు, నూతన పంచాయతీ రాజ్ చట్టం, తదితర అంశాలపై ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభ, గ్రామ పంచాయతీ తీర్మానాలను స్కాన్ చేసి భద్రపరచాలన్నారు. బుధవారం నుండి ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని అన్నారు. డ్రై డే కార్యాచరణ చేయాలన్నారు. ఈ నెల 15న ప్రత్యేక గ్రామసభ చేపట్టి, పారిశుద్ధ్య కార్మికుల సన్మానం చేయాలని, యువతను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పి సిఇఓ అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, డిఆర్డీవో విద్యాచందన, డివిజనల్ పంచాయతీ అధికారులు ప్రభాకర్, పుల్లారావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం

గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మంత్రి గ్రంథాలయ స్థలాన్ని పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరితగతిన నూతన భవన నిర్మాణానికి మంచి ప్లాన్‌తో చర్యలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ కార్పొరేటర్ కమర్తపు మురళి, గ్రంథాలయ కార్యదర్శి మంజువాణి, అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 65 మందికి జరిమానా

ఖమ్మం నగర ఏసీపీ హరికృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడ్డ 65 మందికి సెకండ్ క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్ 200 నుండి 1000 రూపాయల వరకు జరిమానా విధించారని ఖమ్మం టౌన్ ఏసీపి హరికృష్ణ తెలిపారు. నగరంలో బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్ డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించి షాపులు తెరవడం, పని లేకున్నా రోడ్లపైకి రావడం, బర్త్‌డేల పేరుతో నడి రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించి సిటీ పోలీస్ యాక్టు అమలు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అలాంటి వ్యక్తులకు జరిమానా, జైలు శిక్ష కూడా పడే అవకాశాలు ఉన్నాయన్నారు.



'మీనాక్షి' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని ఆళ్ళపాడు గ్రామంలో మీనాక్షి కంటి ఆస్పటల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ కంటి శస్త్ర చికిత్స నిపుణులు మీనాక్షి కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ కే.శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆళ్ళపాడు, గోవిందపురం ఏ గ్రామాలకు చెందిన పలువురు కంటి పరీక్షలు చేయించుకునేందుకు మెడికల్ క్యాంపునకు తరలివచ్చారు. ఈ సందర్భంగా సుమారు వందమందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 25 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారిని ఖమ్మం హాస్పిటల్‌కి రిఫర్ చేశారు. మరో 40 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ కంటిచూపు మందగించినా, కంటిలో ఎలాంటి లోపాలు తలెత్తిన కంటి వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందుల పాపారావు, బుంగ రాములు, తోటకూర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి ఆశాల సమ్మెనోటీస్

నవతెలంగాణ-కారేపల్లి

రైతు, కార్మిక, కర్షక వర్గం ఈనెల 16 జరుగు నిర్వహిస్తున్న సమ్మెలో స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారం భాగస్వాములతున్నామని ఆశా వర్కర్స్ యూనియన్ కారేపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు వాంకుడోత్ కమల, జంగా కళ్యాణిలు తెలిపారు. దీనికి సంబంధించి కారేపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ బీ.సురేష్‌కు ఆశా వర్కర్లు మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల అయినా ఆశాలు, మధ్యాహ్నభోజన వర్కర్లు, అంగన్‌వాడీలు కనీస వేతనాలు లేవని ప్రభుత్వ దయా దక్షిణాలపైనే ఆధారపడాల్సి దుస్థితి ఉందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

వాహనాల వేలం

నవతెలంగాణ-కారేపల్లి

సింగరేణి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాటుసారా, బెల్లం తరలిస్తున్న వాహనాలను కొద్ది నెలల క్రితం ఎక్సైజ్ అధికారులు పట్టుకోని సీజ్ చేశారు. ఆ వాహనాలను మంగళవారం కారేపల్లి క్రాస్‌రోడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేశారు. ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ వేణుగోపాల్, సీఐ జుల్ఫికర్ అహ్మద్, ఎస్సై వసంతలక్ష్మి ఆధ్వర్యంలో 9 వాహనాలను వేలం వేయగా వాటికి రూ.3.31 లక్షల ఆదాయం వచ్చినట్లు సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు.

వేమన శతక పద్యావధానంలో మన్విత్ అసాధారణ ప్రతిభ

ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సుకు ఎంపిక

నవతెలంగాణ-సత్తుపల్లి



స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి బొర్రా మన్విత్ వేమన శతక పద్యావధానంలో అసాధారణ ప్రతిభను కనబర్చి ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం ఆ పాఠశాలలో సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో వేమన శతకంలోని 108 పద్యాల్లో ఎనిమిది మంది పృచ్ఛకులు విడివిడిగా అడిగిన ప్రశ్నలకు చిన్నారి మన్విత్ ధారణతో కూడిన అష్టావధానం చేసి రికార్డు సృష్టించాడు. పదాలు, పద్యం సంఖ్య, పద్యంలోని లైనులో ఉన్న పదాలు ఇలా పృచ్ఛకులు అడిగిన ప్రతి ప్రశ్నకు మన్విత్ అలవోకగా ధారణ చేశాడు. ఈ కార్యక్రమానికి పృచ్ఛకునిగా, సమన్వయకర్తగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొల్లేపల్లి మధుసూదనరాజు వ్యవహరించగా పృచ్ఛకులుగా రమణమూర్తి, మల్లికార్జునరావు, కృష్ణార్జునరావు, గార్లపాటి రామకృష్ణ, మాదిరాజు మాలతి, అయ్యదేవర శేషగిరిరావు, శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనరాజు మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఇందుకు మన్విత్ ఉదాహరణ అన్నారు. గతంలోనూ మన్విత్ అనేక రికార్డ్స్ సాధించడం జరిగిందన్నారు. అనంతరం మన్విత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం యాజమాన్య బాధ్యులు పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ మన్విత్ తల్లిదండ్రులు బొర్రా వెంకట్రావు, జ్యోతి, అవినాశ్, కరాటే పిచ్చయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం గాదెపాడు అంగన్‌వాడి కేంద్రానికి గాదెపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి రిటైర్డ్ అయిన సీతామహాలక్ష్మి బీరువాను మంగళవారం వితరణ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డుల భద్రపర్చటానికి అంగన్‌వాడీలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న విశ్రాంత హెచ్‌ఎం సీతామహాలక్ష్మి బీరువాను అందజేశారు. బీరువాను వితరణ చేసిన దాతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర, గాదెపాడు హెచ్‌ఎం గుత్తా శ్రీనివాసరావులు అభినందించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు ఎస్‌కె.మహిబూబి, జీ.రాణేమ్మ, ఉపాధ్యాయులు మత్రు, తావుర్యా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ లో బీసీలకు అన్యాయం

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీ సంక్షేమానికి కేవలం 2,150 కోట్లు కేటాయించి తీవ్ర అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. బీసీల విద్యా ఉద్యోగ ఆర్థిక అభివృద్ధికి ఎలాంటి కేటాయింపులు చేయలేదని మండిపడ్డారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీలం వెంకటేష్, సంఘం ఖమ్మం టౌన్ అధ్యక్షులు గద్దె వెంకట రామయ్య, విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిని పాత రైల్వే గేటు వద్దనే నిర్మించాలి

నవతెలంగాణ-మధిర

మధిరలో పాత రైల్వే గేటు వద్దనే ప్రజలందరికీ అనుకూలంగా ఉండేలా రైల్వే అండర్ బ్రిడ్జిని గేటు వద్ద నిర్మించాలని మధిర పట్టణ ప్రజలు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరావులకు కోరుతూ డిప్యూటీ తాసిల్దార్ డీ. కరుణాకర్ కు మంగళవారం వినతి పత్రాలను అందజేశారు. ఇటీవల పాత రైల్వే గేటు వద్ద కాకుండా కిలోమీటర్ కు పైగా దూరంలో అండర్ బ్రిడ్జిని నిర్మించేందుకు అధికారులు హడావుడిగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. అధికారులు తయారు చేసే ప్రతిపాదనల ప్రకారం అండర్ బ్రిడ్జి నిర్మిస్తే ఆర్సిఎం చర్చి ఏరియా లోని 21వ వార్డు, లడక బజారులోని 17,18, వార్డులలోని రైల్వే ట్రాక్ కు ఇరువైపులా ఉన్న పలువురు సామాన్యులకు చెందిన ఇండ్లు కోల్పోయే ప్రమాదం ఉంది. బడుగు బలహీనవర్గాలు, సామాన్యుల ఇండ్లు కోల్పోకుండా పట్టణ ప్రజల కోరిన విధంగా ప్రజల సౌకర్యార్థం పాత రైల్వే గేటు వద్దనే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

16న గ్రామీణ భారత్ బంద్

- జయప్రదం చేయండి : అనుమోలు రామారావు

నవతెలంగాణ-వైరాటౌన్



16న జరిగే జాతీయ గ్రామీణ భారత్ బంద్ కు మద్దతుగా వైరాలోని బాటిలింగ్ హమాలీలు ఐఎంఎఫ్ఎల్ వైరా డిపో డీఎంకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16వ తేదీన జరిగే గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని కోరారు. హమాలీలకు వెల్ఫేర్ బోర్డు అమలు చేయాలని, 50 సంవత్సరాలు పైబడిన హమాలీలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదంలో మరణించిన హమాలీలకు 10 లక్షల నష్టపరిహారం కల్పించాలని, సహజ మరణానికి ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో సంబంధం ఉన్న మార్కెట్ యార్డ్ సివిల్ సప్లయ్, బేవరేజస్, ఎఫ్.సి.ఐ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టయ్య రవీందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనిని పరామర్శించిన పెద్దమండవ నేతలు

నవతెలంగాణ-ముదిగొండ



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను మండల పరిధిలో పెద్దమండవ గ్రామానికి చెందిన పార్టీ గ్రామ శాఖ సభ్యులు ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలోని స్వగ్రామంలో మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు టిఎస్ కళ్యాణ్, కందిమల్ల తిరుపతి, గ్రామ శాఖ కార్యదర్శి మాదారపు శ్రీనివాసరావు,నాయకులు తోటకూరి బసవయ్య, యడ్లపల్లి నరసింహారావు,అబ్బూరి యాదగిరి, అబ్బూరి బుజ్జిబాబు,కుక్కల ముత్తయ్య,అబ్బూరి వెంకటేశ్వర్లు, అబ్బూరి ప్రసాద్,తాళ్లూరి రామనాథం,గుత్తికొండ మంగయ్య పాల్గొన్నారు.

పురాతన ముత్యాలమ్మ తల్లి విగ్రహం చోరీ

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామంలోని తాళ్లచెరువు కట్టపై గల ముత్యాలమ్మ గుడిలో పురాతన ముత్యాలము తల్లి విగ్రహం వారం రోజుల క్రితం చోరీకి గురైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తాళ్లచెరువు నిర్మాణ సమయంలో సుమారు 100 సంవత్సరాల క్రితం ఈ ముత్యాలమ్మ గుడిని గ్రామస్తులు నిర్మించారు. ఆనాడే అతి పురాతనమైన ముత్యాలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు నుంచి గ్రామస్తులు ఆ గుడిలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూనే వస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ముత్యాలమ్మ తల్లి విగ్రహం చోరీకి గురైంది. కానీ గ్రామస్తులు ఎవరు తమకు ఏమీ తెలియదు అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారని కొంతమంది గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం చోరీకి గురైనప్పటికీ గ్రామస్తులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామస్తులు స్పందించి చోరీకి గురైన ముత్యాలమ్మ తల్లి పురాతన విగ్రహం కోసం చర్యల ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

అర్చక సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండలో దేవాలయాలు అర్చకుల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అర్చకుల సంఘం మండల అధ్యక్షులుగా మునగలేటి రమేష్‌శర్మ, ప్రధానకార్యదర్శిగా రొంపిచర్ల కిషోర్ ఆచార్యులు, కోశాధికారిగా ముడుంబా చక్రచార్యులు, ప్రచారకార్యదర్శిగా బిజుమళ్ల రాధకృష్ణశాస్త్రి, సహాయ కార్యదర్శిగా చీమకుర్తి నాగాచారి, గౌరవ సలహాదారులుగా బాణాల పోతులువీరయ్యాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అర్చక సంఘం జిల్లా కమిటీ పేర్కొంది. ముదిగొండ మండల అర్చకుల నూతన కమిటీ ఎన్నిక చేసిన, అర్చకులు సంఘం జిల్లా కమిటీకు, మండల కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

హెల్త్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-రఘునాథపాలెం

మండలంలోని మంచుకొండ ప్రభుత్వ హాస్పిటల్ పరిధిలో పనిచేస్తున్న హెల్త్ వర్కర్లకు గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, దీనితో వారి కుటుంబాలు గడవడం ఇబ్బందిగా ఉన్నాయని తక్షణమే పెండింగ్ జీతాలను విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రమ్య సిఐటియు జిల్లా నాయకులు ఎస్ నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో జీవనం కష్టంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంగ, సునీత, సరిత, వెంకట్‌రమణ, సంతోషి, ధనమ్మ విజయ లక్ష్మి, రమాదేవి, వెంకటలక్ష్మీ, అశ్విని, శ్రీలత, శ్రీలక్ష్మి, స్వర్ణలత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి కోసం వినియోగదారులు సహకరించాలి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గృహజ్యోతి పథకంలో భాగంగా 200ల యూనిట్లు ఉచిత విద్యుత్తు పొందాలంటే విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది తమ ఇంటికి వచ్చినపుడు, మీటరు రీడింగ్ తీసే సమయంలో వినియోదారులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్లను కరెంటు సర్వీస్ నంబర్‌కు అనుసందానం చేయించాలని ఏదులాపురం విద్యుత్తు సబ్ స్టేషన్ ఏఈ క్రాంతిసింహా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకవేళ ఇప్పటికే కొంత మంది ఇళ్లలో మీటరు రీడింగ్ తీసి ఉంటే ఈ నెల 12వ తేదీ తరువాత మళ్లి వచ్చి వివరాలు సేకరిస్తారని వివరించారు. వినియోగదారులు విద్యుత్తు అధికారులకు సహకరించాలని కోరారు.

ఇస్లామిక్ ధార్మిక పండితుల అరెస్టు పట్ల ఖండన

- తెలంగాణ సంచార ముస్లిం తేగల సంఘం అధ్యక్షుడు పఠాన్ సైదా ఖాన్ డిమాండ్..

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

గుజరాత్ పోలీసులు అన్యాయంగా అరెస్టు చేసిన ఇస్లామిక్ ధార్మిక పండితులు ముఫ్తీ సల్మాన్ అజహరిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సంచార ముస్లిం తేగల సంఘం అధ్యక్షుడు పఠాన్ సైదా ఖాన్ డిమాండ్ చేశారు. ఇస్లామిక్ ధార్మిక పండితులు ముఫ్తీ సల్మాన్ అజహరి కేవలం తమ ప్రసంగాలలో భాగంగా ఒక కవిత్వం చదివినందుకు గుజరాత్ పోలీసులు అన్యాయంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని అరెస్టు చేయడాన్ని తెలంగాణ సంచార ముస్లిం తేగల సంఘం అధ్యక్షుడు పఠాన్ సైదా ఖాన్ తీవ్రంగా ఖండించారు. నిజంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి మత కలహాలు సృష్టించేవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని కానీ ముస్లింలు తమ ముస్లిం సమాజంలో వారిని చైతన్యవంతులు చేసే విధంగా ఒక కవిత్వం చదివినా ముస్లిం నాయకులు లక్ష్యంగా అన్యాయంగా అరెస్టు చేయటం అత్యంత దారుణమని అన్నారు. ముఫ్తీ సల్మాన్ అజహరిని వెంటనే విడుదల చేయాలని ఒక ప్రకటనలో తెలిపారు.

'గృహజ్యోతి'కి విద్యుత్ అధికారులు ముమ్మరంగా కసరత్తు

- మండలంలో కేటగిరి-1 కింద 12,078 మీటర్లు
- సుమారు 10 వేల మంది వినియోగదారులు అర్హులు
- విద్యుత్ ఏఈ ఉమామహేశ్వరరావు
- రేషన్ కార్డ్, ఆధార్, ఫోన్ నెంబర్ లింక్ తప్పనిసరి



నవతెలంగాణ-బోనకల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను 100 రోజుల అమలు చేసి తీరుతామని టిపిసిసి అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆరు గ్యారెంటీ పథకాలలో రెండు పథకాలను నెల రోజుల తర్వాత ప్రారంభించింది. ప్రస్తుతం మరో రెండు పథకాల అమలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ రెండు పథకాలలో గృహజ్యోతి కింద 200 యూనిట్లు లోపు వాడుకున్న వారికి ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందజేత పథకాలను ఈ నెల నుంచి అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం నుంచి కేటగిరి వన్ వినియోగదారులకు ఉచిత విద్యుత్తు అర్హుల గుర్తింపుపై మండల విద్యుత్ అధికారులు ముమ్మరంగా కసరత్తు ప్రారంభించారు. మండలంలోని 22 గ్రామాలలో మీటర్ రీడింగ్ కార్యక్రమాలను విద్యుత్ అధికారులు ప్రారంభించారు.

బోనకల్ మండలంలోని 22 గ్రామాలలో కేటగిరి -1 కింద 12,078 మీటర్లు ఉన్నాయి. ఇందులో సుమారు 200 యూనిట్లు లోపు వాడుకునే వినియోగదారులు పదివేల మంది వినియోగదారులు అర్హులుగా ఉండవచ్చునని మండల విద్యుత్ ఏఈ దొండేటి ఉమామహేశ్వరరావు తెలిపారు. మీటర్ రీడింగ్‌తో పాటు వివరాలను గ్రామాలలో సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు 200 యూనిట్లు లోపు వినియోగించుకునే వారి తెల్ల రేషన్ కార్డు, గృహ వినియోగదారుల ఆధార్ నెంబర్‌తో పాటు ఫోన్ నెంబర్ ను కూడా ఆన్లైన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెల్ల రేషన్ కార్డు కూడా అనుసంధానం చేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ప్రచారం జరుగుతుంది కదా అని దొండేటి ఉమామహేశ్వరరావు ని ప్రశ్నించగా అటువంటిది ఏమీ లేదని, ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టకపోయినా వారి ఆధార్, ఆహార భద్రత కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు తీసుకోవాలని ఉన్నతాధికారులు తెలిపినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 15 లోపు 22 గ్రామాలలో ఆన్లైన్ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో 2,181 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారే ఈ పథకానికి అర్హులని ఆయన తెలిపారు. దీనికి తోడు బిల్లు జారీ సమయంలో వినియోగదారుడు ఆ నెలకు 200 లోపు యూనిట్లను వినియోగించి ఉండాలన్నారు. ఈ పథకం వర్తించిన తర్వాత ఒకవేళ బకాయిలు చెల్లించకపోతే గృహజ్యోతి పథకం నుంచి వారిని తొలగించడం జరుగుతుందని తెలిపారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

- 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను

జయప్రదం చేయాలి : బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్ర బిజెపి కార్పొరేట్ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని వైరా సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన రైతు కార్మిక సదస్సు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డపాటి రమేష్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కె.అర్జున్ రావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తయిన రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తోట నాగేశ్వరావు, అనుమోలు రామారావు, ఎస్.కే జమాల్, యలదండి బాబు, గారపాటి అశోక్, బాజోజు రమణ, పాపగంటి రాంబాబు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యమాల గోపాలరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, తూము



సుధాకర్, గుమ్మా నరసింహారావు, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ, మిట్టపల్లి రాఘవరావు, బండారుపల్లి ముత్తయ్య, చిత్తారు మురళి, పాసంగులపాటి చలపతిరావు, నర్వనేని చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

చదువుల్లో రాణిస్తేనే అభివృద్ధి సాధించగలం

- న్యూ లిటిల్ ఫ్లవర్ సంస్థల అధినేత

పోతనేని భుమేష్

నవతెలంగాణ-కొణిజర్ల

విద్యార్థులు చదువుల్లో రాణిస్తేనే తమ జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకుని అభివృద్ధి చెందగలరని అదేవిధంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వైరా లోని న్యూ లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల అధినేత పోతనేని భూమేశ్వర్ రావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పల్లిపాడులో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ విద్యార్థులకు డ్రైఫ్రూట్స్, ఇతర పండ్లును ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. ఈ సందర్భంగా పల్లి పాడుఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచిన వారికి సహాయం చేసే అవకాశం ఉంది అని, విద్యార్థులు అలాంటి అవకాశాల్ని వినియోగించుకుని తమ బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని కోరారు. పల్లిపాడు ఉన్నత పాఠశాల లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు రాసేవరకు 50 రోజుల పాటు సాయంత్రం వారికి ఆరోగ్యాన్ని ఇచ్చే డ్రై ఫ్రూట్స్, పండ్లు లాంటివి అందించడం కోసం అక్కడికక్కడే 15 వేల రూపాయలను పాఠశాల ప్రధానోపాధ్యాయులుకు అందించారు. ఈ సందర్భంగా భూమేశ్వరావు కి ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలియచేస్తూ ఉత్తమ పలితాలు సాదించేందుకు కషి చేస్తాము అని



తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుల్జార్ బేగం, డివిఎస్ రావు, రామన, అచ్యుత్, అజీం, సంక్రాంతి రవి కుమార్, ఉష తదితరులు పాల్గొన్నారు.



దోపిడీ దొంగల అరెస్ట్

విలేకరుల సమావేశంలో ఏసీపీ రెహమాన్

నవతెలంగాణ-వైరా

దోపిడీ దొంగలను అరెస్టు చేసినట్లు వైరా ఏసీపీ రెహమాన్ తెలిపారు. ఈ మేరకు సిఐ సాగర్, వైరా, తల్లాడ ఎస్ఐలు మేడా ప్రసాద్, బి.కొండల్‌రావులతో కలిసి ఏసీపీ మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అనేక దొంగతనాలు, దోపిడీలు, మోసాలకు పాల్పడుతూ దొరికిపోతూ అనేక కేసులు అనుభవిస్తున్న ముఠా సభ్యులు దూర ప్రాంతాలలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రత్యేకించి టాటా సుమో గోల్డ్ వెహికిల్ కొనుగోలు చేశారు. దొంగల ముఠాలో పల్నాడు జిల్లా సాతులూరు గ్రామానికి చెందిన బండారి ఏడుకొండలు, బండారి నాగేశ్వరరావు, బండారి అచ్చన్న, బండారి తిరుపతిరావు (పరారీలో ఉన్నాడు), బిట్రా హనుమంతరావు (సత్తెనపల్లి) లావుడ్యా శ్రీనివాసరావు(కొత్త సుగాలి కాలనీ సత్తెనపల్లి) ముఠా సభ్యులుగా ఉన్నారు. ఈ ముఠా వృద్ధ దంపతుల వద్ద కాజేసిన బంగారంతో సహా మరలా 06.02.2024న ఏపి 07 టివి 1659 గల కారుతో తెలంగాణలో దొంగతనాలు చేసి బంగారాన్ని కూడా అక్కడే అమ్ముకుని రావచ్చని బయలు దేరగా పక్కా సమాచారంతో ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం క్రాస్ రోడ్ వద్ద ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఏసిపి తెలిపారు. బండారి తిరుపతి రావు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కాగా దోపిడీ దొంగల ముఠాను అతి తక్కువ కాలంలో పట్టుకున్న వైరా, తల్లాడ ఎస్ఐలను క్యాష్ అవార్డు, ప్రశంసా పత్రాలతో అభినందించారు.

పేదలకు ఆహార సామాగ్రి, దుస్తులు పంపిణీ

ఎర్రుపాలెం : మండల పరిధిలోని కొత్తపాలెం, రేమిడిచర్ల గ్రామలలో మెట్రోపాలిటన్ చర్చ్, క్రైస్తవ సంగంలోని అనాధ పేద క్రైస్తవులకు షేర్ ది విజన్ సంస్థ వారు మంగళవారం ఆహార సామాగ్రి, దుస్తులు పంపిణీ చేశారు. రెండు గ్రామాలలో సుమారు 100 మంది అనాథ క్రైస్తవులను గుర్తించి ఈ కిట్లను, దుస్తులను సుమారు 70,000 వేల రూపాయల విలువ కలిగిన దుస్తులను ఆహార సామాగ్రిని పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షులు పోధిల నారా యణ తెలిపారు.

'డీఆర్ఎస్' విద్యార్థికి తృతీయ బహుమతి

నవతెలంగాణ-ఖమ్మం

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ కృష్ణ రివర్ స్విమ్మింగ్ ఈత పోటీలను విజయవాడలో నిర్వహించారు. ఈ పోటీలలో డిఆర్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి కె.టి.రాఘవేందర్ బి.కామ్ విద్యార్థి తృతీయ బహుమానం పొంది రజిత పథకం కైవసం చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ వి.మోహన్‌రెడ్డి, ఛైర్మెన్ వి.శోభారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ టి.నాగేశ్వర్‌రావు, ఏవో బి.వెంకటకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ వై.పి.ఆర్.సి. వరప్రసాద్, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్రం అప్పుల కుప్ప

జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల్లు దుర్గా ప్రసాద్,జావేద్

నవతెలంగాణ- ఖమ్మం

పది ఏండ్లుగా పాలించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మహమ్మద్ జావేద్‌లు ఆరోపించారు. మంగళవారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవనంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్థిక భారం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని అమలు చేయడం ప్రారంభించిందన్నారు. బీఆర్ఎస్ నేతలు కారు కూతలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

నవ తెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక వన్‌టౌన్ పరిధిలోని అంబేద్కర్ సెంటర్లో జడ్పీ సెంటర్‌లో ఎన్ఎస్‌యుఐ ఖమ్మం నగర అధ్యక్షుడు యశ్వంత్ వర్ధన్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రెసిడెంట్ సంతోష్, అర్బన్ ప్రెసిడెంట్ పఠాన్, షారుఖ్ ఖాన్, తుమ్మలగడ్డ ఎస్సీ యూత్ లీడర్ నవాజ్, అభయ్, కాంగ్రెస్ లీడర్ పటాన్, జమీల్, అంజత్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ సెంటర్లో ప్రధాని రహదారి పైన నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రమాదాల నివారణ కోసం పోలీసు, గ్రామపంచాయితీ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. స్టేట్ హైవేకి ఇరువైపులా షాపులో సంబంధించిన హెూర్డింగ్స్ బోర్డులు ఫుట్ పాత్ వ్యాపారులు తారు రోడ్డు వరకు పెట్టడంతో ప్రమాదాలు జరగటానికి కారణంగా మారింది. దీంతో పోలీసు గ్రామపంచాయతీ అధికారులు ఆధ్వర్యంలో తోపుడు బండి ఫుట్ పాత్ వ్యాపారులు రోడ్డు వరకు రాకుండా ప్రధాన రహదారి తారు రోడ్డు నుండి మూడు మీటర్లు వరకు పెట్టడానికి వీల్లేదని కొలత వేసి మరి ముగ్గు పోశారు. 24 గంటల్లో లోపులో వెనక జరపాలని షాపులు సంబంధించిన బోర్డులు తొలగించాలని. లేకపోతే తామే తొలగిస్తామని సీఐ వెంకటేష్‌గౌడ్, ఎస్సై షేక్ షాకీర్, ఈవో కృష్ణారావు, హెచ్చరించారు. విలువైన ప్రాణాలు కాపాడటం కోసం చర్యలు చేపడుతున్నామని అందరూ సహకరించాలని వారు కోరారు. ప్రధాన రహదారి వెంట ఇరువైపులా, మధిర రోడ్డుకి ఇరువైపులా ముగ్గు పోసి గీత గీశారు. అందరూ తమ ఆదేశాలను పాటించి తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను

ఆశా వర్కర్లందరూ జయప్రదం చేయాలి

నవతెలంగాణ మధిర:

16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ను ఆశా వర్కర్లందరూ జయప్రదం చేయాలని దెందుకూరు గవర్నమెంట్ డాక్టర్ కి సమ్మె నోటీసును కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా అధ్యక్ష కార్యదర్శులు వేము లక్ష్మి, కొప్పల సృజన, వేల్పుల లీల,భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు మానవ హక్కులపై అవగాహన

మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీ నందు మంగళ వారం మానవ హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్షులుగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ఫౌండర్ డాక్టర్ బొడ్డపాటి దాసు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్నటువంటి కల్తీ వినియోదారులకు జరుగుతున్నటువంటి మోసాలు, హక్కులు , ఫోక్సో ఆక్ట్, సమాచార హక్కు చట్టం వైద్యులకున్నటువంటి హక్కులు, గురించి క్లుప్తంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వి, జి.పద్మ, లంకా కొండయ్య పాల్గొన్నారు.

మధిరలో గృహ జ్యోతి పథకంపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-మధిర

రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోయే గృహజ్యోతి పథకంకు సంబంధించి లబ్ధిదారుల నుండి సంబంధిత సమాచారం సేకరించే ప్రక్రియలో భాగంగా మధిర, ఎర్రుపాలెం మండలాల స్పాట్ బిల్లర్స్ (మీటర్ రీడర్స్)తో విద్యుత్ శాఖ వైరా డివిజన్ డీఈ ఎస్.కృష్ణ మధిర సబ్ డివిజన్ ఆఫీసులో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినారు. ప్రతి గృహ విద్యుత్ వినియోగదారుడు ఈ పథకం కింద లబ్ధి చేకూరేలా వారి ఆధార్, రేషన్ కార్డు నెంబర్ (ఫుడ్ సెక్యూరిటీ కార్డు), సెల్ నెంబర్ సేకరించి సంబంధిత వినియోగదారుని విద్యుత్ సర్వీస్ నెంబర్‌కు అనుసంధానం చేయవలసినదిగా శిక్షణ ఇచ్చినారు. ఈ సమావేశంలో మధిర సబ్ డివిజన్ ఏడిఈ ఎం.అనురాధ, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ ఎ.శివాని, మధిర పట్టణ, రూరల్ ఏఈలు ఎస్.అనిల్ కుమార్, కె.నాగేశ్వరరావు లతోపాటు సబ్ ఇంజనీర్స్, మీటర్ రీడర్స్ పాల్గొన్నారు.

బొంత ముత్తయ్యకు సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-మధిర



మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సీనియర్ పార్టీ సభ్యులు బొంత ముత్తయ్య మంగళవారం మరణించారు. ఈ సందర్భంగా వారి భౌతిక కాయాన్ని సందర్శించి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుల పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావులు ఎర్రజెండా కప్పి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మద్దాల ప్రభాకర్, గ్రామ పార్టీ శాఖ కార్యదర్శి బాదినేని వెంకట నరసయ్య, సభ్యులు అంగడాల అమరయ్య, తేలుకోండి నరసింహారావు, లాల్, కాసిం సాహెబ్ మస్తాన్ పాల్గొన్నారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

- విద్యుత్ శాఖ ఏఈలు మేకపోతుల శ్రీనివాసరావు, వి.నారాయణ

నవతెలంగాణ-ముదిగొండ

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమల్లో భాగంగా గృహ జ్యోతి పథకం ద్వారా గృహ వినియోగదారులకు 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ సరఫరాకు విద్యుత్ మీటర్‌కు ఆధార్, తెల్లరేషన్ కార్డ్, ఫోన్ నెంబర్ లను అనుసంధానం చేసుకోవాలని ముదిగొండ, పమ్మి విద్యుత్ శాఖ ఏఈలు మేకపోతుల శ్రీనివాసరావు, వి.నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో విద్యుత్ గృహ వినియోగదారుల ఇంటికి వచ్చి విద్యుత్ బిల్లులు తీసే ఆపరేటర్కు ఆధార్, తెల్లరేషన్ కార్డ్, ఫోన్ నెంబర్ వివరాలను అందజేసి లింకు చేసుకొని గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సాయిస్ఫూర్తిలో బీఫార్మసీ కోర్సు అనుమతికి పరిశీలన

సౌకర్యాలపై పరిశీలన బృందం సంతృప్తి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో బీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు పరిశీలన కోసం ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఎం అంజిరెడ్డి, అకడమిక్ సెంట్ ఆన్స్ ఇంజినీరింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రాజు, జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ ఆఫ్ ఫార్మసీ డాక్టర్ కృష్ణమోహన్ బుధవారం కళాశాలలో పర్యటించారు. పరిశీలనలో భాగంగా వసతులు, గ్రీనరీ తదితరాంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో ఇన్ని వసతులతో కూడిన కళాశాల ఉండటం ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టంగా వారు భావించారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలను నాక్, అటానమస్ గుర్తింపు కోసం ముందుకు తీసుకెళు న్నామన్నారు. విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద మాట్లాడుతూ కళాశాలను యూనివర్శిటీగా చేయడమే లక్ష్యంగా ఛైర్మెన్, ఎంపీ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి ఆశయంగా ఆమె చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి, కళాశాలలోని అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-సత్తుపల్లి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు సత్తుపల్లి కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. ఇందుకు నిరసనగా బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడిన బాల్క సుమన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి ఎస్‌హెచ్‌వో (సీఐ) తెల్లబోయిన కిరణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివా వేణుబాబు, గాదె చెన్నకేశవరావు, కమల్‌పాషా, సందీప్, ఐ.శ్రీను, కౌన్సిలర్ దూదిపాల రాంబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ ఉన్నత పాఠశాలలో ఈనెల 7, 8 తేదీలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు కలకోట ఉన్నత పాఠశాల హెచ్ఎం దారేల్లి సునీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడవ తేదీన తూటికుంట్ల, లక్ష్మీపురం, గోవిందాపురం ఎల్, రామాపురం, ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం, చిరునోముల, రావినూతల, బోనకల్, జానకిపురం, రాయన్నపేట, సీతానగరం, పెద్ద బీరవల్లి, నారాయణపురం, చిన్న బీరవల్లి, రాపల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట, ఆళ్ళపాడు, మోటమర్రి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. ఆయా పాఠశాలకు చెందిన నిర్దేశించిన ఉపాధ్యాయులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | ఫిబ్రవరి 07, 2024 | www.navatelangana.com

భరోసా కేంద్రాలను ప్రారంభించిన డీజీపీ

- మహిళలు, చిన్నారుల సంరక్షణే పోలీసుల ప్రధాన ధ్యేయం : ఎస్పీ



నవతెలంగాణ-కొత్తగూడెం

మహిళలు, చిన్నారుల రక్షణ కోసం రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భరోసా కేంద్రాల ఏర్పాటులో భాగంగా మంగళవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తా హైద్రాబాద్ డీజీపీ కార్యాలయం నుండి 8 జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలను వర్చ్యువల్‌గా ప్రారంభించారు. ప్రధాన కార్యాలయం నుండి జరిగిన ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజిపి శిఖా గోయల్, అడిషనల్ డీజిపి సీఐడి మహేష్ భగవత్, మల్టీ జోన్-1 అండ్ 2 ఐజీ తరుణ్ జోషిలు పాల్గొన్నారు. లైంగికదాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించేవరకూ "భరోసా సెంటర్" అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, షీ టీం ఇంచార్జి ఎస్సై రమాదేవి, ఏహెచ్‌టియూ ఎస్ఐ శ్రీనివాస్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్స్ నాగరాజు, రాజువర్మ, 2టౌన్ సిఐ రమేష్, ఎస్ఐలు నరేష్, సంతోష్, రవి, పురుషోత్తం, జుబేదా, విజయ, విజయకుమారి, భరోసా టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



రామయ్యని దర్శించుకున్న మాజీ కేంద్ర మంత్రి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని మాజీ కేంద్ర మంత్రి వర్యులు, మాజీ మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వాముల వరిని దర్శించుకున్నారు. వారితో పాటు గ్రంధాలయ మాజీ చైర్మన్ బోగల శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చింత్రాల రవి కుమార్, పట్టణ అధ్యక్షులు సరళ నరేష్, కాంగ్రెస్ నాయకులు తమ్మల వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు రాసమల్ల రాము, వెంకట్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫేమస్ మార్ట్ బేకరీ కేక్ హౌస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలం పరిధిలోని ముర్రేడు వాగు బ్రిడ్జి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఫేమస్ మార్ట్ బేకరీ కేక్ హౌస్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాష, తదితర నాయకులు పాల్గొన్నారు.

కొండరెడ్ల జీవన స్థితిగతులపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-దమ్మపేట

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు దమ్మపేట మండలంలోని పూసుకుంట కొండరెడ్ల కుటుంబాల జీవన స్థితి గతులపై కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా పీఎం జన్మాన్‌పై నివేదికపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. మంగళవారం స్థానిక తహశీల్దార్, నోడల్ అధికారి అయిన ముజాహీద్ అధ్యక్షతన మండలంలోని పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, ఎపిజివిబి బ్యాంక్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో పీఎం జన్మాన్ లబ్దిదారుల గురించి చర్చించారు. తదుపరి సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ-ములకలపల్లి

కస్తూరి ఫౌండేషన్ సహకారంతో పుష్పాల చంద్రరావు ఆధ్వర్యంలో మండలంలోని పుసుగూడెం, జగన్నాధపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముల్కలపల్లి కేజీబీవీ, కమలాపురం ఆశ్రమ పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. విద్యార్థుల కోసం, ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తున్న కస్తూరి ఫౌండేషన్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలియజేశారు. ఎంపీటీసీ మోహరమని, వెంకన్న, కొమరయ్య, సీతారాములు, సాయి, దుర్గాప్రసాద్, పతిలాల్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. బర్మాక్యాంప్, బాబూకాంప్, బర్లీఫిట్ ఏరియా, సన్యాసిబస్తి, మధురబస్తీ, బస్టాండ్, రామాటాకీస్ ఏరియాలో గల ఈ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ అధికారి హేమచంద్ర బాబు ప్రకటనలో తెలిపారు.

విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

- సబ్ యూనిట్ ఆఫీసర్ లింగ్యా నాయక్

నవతెలంగాణ-పినపాక

ఆశాలు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సబ్ యూనిట్ ఆఫీసర్ లింగ్యా నాయక్ సూచించారు. మంగళవారం పినపాక మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దుర్గా భవాని ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గా భవాని మాట్లాడారు. కుటుంబ సంక్షేమం ఆరోగ్య సేవలతోనే ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలోని ప్రతి ఇంటిని రోజుకు 30 నుంచి 40 ఇల్లు సర్వే చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిహెచ్‌ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-మణుగూరు

కొండేరు మల్లయ్య రాజమ్మ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణపురం గ్రామాలో మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. సంతపురి వెంకటమ్మ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోవడం వలన దశదిన కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించినట్టు ట్రస్ట్ సభ్యులు వారి కొడుకులు, మనవాళ్లు, మనవరాలు ఆర్థిక సహాయంగా రూ.5000 వేలు, 50 కేజీల బియ్యం ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో కొండేరు నాగభూషణం, రాము, శివరామకృష్ణ, రామారావు, వెంకటేశ్వర్లు, నాగార్జున రావు, శ్రీనివాసరావు, మహేందర్, నవాతి, మురళి,తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి : పద్మ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గ్రామీ ప్రాంతాలలో వైద్య సేవలను అందిస్తూ నిత్యం ప్రభుత్వం వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆశ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం, నర్సాపురం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. పద్మ మాట్లాడుతూ ఈ నెల16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో మండలంలో ఉన్న ఆశ వర్కర్లందరూ సమ్మెలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా మండల నాయకులు భాగ్య, శిరోమణి భద్రమ్మ సుజాత, నర్సు, జానకి, అమ్మాజీ, సరస్వతి సుభద్ర, లక్ష్మి, చిన్నక్క అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-పినపాక

మండలంలోని ఎల్లిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో కాళ్ల చైతన్య (10) బాలుడిపై మంగళవారం మధ్యాహ్నం వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన కాళ్ల నరసింహారావు కుమారుడు చైతన్య ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్కలు వచ్చి తీవ్రంగా కరిచాయి. చిన్నారి అరుపులు విన్న తల్లిదండ్రులు, స్థానికులు బయటకు వచ్చి బాలుడ్ని రక్షించారు. అప్పటికే గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలించారు. పినపాక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడంతో ప్రాథమిక చికిత్స చేసి అనంతరం మెరుగైన చికిత్స కోసం మణుగూరు 100 పడకల ఆసుపత్రికి వెళ్లమని చెప్పినట్లు బాలుడి తండ్రి నరసింహారావు తెలిపారు. వీధి కుక్కలు పెరిగిపోయాయని వాటిని తరలించకపోతే ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరించారు.

పల్లెల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు కృషి చేయాలి

- కలెక్టర్ ప్రియాంక అల



నవతెలంగాణ-పాల్వంచ

పల్లెల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల విధులపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పాలకవర్గం ఫిబ్రవరి 1వ తేదీ సాయంత్రం వరకు ముగియడంతో ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. జిల్లాలోని 479 గ్రామ పంచాయతీలకు 218 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామపంచాయతీ పాలకవర్గం సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికలు జరిగే వరకూ పరిపాలన సౌలభ్యత కోసం ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రత్యేక అధికారులు ద్వారా విధులు నిర్వహించుటకు అధికారాలు కల్పించినట్టు చెప్పారు. ప్రత్యేక అధికారులు పంచాయతీ విధులు నిర్వాణపై అవగాహన ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రత్యేక అధికారులు చట్టంలో పేర్కొన్న విధంగా విధులు నిర్వహించుటకు సమగ్రమైన అవగాహన కలిగి ఉండేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్‌కున్న అన్ని విధులు ప్రత్యేక అధికారులకు ఉంటాయని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు పెంపకం, ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ, డ్రై వేస్ట్ వ్యర్థాలు నిర్వహణ, పన్నులు వసూలు వంటి ఎంతో ప్రాణహితమైన విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. పంచాయతీలో జరుగుతున్న పనులు బిల్లులు చెల్లింపులు, ఫార్ములకు మాత్రమే చెల్లింపు చేయాలని వ్యక్తులకు చెల్లింపులు చేయవద్దని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ చేయాలని చెప్పారు. మంచినీటి సరఫరా తీరుని పరిశీలించాలని, ఎక్కడైనా పైపులను లీకేజీలు మరమ్మతులు తక్షణమే చేపట్టి మంచినీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ నెల 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ ప్రభుత్వం గ్రామాలకు పరిశుభ్రతకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టిందని కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి ఎంపీడీవో, ఎంపీవోలు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంస్థ, కార్మికుల అభివృద్ధే లక్ష్యం

- మల్టీ డిపార్మెంటల్ టీమ్స్ కార్యక్రమంలో జీఎం



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోవాలని ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అన్నారు. ఏరియాలోని జె.కె ఉపరితల గని, ఏరియా హాస్పిటల్లో మల్టీ డిపార్మెంటల్ టీమ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం హాజరై, మాట్లాడారు. ఇల్లందు ఏరియాలోని ఉద్యోగులందరికీ సింగరేణి సంస్థ, ఉత్పత్తి, ఉత్పాదకత, సింగరేణిలో వాడుకలో ఉన్న మిషనరీ, పనితీరు, ఉత్పత్తి వ్యయం, ఇల్లందు ఏరియాలో కంపెనీ భవిష్యత్తు, ప్రణాళికలు, కార్మికులకు సంస్థ అందించిన సంక్షేమ కార్యక్రమాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం పై మల్టీ డిపార్మెంటల్ టీమ్స్ నందు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు శివ ప్రసాద్, ఏజీఎం(ఐడి) యం.గిరిధరరావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గన్నారు.

పొజీషన్‌లో ఉన్న ప్రతీ రైతుకు పామాయిల్ మొక్కలు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ-దమ్మపేట

పామాయిల్ సాగు చేయాలనే ఆసక్తి కలిగిన ప్రతీ రైతుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పామాయిల్ మొక్కలను అందజేసి రైతుల ఆర్థిక అభివృద్ధికి పూర్తిగా తోడ్పడాలని, వారికి సహకరించాల్సిన బాధ్యత ఆయిల్‌ఫెడ్ అధికారులకు ఉందనిరాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో మంత్రి తుమ్మల నివాసంలో ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణారావులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ పామాయిల్ సాగు కోసం ఎంతో మంది రైతులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని కొన్ని ప్రాంతాల్లో రైతులకు సంబంధించిన రికార్డులు కనుమరుగైనప్పటికీ ఇప్పటి వరకూ పాస్ పుస్తకాల మీదే పామాయిల్ మొక్కలు అందించడం జరిగిందని అన్నారు. ఈ క్రమంలో రైతులు తమ తమ భూముల్లో సాగు చేసుకుంటూ ఎవరైతే సాగు చేసుకుంటూ పొజీషన్‌లో ఉంటారో ఆ రైతులు అట్టి భూముల్లో సాగులో ఉన్నట్లు తహశీల్దార్ నుండి పొజీషన్ సర్టిఫికెట్‌లు తీసుకొని నేరుగా అందించిన రైతులకు సబ్సిడీపై పామాయిల్ మొక్కలను త్వరితగతిన పంపిణీ చేయాలని సూచించారు. ఇట్టి విషయంలో యామరపాటు వద్దు అని ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఖమ్మం జిల్లా హార్టికల్చర్ ఉన్నతాధికారిణి అనసూయ మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి తుమ్మలకు పలు విజ్ఞప్తులు చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన హెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం చాటిన సత్యమార్గం

- ఎర్రంపాడు చెన్నాపురం ఆదివాసీ గ్రామాలలో దుస్తులు పంపిణీ
- ఆదివాసీ ప్రజలతో మమేకమైన సత్యమార్గం యూత్ సర్వీసెస్ సొసైటీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి





నవతెలంగాణ-చర్ల

ఆదివాసీలకు బాసటగా నిలిచి తమదైన శైలిలో సేవా దృక్పథాన్ని సత్యమార్గ యూత్ సర్వీస్ సొసైటీ చైర్‌పర్సన్ శ్రీ లక్ష్మి, కోశాధికారి నగేష్ సాటుతున్నారని పలువురు కీర్తిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రంపాడు చెన్నాపురం గ్రామాలలో నివసిస్తున్న సుమారు 150 కుటుంబాలకు మూడు జతలు చొప్పున దుస్తులు, చెప్పులు, చిన్నపిల్లలకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. మారుమూల ఆదివాసీ గ్రామాలలో నివసిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు సరిగా లేవని తెలుసుకొని ఖమ్మం, హైదరాబాదు నగరాలలో దాతల ద్వారా సేకరించిన దుస్తులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ, ప్రైమరీ పాఠశాల విద్యార్థులతో సంస్థ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి మమేకమై మాట్లాడారు. అంగనవాడీ నిర్వహణకు భవనం లేని దుస్థితిని గమనించి వారు చలించిపోయి అంగనవాడీ నిర్వహణకు షెడ్డు నిర్మాణం కోసం అయ్యే ఖర్చులు ఏర్పాటు చేపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యువత మడకం చందు, జోగయ్యలు మాట్లాడుతూ విద్యాసంస్థలు సరిగా లేకపోవడంతో మా గ్రామాల చిన్నారులు చదువుకోవడం ఇబ్బంది అవుతుందని వారు తెలిపారు. చదువుకున్న విద్యార్థులకు సైతం పుర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని ఎన్జీవో చైర్మన్‌కు వారు తెలిపారు. కలెక్టర్‌ను కలిసినప్పుడు ఈ విషయమై చర్చిస్తానని ఆమె హామీ ఇచ్చారు. మారుముల ఆదివాసీ గ్రామాలలో ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులను టీవీలలో, పేపర్లో చూడడం తప్పా స్వయంగా చూడడం మొదటి సారీ అని, ఇక్కడ పరిస్థితులు హృదయ విదారకంగా ఉన్నాయని ఆమె వాపోయారు. వీలైనంతవరకు తనకు తోచిన సహాయ, సహకారాలు తమ సంస్థ ద్వారా ఆదివాసీ గ్రామాలకు అందిస్తానని ఆమె తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సత్యమార్గం వాలంటీర్ దొడ్డి హరినాగ వర్మ, బాలు, గ్రామ పెద్దలు జోగయ్య, పదం సింగయ్య, కల్మ నందయ్య, మడకం చందు జోగయ్య, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.



పత్తి రైతులు కన్నెర్ర..

- పత్తి కొనుగోలు చేయడంలేదని ఆగ్రహం
- రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

నవతెలంగాణ-బూర్గంపాడు

ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటను కొనుగోలు చేయడంలేదని పత్తి రైతులు రోడ్డెక్కి రాస్తారోకో చేసిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీపురం జిన్నింగ్ మిల్లు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీపురంతో పాటు ఇతర గ్రామాలకు చెందిన పత్తి రైతులు తమ పత్తిని జిన్నింగ్ మిల్లు వద్ద విక్రయించేందుకు వెళ్లగా దిగుమతి చేసుకోకుండా క్వింటాకు 10 కిలోలు తారం తీస్తున్నారని రైతులు ఆవేదనకు గురై రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా పత్తిని ఎలాంటి తారం లేకుండా కొనుగోలు చేయాల్సిన సిబ్బంది తారం పేరుతో క్వింటాకు 10 కిలోలు తగ్గించి తమకు నష్టాన్ని కలిగించే ప్రయత్నం చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. తెచ్చిన పంటను కొనుగోలు చేసుకోవడంలేదని రైతులు ఆరోపించారు. రైతులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగడంతో సుమారు కిలోమీటరు మేర రోడ్డుకు ఇరువైపులా వచ్చిపోయే వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ రాస్తారోకోలో మండలానికి చెందిన పత్తి రైతులు పాల్గొన్నారు.

పంట రుణాల కోసం అవస్థలు పెడుతున్న బ్యాంక్ మేనేజర్

- బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి



నవతెలంగాణ-ఇల్లందు

గత కొంతకాలంగా పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రైతులకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందుల గురి చేస్తున్నారు. దీంతో రైతులందరూ కలిసి మంగళవారం మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, చంద్ర అరుణ పాల్గొని మాట్లాడారు. మండలానికి చెందిన రైతులకు పంట రుణాలు ఇవ్వకుండా పక్క మండలమైన కారేపల్లి మండలానికి 800 మంది రైతులకు పంట రుణాలు ఇవ్వడం ఇల్లందు మండలానికి చెందిన 60 మంది రైతులకు మాత్రమే పంట రుణం ఇచ్చారన్నారు. ఈ విషయం తెలుసుకొని రైతు సంఘం ప్రజాపంథా పార్టీ ప్రతినిధి వర్గం మూడు దఫాలుగా మేనేజర్‌ని కలిసి వివరించడం జరిగిందన్నారు. ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోకుండా ఒక ఏరియాకే పరిమితమై కారేపల్లి మండలానికి 800 లోన్లు ఇచ్చి ఇల్లందు మండల రైతులకు సుమారు 60 లోన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నాడని, రైతులు ఆగ్రహానికి గురై రోడ్డుపై బైఠాయించడంతో టోకెన్ సిస్టం అని పెట్టి ఈ టోకెన్లు కూడా ఒకటి నుండి 100 సీరియల్ వరకు కారేపల్లి మండలానికి చెందిన వారే ఉండటంతో ఈ మేనేజరు లంచాలు తీసుకొని లోన్లు ఇస్తున్నారు అనడానికి బలమైన ఆధారాలున్నాయన్నారు. రీజినల్ మేనేజర్, కలెక్టర్ ఉన్నత అధికారులకు ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి ఇల్లందు మండలానికి సంబంధించిన రైతులకు తక్షణమే పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అజ్మీరా బిచ్చా, ఆర్.బోస్, పాయం వెంకన్న, కిరణ్, రామ్మూర్తి, భాస్కర్, దేవా తదితరులు పాల్గొన్నారు.

నడికుడి జీపీ పాలకవర్గానికి ఘన సన్మానం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

నడికుడి గ్రామపంచాయతీ పాలకవర్గంగా 2019 సంవత్సరం నుండి 2024 జనవరి 31వ తేదీ వరకు ప్రజాప్రతినిధులుగా వారు అందించిన సేవలను కొనియాడుతూ మంగళవారం గ్రామపంచాయతీ ప్రజలు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన సర్పంచ్‌కు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించి ఐదేళ్లపాటు వారు చేసిన అభివృద్ధిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తెల్లం రామకృష్ణ ఉప సర్పంచ్ జంపన్న, నడికుడి ఎంపీటీసీ సోడే తిరుపతిరావు, వార్డు సభ్యులు దుర్గమ్మ నాగేశ్వరావు, లక్ష్మి, భద్రమ్మ, తిరుపతమ్మ, చలపతి, నాగమ్మ వీరస్వామ్మి పంచాయతీ అధికారి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎలక్షన్స్‌లో గట్టి గుణపాఠం చెబుతాం

- మెడలో చెప్పల దండ వేసి ఊరేగిస్తాం
- బాల్క సుమన్ పై ఆగ్రహించిన ఎమ్మెల్యే కోరం



నవతెలంగాణ-ఇల్లందు

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలు, చెప్పు చూపించటం లాంటి చర్యలు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజలకు ఎంతో ఉద్వేగాన్ని కలిగించాయని మేము తలుచుకుంటే నీ మెడలో చెప్పుల దండ వేసి ఊరేగిస్తామని చెప్పులు చూపిస్తూ ఎమ్మెల్యే కోరం కనకయ్య తీవ్రంగా విరుచుకబడ్డారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ గడచిన పది సంవత్సరాలలో బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదన్నారు. గతంలో కేసీఆర్ శంకు శంకుస్థాపన చేసిన సీతారామ ప్రాజెక్టును కూడా వారి సొంత లాభం కోసం వేరే ప్రాంతానికి తరలించి ఇల్లందు ప్రజానీకానికి ఎంతో అన్యాయం చేశారని తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్ మాట్లాడుతూ బాల్క సుమన్ అనే వ్యక్తి ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్న రోజుల్లో వేసుకోవడానికి దుస్తులు కూడా లేని పరిస్థితిలో ఉన్న వ్యక్తి బీఆర్ఎస్ పార్టీ అండతో దొంగదారిలో మొన్నటివరకు వందల కోట్లు సంపాదించి ఇవాళ అగౌరపరిచే విధంగా మా ముఖ్యమంత్రిని విమర్శిస్తే ఊరుకోమని తగిన గుణపాఠం చెప్తామని పేర్కొన్నారు. అనంతరం ఇల్లందు మండల అధ్యక్షుడు పులి సైదులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, గార్ల మండల అధ్యక్షుడు డి.రామారావు, సాంబమూర్తి, సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, మాదారమ్మ, అక్కిరాజ్ గణేష్, నరసింహరావు, బిక్షం, మున్నా, అక్తర్, వెంకన్న, బత్తుల వెంకన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు ఖబడ్దార్..బాల్కా సుమన్ నోరు అదుపులో పెట్టుకో... బాష తీరు మారకపోతే ప్రజలే తగిన బుద్ధి చెపుతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాయకులు బీఆర్ఎస్ నాయకుడు బాల్కా సుమన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చాపలమడుగు నరసారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంశెట్టి రాంబాబు, ఓబీసీ సెల్ మండల ప్రెసిడెంట్ గోపు రామకష్ణ, కిసాన్ సెల్ మండల ప్రెసిడెంట్ అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

టీ హబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ గుమ్మడి గాంధీ



నవతెలంగాణ-పినపాక

ప్రభుత్వ వైద్యశాలలో టీహబ్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ గుమ్మడి గాంధీ సూచించారు. మంగళవారం ఆయన పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న టీ హబ్ సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో పేద ప్రజలకు ఉచితంగానే వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులు సైతం అందిస్తున్నట్లుగా తెలియజేశారు. సుమారు 80 టెస్టులు ఉచితంగా అందిస్తున్నట్లుగా తెలిపారు. మండలంలో వైద్యశాఖ అధికారులను ఆయన అభినందించారు. గ్రామాల్లో హెల్త్ క్యాంపులకు సైతం ప్రజలు సహకరించాలని ఎంపీపీ కోరారు.





సమ్మెతో కేంద్రానికి కనువిప్పు కలగాలి

విపక్ష, ప్రజా సంఘాల జిల్లా నేతలు

నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్రంలోని బీజేపీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాపితంగా జరగనున్న కార్మికుల సమ్మె, గ్రామీణ బందును విజయవంతం చేసి కేంద్రానికి కనువిప్పు కలిగించేయాలని విపక్ష పార్టీలు, ప్రజా సంఘాల జిల్లా నేతలు పిలుపు నిచ్చారు. సమ్మె, బంద్ ప్రచారంలో భాగంగా మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం "శేషగిరిభవన్"లో జగిరిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగ సీతారాములు, ప్రజాపంథా జిల్లా కెచ్చల రంగారెడ్డి, సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు తుపాకుల నాగేశ్వర రావు, టిజెఎస్ జిల్లా నాయకులూ మల్లెల రామనాథం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానివి కార్పొరేట్ విధానాలని, దేశ సంపదను, కార్మిలు, రైతుల కష్టార్జితాన్ని అదానీ, అంబానీలాంటి కార్పొరేట్ దిగ్గజాలకు కట్టబెడుతూ దేశాన్ని దివాళా తీయిస్తున్నారని విమర్శించారు. రైతాంగానికి ప్రయోజకనకరంగా ఉన్న ఎఫ్‌సీఐ, సీసీఐ, నాఫెడ్ వంటి సంస్థలను ఎత్తివేసే కుట్రలు చేస్తోందని అన్నారు. అశాస్త్రీయంగా నిర్ణయించిన కనీస మద్దతు ధరలవల్ల రైతులు ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని, పెట్టిన పెట్టుబడులు రాక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి దేశంలో ఏర్పడిందన్నారు. విపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు ఏపూరి బ్రహ్మం, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, కంచర్ల జమలయ్య, కందగట్ల సురేందర్, లిక్కి బాలరాజు, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమారి, ఫహీమ్, సారంగపాణి, ముద్దా బిక్షం, రాము, కృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె, బంద్ పోస్టర్ ఆవిష్కరణ

16న జరిగే దేశ వ్యాప్త సమ్మె, బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్లు అన్నవరపు సత్యనారాయణ, ఏపూరి బ్రహ్మం, రేపాకుల శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, ముద్దా బిక్షం, అమర్లపుడి రాము, కందగట్ల సురేందర్, మల్లెల రామనాథం, ఎల్.విశ్వనాథం, రామ్మూర్తిలు ప్రజలకు పిలుపు నిచ్చారు. మంగళవారం శేషగిరి భవన్‌లో గ్రామీణ బంద్, సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ఎస్‌కేఎం జిల్లా కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా నాయకులు గుగులోత్ రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ప్రచార పోస్టర్ అవిష్కరించిన సీఐటీయూ నేతలు

16న అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజే.రమేష్ పిలుపు నిచ్చారు. సమ్మె విజయవంతం కోసం సిఐటియూ నాయకులు, కార్మికులు కలిసి పోస్టర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల చటాల్న నాలుగు కోడ్‌ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి. వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, వివిధ రకాల రంగాల కార్మికులు పాల్గొన్నారు.

అదేవిధంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార స్వామికి సమ్మె నోటీస్ అందజేశారు. రేగళ్ల, పెనగడపలో ఆశ వర్కర్ల తో సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం అర్బన్ ఆశా వర్కర్ల, ఏఎన్ఎమ్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచ : సమ్మెతో మోడీ విధానాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.రమేష్, సీఐటీయూ కార్యాలయం, పాల్వంచలో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ ప్రాజెక్ట్ నాయకురాలు అచ్చమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శులు ఎ.జె.రమేష్, జిలకర పద్మలు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, పట్టణ కన్వీనర్ కె.సత్య, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్‌స్ యూనియన్ పాల్వంచ ప్రాజెక్ట్, సెక్టార్ నాయకులు అచ్చమ్మ రమ్య, అచ్చి, శ్రీదేవీ, భాను తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రామడుగు వెంకటాచారి కోరారు. మంగళవారం స్థానికంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రాయి రాజా తదితరులు పాల్గొన్నారు.



దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : అర్జున్

అశ్వారావుపేట : దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని వినాయకపురం గుమ్మడవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశ వర్కర్ల సమావేశం భారతి, సమతా అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిన్నె నాగమణి, రాధా చిలకమ్మా వెంకటమ్మ, రవణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : చాయ్ వాళ దేశ ప్రధాని మోడీ చాయిని అమ్మినట్టు దేశంలో ఉన్న ప్రభుత్వ రంగా సంస్థలు సహజవనులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్ పరం చేయడం ప్రగతికి గొడ్డలి పెట్టని ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి సూర్యం, సహాయ కార్యదర్శి జి.రామయ్య విమర్శించారు. ఐఎఫ్టియు జిల్లా కమిటీ సమావేశం మంగళవారం చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్టు భవనంలో పెద్ద బోయిన సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 16న కార్మికులు ఐక్యంగా పాల్గొని దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి, సహాయ కార్యదర్శి సతీష్, కోశాధికారి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : మెడికల్ ఆఫీసర్ ఏటీఎం మున్సిపల్ కమిషనర్‌కి సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేసినట్టు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు కొడిశాల రాములు, వీవోఏ జిల్లా నాయకులు శ్రీను, సీఐటీయూ నాయకులు సాంబశివరావు, నాగేశ్వరరావు, రమణ, సాయమ్మ పాల్గొన్నారు.

చదివేది బీటెక్.. చేసేది దొంగతనాలు

- అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



చదివింది బీటెక్ అయినా చేసేది దొంగతనాలు, చదువును మరచి చెడు అలవాట్లకు బానిసలుగా మారి యువకులు అంతా ఒక గ్రూపుగా కలిసి బైక్‌లు దొంగతనం చేస్తూ ఈజీ మనికి అలవాటు పడిన ఓ అంతర్రాష్ట్ర దొంగలను చాకచక్యంగా పోలీసులు పట్టుకున్నారు. అన్నపురెడ్డిపల్లి ఎస్సై షాహిన తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో గత నేల 16వ తేదీన కొంత మంది వ్యక్తులు రాత్రి సమయంలో కారులో వచ్చి ఓ షాపు ముందు వున్న బుల్లెట్ బైక్‌ను దింగలించుటకు ప్రయత్నించారు. చేయగా రాత్రి డ్యూటీలో వున్న పోలీసులు వారిని గమనించి పట్టుకోవాటనానికి వెళ్లగా వారు కారు వదలి పారిపోయారు. పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. మంగళవారం మహబుబ్ నగర్ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు యువకులు ఏపీ 39 సీజెడ్ 5565 వెళుతుండగ వారిని గమనించిన పోలీసులు గుర్తించి వారిని పట్టుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా నదెడ్ల మండలం, సాతులురు గ్రామం మన్నేపల్లి పవన్(23), బీటెక్ చదువుతున్నట్లు తెలియజేశారు. మరో యువకుడు సయ్యద్ షరీఫ్ (25) సాతులురు గ్రామం అని పలు చోట్ల దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు పోలీస్ స్టేషన్లో అనేక కేసులు ఉన్నట్టు ఆమె తెలిపారు. వీరితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు సుబాని, వీరయ్య, అష్రఫ్ వున్నారని వారు పరారీలో వున్నారని, వీరంతా ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. కారును వదిలి వెళ్ళిన యువకులు కారు కోసం నర్సాపురం నుండి యర్రగుంట వెళుతున్న సమయంలో వాహన తనిఖీలో పోలీసులు గుర్తించి పట్టుకోవడం, వీరిపై కేసు నమోదు చేసి కొత్తగూడెం జెఎఫ్‌సీ కోర్టుకు హాజరు పరిచినట్లు తెలియజేశారు.

మంత్రి తుమ్మలను కలిసిన కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ



రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావును ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కేంద్ర మార్కెటింగ్ సహకార సొసైటీ (డీసీఎంఎస్)కు నూతనంగా చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్వాల శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఖమ్మంలోని తుమ్మల క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన నూతన చైర్మెన్ కొత్వాలను తుమ్మల అభినందించారు. బొకే, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, దారా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన వ్యవసాయ కళాశాలల క్రీడలు

- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థినీ, విద్యార్థులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



స్థానిక వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు రెండవ రోజుకి చేరాయి. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు వరకు ఆటలు రసవత్తరంగా సాగుతున్నాయి. పోటాపోటీగా క్రీడల్లో పోటీదారులు ఆటలు ఆడుతున్నారు. బాలికల విభాగం టెన్నీకాయిట్‌లో అశ్వారావుపేట-సిరిసిల్ల కళాశాలలు పోటీ జరగగా అశ్వారావుపేట విద్యార్థినులు విజయం సాధించారు. రుద్రూరు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల-అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల పోటీ పడగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గెలుపొందారు. డిస్కస్ త్రో, జావలీన, 200 మీటర్ల పరుగు పందాలు లో బాల్ బాడ్మింటన్‌లో అశ్వారావుపేట కళాశాల విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచారు. ఫుట్ బాల్ క్రీడలో అదిలాబాద్-సిరిసిల్ల కళాశాల పై అశ్వారావుపేట కళాశాల గెలుపొందింది. క్రికెట్‌లో జరిగిన పోటీలో పాలెం కళాశాల పై జగిత్యాల కళాశాల విజయం సాధించింది. వాలీబాల్‌లో క్రీడలో సంగారెడ్డి అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల పై రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పై చేయి సాధించారు. వ్యవసాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఆహ్లాదంగా క్రీడా పోటీలను వీక్షిస్తున్నారు.



ఉద్యోగ కార్మిక సమస్యలను పరిష్కరించండి

- జెన్కో అధ్యక్ష, కార్యదర్శులు
- చీఫ్ ఇంజనీర్‌కు మాన్ డైరీ బహూకరణ

నవతెలంగాణ-పాల్వంచ

జన్‌కోలో ఉన్న ఉద్యోగ కార్మిక ఆర్టిజన్ సమస్యలను పరిష్కరించాలని 1104 యూనియన్ జెన్కో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కేటీపీసీ రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో 1104 యూనియన్ నాయకులు చీఫ్ ఇంజనీర్ సిద్ధయ్యని మర్యాదపూర్వకంగా కలశారు. పవర్ మాన్ డైరీ బహూకరించారు. కార్మికుల సమస్యలపై, ఆర్టిజన్ కార్మికుల సమస్యల పై జెన్కో అధ్యక్షచ కార్యదర్శులు చర్చించారు. కార్మికుల క్వార్టర్స్ ఆర్టిజన్ కార్మికులకు డ్యూటీ డ్రెస్, షూస్, హెల్మెట్స్, రైన్ కోట్స్ విషయంపై చర్చించగా కార్మికులందరికీ త్వరలోనే ఇస్తామని తెలియపరిచారు. హాస్పిటల్ విషయంలో కూడా చర్చించినట్టు వారు తెలిపారు. బీటీపీ సర్టిఫికెట్ ఉన్న కార్మికులకు అలవెన్స్ ఇవ్వవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు సమ్మయ్య, కనకరాజు, కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. వారికి జెన్కో నాయకత్వం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలి

నవతెలంగాణ-మణుగూరు

ఆర్టీసీ కార్మికుల సంతోషాన్ని వమ్ము చేయకుండా ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు డిమాండ్ చేశారు. 2వ రోజు సోమవారం సాయంత్రం కార్మికులను కలుసుకుందాం, సమస్యలు తెలుసుకుందాం కార్యక్రమంలో భాగంగా మణుగూరు డిపోకు విచ్చేసిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష వీరాంజనేయులు, రీజనల్ అధ్యక్ష కార్యదర్శి బాణాల రాంబాబు పిట్టల సుధాకర్ మాట్లాడారు. డిపో కార్యదర్శి కె.వి.రామారావు అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ తరపున యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన విధానాన్ని, కార్మికులకు వీరాంజనేయులు, తెలియజేశారు. ఖమ్మం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంబాబు పిట్టల సుధాకర్ మాట్లాడారు. 16 జాతీయ సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ మణుగూరు డిపో నాయకులు తాటి సుధాకర్, ఎస్.రమాదేవి బి.శివపార్వతి, ఎన్.కృష్ణవేణి, రామిశెట్టి నాగరాజు, వై నారిసింహరావు ఎస్.కె.సలీం, రామకృష్ణ, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత

- ఓటరు జాబితా పరిశీలకురాలు బాల మాయాదేవి

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, ఆరోగ్యవంతమైన ఓటర్ జాబితా తయారు చేయాలని ఓటరు జాబితా పరిశీలకురాలు, సీనియర్ ఐఏఎస్ అధికారి బాల మాయాదేవి తెలిపారు. మంగళవారం ఐడీఓసీ సమావేశపు హాలులో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం, తుది ఓటరు జాబితా ప్రకటన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫారం క్లైయిమ్స్‌ను పరిశీలించారు. తొలగింపుల జాబితా, చేర్పుల జాబితా సిద్ధం చేయాలన్నారు. యువత ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. 08-02-2024 లోక్ సభ ఎన్నికల ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నందున ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, మరణించిన ఓటరును తొలగింపుకు వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరూ ఓటు హక్కు కలిగి ఉండాలని చెప్పారు. తుది జాబితా విడుదల చేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పనపై నియోజకవర్గ వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి బుధవారం సమావేశం నిర్వహించాలని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతిక్ జైన్, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, కొత్తగూడెం ఆర్డీవో శిరీష, ప్రత్యేక ఉప కలెక్టర్ కాశయ్య, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, నియోజకవర్గ కేంద్ర తహసీల్దారులు, తదితరులు పాల్గొన్నారు.



పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యేకు చిరు వ్యాపారస్తులు వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని పట్టణ చిరు వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి పట్టణ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఊరు అభివృద్ధికి తప్పకుండా ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులతో మాట్లాడి వ్యాపారులకు అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కొత్తగూడెంలో వ్యాపారస్తులు ఈ విధముగా ఊరు ప్రయోజనాల కోసం, చిరు వ్యాపారస్తుల ప్రయోజనాల కోసం ప్రప్రధముగా పాల్గొనటం ఇదే తొలిసారని చెప్పారు. కలెక్టర్, ఇరత ప్రభుత్వ అధికారులు, సింగరేణి అధికారులతో మాట్లాడి తప్పకుండా కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి ఏర్పాట్లు చేస్తానన్నారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు పట్టణ అభివృద్ధికి అనువైన పలు సూచనలు, సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మొరిశెట్టి భవాని ప్రసాద్, కో-కన్వీనర్ పల్లపోతు శ్రీనివాస్, ట్రెజరర్ హన్స్ రాజ్ జకోటియా, మహమ్మద్ అబిద్ హుస్సేన్, ముక్కా మధుసూదన్ రావు, అనూప్ ఖండేల్వాల్, మనీష్ కుమార్ అగర్వాల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తోలకాలకు అడ్డుకట్ట

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని గంగోలు గోదావరి నది నుండి నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ ఇసుక తోలకాలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. కొంతమంది ఇసుక తోడేళ్లు గోదావరి మార్గం గుండా ర్యాంపు ఏర్పాటు చేసుకొని ఇటీవల రాత్రిపూట యథేచ్చగా అక్రమ ఇసుక తోలకాలు సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు మంగళవారం గోదావరి ప్రాంతానికి వెళ్లి ర్యాంపుకు వెళ్లే మార్గాన్ని ట్రెంచ్ కొట్టి తోలకాలకు అడ్డుకట్టు వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుండి ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు

- వారం పాటు నిర్వహణ

అశ్వారావుపేట గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ విభాగం ఆధ్వర్యంలో 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు గానూ బుధవారం పంచాయతీ కేంద్రంలో గ్రామ సభలు నిర్వహిస్తారు. ఇందులో ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, రాజకీయ ప్రముఖులు, గ్రామపెద్దలు, స్వచ్చంద సేవా సంస్థలు, స్వయం సేవక్ సంఘాలు, మహిళా పొదుపు సంఘాలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారు. మిగతా ఆరు రోజులు రోజువారి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజల్లో అవగాహణ కల్పిస్తారు. యావన్మంది ప్రజలు పాల్గొని ఈ ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ హరిక్రిష్ణ తెలిపారు.

బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలి : ఎస్పీ

- ఘనంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం



పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. హేమ చంద్రాపురంలోని జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో గత 15 రోజుల పాటు సాగిన జిల్లా ఆర్మడ్ రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ కార్యక్రమాలు ముగిశాయి. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో జిల్లా పాల్గొన్నారు. ముందుగా జిల్లా ఆర్మడ్ సిబ్బంది నుండి ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. 5 ప్లటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పరేడ్‌నకు అడ్మిన్ ఆర్ఐ రవి ప్లటూన్ కమాండెర్‌గా వ్యవహరించారు. పదిహేను రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇండోర్, ఔట్డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్‌లలో సిబ్బంది అంతా ఉత్సాహంగా పాల్గొన్నారని ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ మట్లాడారు. ఈ మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని అన్నారు. డీ-మొబిలైజేషన్ పరేడ్ కార్యక్రమాన్ని సుందరంగా ఏర్పాటు చేసిన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, ఎస్పీ సీఐ నాగరాజు, అడ్మిన్ ఆర్ఐ రవి, హెూంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడారంలో దానధర్మ ట్రస్ట్ వితరణ

నవతెలంగాణ-మణుగూరు

దానధర్మ ట్రస్ట్ చైర్‌పర్సన్ గంటా రాధా ఆధ్వర్యంలో తెలంగాణ కుంభమేళ మేడారంలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఆకలితో అలమటించే వారికి బిచ్చగాళ్లకు మంచినీళ్ల, భోజనం, దుప్పట్లు పంపించినట్లు రాధా తెలిపారు. మేడారం సమ్మక్క సారలమ్మ, పూజారి రమేష్, దేవాలయ ఈఓ సహకరించారని తెలిపారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ ఆర్థికంగా సహకరించిన దాతలకు, ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దుకాణాల్లో ఏకకాలంలో ఆకస్మిక సోదాలు

అశ్వారావుపేట : నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట పట్టణంలో పలు దుకాణాల్లో స్థానిక పోలీసు బృందాలు ఆకస్మిక సోదాలు జరిపి, విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మంగళవారం రాత్రి స్థానిక సీఐ కరుణాకర్, ఎస్‌హెచ్‌ఓ ఎస్.ఐ శ్రీకాంత్, ఎస్ఐ శివరామ్ క్రిష్ణలు నేతృత్వంలో మూడు బృందాలుగా ఏర్పడి అశ్వారావుపేటలోని ప్రధాన కూడళ్ల లో గల పాన్, కిరణా, ఫ్యాన్సీ దుకాణాల్లో ఈ తనిఖీలు జరిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా ఏక కాలంలో తనిఖీలు చేసి ఆయా దుకాణాల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు చేస్తున్నారా అనే విషయాలు రాబట్టడానికి చేసినట్లు సీఐ తెలిపారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి మాదక ద్రవ్వాలు లభించలేదని ఆయన అన్నారు.

బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

లక్ష్మీదేవి పల్లి : మండలం హమాలీ కాలనీలో నివాసం ఉండే కారింగుల రాజు (33) ఆటో నడుపుతూ జీవనం సాగించే వాడు, ఇటీవల పని ఒత్తిడి వలన గుండె పోటు వచ్చి హఠాన్మరణం చెందారు. అతని భార్య ఉష (28) భర్త మరణంతో ఇద్దరు ఆడపిల్లలని పట్టుకుని ఎలా బతకాలనీ గుండె బాదుకుంది. వీరికి ఇద్దరు కూతుర్లు వర్షిత (11), హరిణి (9)లు ఉన్నారు. తండ్రి మరణంతో పిల్లల భవిష్యత్ ఆగమ్య గోచరం అవుతుందని విషయం మిత్రుల ద్వారా" బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్" వ్యవస్థాపకులు పులి దేవేందర్ తెలుసుకుని పిల్లల చదువుల నిమిత్తం రూ.10వేలు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్‌లోని మిత్రుల ద్వారా డొనేషన్స్ సేకరించి మంగళవారం ఫౌండేషన్ సభ్యులు రాజు నివాసానికి వెళ్లి పిల్లలకు వారి కుటుంబ సభ్యులకు ఈ సహాయాన్ని అందజేశారు. ఫౌండర్ పులి దేవేందర్ మాట్లాడుతూ గతంలో ఈ ఫౌండేషన్ ద్వారా నిరుపేద పిల్లలు విద్య ఉద్యోగాల కోసం డొనేషన్ చేశాం అని, భవిష్యత్‌లో అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చెలకపల్లి శివ, రాజేష్, పుప్పాల సంతోష్, రమేష్, రాజు, కరుణ శ్రీ, రవి చంద్రలతో పాటు రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించి సహకరించండి

చంద్రుగొండ : వ్యవసాయ పంట రుణాలు తీసుకున్న తేదీ నుంచి సంవత్సరంలోపు తిరిగి చెల్లించితే కేంద్ర ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీకి అర్హత పొందుతారని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ ఏ.వెంకట రవికుమార్ సూచించారు. మంగళవారం స్థానిక బ్యాంకులో ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ బ్యాంకు స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు 28 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా చేయాలని కోరారు. ఈ పథకాలు కుటుంబాలకు అండగా నిలుస్తాయి అన్నారు. ఎస్బిఐ జనరల్ ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ బ్యాంకులో కట్టుకునే అవకాశం ఉందన్నారు. బ్యాంకు సహకారం తీసుకొని మీరు అభివృద్ధి చెంది బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

స్థానిక పంటలను పరిశీలించిన విద్యార్థులు

అశ్వారావుపేట : అంతర్ కళాశాలల క్రీడల్లో పాల్గొనడానికి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు వచ్చిన విశ్వవిద్యాలయంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఒక పక్క క్రీడల్లో పాల్గొంటూ నే మరో పక్క ఇక్కడ కళాశాలలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న పంటలు సాగు పద్ధతులను, యాజమాన్యం విధానాలను అవగాహన చేసుకుంటున్నారు. ఈ కళాశాలలో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ ద్వారా పంట వివరాలు సేకరిస్తూ, సాగులో మెలుకువలు, పంట కాలం, ఎరువులు వాడకం మొదలగు వాటిని నమోదు చేసుకుంటున్నారు.

బజాజ్ షోరూం నిర్వాహకుల జులూం

- నిరసనకు దిగిన ద్విచక్ర వాహన వినియోగదారుడు

లక్ష్మీదేవి పల్లి : బండి కొన్న ఆనందం కూడ లేకుండా 3 ఏళ్లలో 17 సార్లు తన బైక్ రిపేర్‌ల కోసం బైక్ షోరూం చుట్టూ తిరుగుతూ విసుగు చెంది కొత్తగూడెంలోని బజాజ్ షోరూం ముందు ఓ ద్విచక్ర వాహన దారుడు నిరసనకు దిగాడు. బండి కొన్నది మొదలు పదే పదే రిపేర్‌లకు వస్తున్నట్టు, ఇదేంటని అడిగితే షోరూం నిర్వాహకులు దిక్కున్న చోట చెప్పుకోమని అంటున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వరావుపేటకు చెందిన యువకుడికి న్యాయం జరుగుతుందో లేదో తెలియదు కానీ కొత్తగూడెం బజాజ్ షోరూం నిర్వాహకుల తీరుపై సర్వతా విమర్శలు వినిపిస్తున్నాయి.

5 పంచాయతీలను తెలంగాణలో కలపాలి



- మంత్రి తుమ్మలకు వినతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం సొసైటీ ద్వారా తీసుకున్న రైతు రుణాలను మాఫీ చేయాలని రెండు రాష్ట్రాల విభజన వలన రెండు ప్రభుత్వాలు ఈ రుణాలు మాఫీ చేయలేదని పంటల నష్టం, గోదావరి వరదల కారణంగా రైతులు నష్టపోయారని కావున రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రుణాలు మాఫీ చేయాలని ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాలని, ఇతర సమస్యల మీద మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో ఎస్ఏ రసూల్, కిలారి వెంకటేశ్వరరావు, ఏలూరు వెంకటేశ్వరరావు, రావి మాధవరావు, డా.నానుపల్లి సత్యం, దుద్దుకూరి సాయిబాబా, బండారు శరత్ బాబు, చెన్ను బోయిన వెంకటేశ్వర్లు, ఎస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చాక్లెట్లు కొంటున్నారా.. ఒకసారి చెక్ చేసుకోండి..!



- సీఐ శివ ప్రసాద్

నవతెలంగాణ-పినపాక

కిరాణా షాపుల్లో చాక్లెట్లు కొంటున్నారా మనం తినే చాక్లెట్లేనా లేక మత్తెక్కించే గంజాయి చాక్లెట్లా చూసుకోవాలని సిఐ శివప్రసాద్ సూచించారు. మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం పినపాక మండలం ఈ బయ్యారంలో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దుకాణాల తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లో అమ్మే చాక్లెట్లను పరిశీలించారు. గంజాయి చాక్లెట్లను విక్రయిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. యువతను లక్ష్యంగా చేసుకొని ఈ దందా కొనసాగించేందుకు అక్రమార్కులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. కానీ వారి ప్రయత్నాలను పోలీస్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ చిత్తు చేస్తున్నారన్నారు. అయితే యువతతో పాటు వారి తల్లిదండ్రులు ఈ గంజాయి చాక్లెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత, చిన్నపిల్లలు తెలియకుండా ఈ చాక్లెట్లు కొనుగోలు చేసి తింటే వాటికి బానిసలై భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనన్నారు. గంజా చాక్లెట్లను దుకాణాల్లో విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీస్ అందజేత



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాల అమలు కోసం ఈ నెల 16వ తారీకు జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేసి కార్మికుల ఐక్యతను చాటాలని సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం నాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కి కార్మిక సంఘాలతో కలిసి సమ్మె నోటీస్ ని అందించారు. ఈ సందర్భంగా ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ. కేంద్రంలో మోడీ సర్కార్ కార్మిక చట్టాలను కాలరాస్తుందని విమర్శించారు. అదేవిధంగా పదోవ తారీఖున అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి, సిఐటియు నాయకులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు రాయల రాములు, శ్రీను, రవి, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాలు

నవతెలంగాణ - బోనకల్

కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాలు ఫిబ్రవరి 11, 12 తేదీలలో ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా నాయకులు కర్లకుంట నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ లో ఈనెల 11న సాయంత్రం 5 గంటలకు 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సెమినార్ లో ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ సి.కాశీం హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. వక్తలుగా కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి. స్కైలాబ్ బాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు మాచర్ల భారతి లు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు మంద సత్యానందం, సీనియర్ నాయకులు ఏసుపోగు బాబు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో 'నయన శ్రీ'కి రెండు బంగారు పతకాలు



నవతెలంగాణ - బోనకల్


మండల పరిధిలోని మోటమర్రి గ్రామానికి చెందిన తాళ్లూరి నయన శ్రీ అండర్ - 17 విభాగంలో జాతీయస్థాయిలో జరిగిన ఐస్ స్పీడ్ స్కేటింగ్ లో రెండు బంగారు పతకాలను సాధించి గ్రామాన్ని క్రీడా పటంలో అగ్ర భాగాన నిలిపింది. జాతీయస్థాయిలో నాలుగవ శీతాకాల ఖేలో ఇండియా అండర్ -17 విభాగంలో ఐస్ స్పీడ్ స్కేటింగ్ పోటీలు జమ్మూకాశ్మీర్ లోనే లేహ్ లద్దాక్ లో ఈ నెల నాలుగో తేదీ నుంచి ఆరవ తేదీ వరకు జరగనున్నాయి. 300 మీటర్ల, 500 మీటర్ల విభాగంలో రెండు గోల్డ్ పతకాలను నయన శ్రీ సాధించింది. ఈ పోటీలలో 16 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఐఓఏ ఈసీ మెంబర్, ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ అమితాబ్ శర్మ నయన శ్రీ కి రెండు బంగారు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు స్కేటింగ్ అధికారులు, అనధికారులు నయన శ్రీ ని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

బీమా నగదు అందజేత

నవతెలంగాణ-ఎర్రుపాలెం

అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు బీమా నగదును పెద్ద గోపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు శీలం అక్కిరెడ్డి అందించారు. మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన సంఘ సభ్యులు యరమల రమణ రెడ్డి మృతి చెందటంతో నామిని అయినా మృతుడి భార్య శంకరమ్మకి రూ.50 వేల రూపాయల భీమా నగదును మండల కేంద్ర మైన ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంకు నందు అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మగినం వీరభద్రం, అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, సూప ర్వైజర్ మహేష్, క్యాషియర్ భానుప్రియ, సీఈవో వీరా రెడ్డి, సొసైటీ సిబ్బంది బ్యాంక్ సిబ్బంది,లబ్ధిదారులు, పాల్గొన్నారు.

16న గ్రామీణ బందును విజయవంతం చేయండి



నవతెలంగాణ-ములకలపల్లి

16న గ్రామీణ భారత్ బందును విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి (సీఐటీయూ) దుబ్బాక ధనలక్ష్మి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మంగపేట పీహెచ్‌సి వైద్య అధికారి సాయి కళ్యాణ్‌కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్ లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కీసరి జయ, కొల్లూరి పద్మ, నల్లి సుజాత, జ్యోతి, నాగమణి, ఎస్ లక్ష్మి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు శిక్ష

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

చెల్లని చెక్కుకేసులో నిందితుడైన అవుల మోహన్ రెడ్డికి ఖమ్మం మొదటి అదనపు శ్రేణి న్యాయస్థాన న్యాయాధికారి కాసరగడ్డ దీప 6 నెలలు జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి 20 లక్షల రూపాయల నష్టపరిహారం కింద చెల్లించాలని మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు రఘునాథపాలెంనకు చెందిన ఫిర్యాది జాలాది క్రిష్ణ వద్ద నిందితుడు తన కుటుంబ అవసర నిమిత్తం 15-3-2013 రూ.15 లక్షలను అప్పుగా తీసుకోని అదే రోజు ప్రాంసరి నోటు రాసి ఇచ్చినాడు. ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తడి చేయగా 15-4-2014 చెక్కును నిందుతుడు ఫిర్యాదికి జారీ చేశారు. ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమచేయగా నిందితుని బ్యాంక్ ఖాతాను మూసివేయిబడటం వల్ల ఆ చెక్క్ తిరస్కరణకు గురి అయినది. ఫిర్యాది తన న్యాయవాది ఆనంచిన్ని రామారావు ద్వారా లీగల్ నోటిస్ జారీ చేసి కోర్టు లో ప్రైవేట్ కేసు దాఖలు చేసినారు. కేసును విచారించిన న్యాయాధికారి నిందితుని పై నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తు తీర్పు చెప్పారు.

రేషన్ డీలర్ల ముసుగులో

అక్రమ వ్యాపారం

- ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు
- తూతు మంత్రంగా తనిఖీలు
- యూనియన్ పేరుతో సంబంధం లేని వ్యక్తి దందా

నవతెలంగాణ-వేంసూరు

రేషన్ డీలర్ల ముసుగులో అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారి వివరాలు గోప్యంగా ఉంచాల్సిన అధికారులు అక్రమాలకు పాల్పడుతున్న వారికి సమాచారం ఇస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కలెక్టర్‌ను కోరుతున్నారు. వేంసూర్ మండలంలో మొత్తం రేషన్ డీలర్లు 29 ఉండగా వీటిలో ఒకటి నోటిఫికేషన్ లేకుండానే నేరుగా డ్వాక్రా సంఘం పేరుతో నిబంధనలకు విరుద్ధంగా రేషన్ డీలర్లను నియమించారని, ఆ గ్రామ ప్రజలు జిల్లా



అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరిలో కొంతమంది రేషన్ డీలర్లు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉన్నట్లు చలామణి అవుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. డీలర్ కానీ వ్యక్తిని సంఘం నాయకుడిగా కొంతమంది డీలర్లు నియమించుకొని ఈ అక్రమ వ్యాపారాలకు నాయకుడిగా చలామణి అవుతున్న వ్యక్తి పలు కారణాలు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆ నాయకుడే ఒకరికి రేషన్ డీలర్ ఇప్పిస్తానని రూ.80వేల వరకు ఖర్చులు అవుతాయని చెప్పినట్లు గతంలో ప్రచారం జరిగింది. వివాదాస్పదంగా ఉన్న డీలర్లు రెన్యువల్ పెండింగ్లో ఉన్న వాటిని రెన్యువల్ చేసే విధంగా పైరవీలు నడుపుతున్నట్లు గత వారం రోజులుగా ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. కొంతమంది డీలర్లు కొత్తగా నియమించిన డీలర్లకు ఇవ్వవలసిన ఇండెంట్ను తగ్గించి సీనియర్లకు ఎక్కువ ఇస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో స్థానికంగా లేని వ్యక్తుల పేరుతో రేషన్ షాపులు నడుస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్న అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించటం పట్ల మండల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేస్తాం : సివిల్ సప్లై డీటీ సత్యనారాయణను

డీటీని నవతెలంగాణ వివరణ కోరగా స్థానికంగా లేని డీలర్లు ఎవరైనా ఉంటే విచారించి మెమో ఇస్తామని, బైబర్గేషన్ చేసే క్రమంలో తప్పులు ఉండటం మూలంగా కొంతమంది డీలర్లకు ఇండెంట్ తక్కువగా వస్తున్నదని, త్వరలో సవరణ చేస్తామని అన్నారు.

సీఐ అశోక్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.అశోక్‌ను కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రేణులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. అసాంఘిక కార్యక్రమాలు కట్టడి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లంక శ్రీనివాస రావు (అబ్బులు) మరియు భద్రాచల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మహబూబాద్ పార్లమెంట్ ఆశా వాహి కుంజ శ్రీనివాస్ ఉన్నారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ట్రైనీ ఐపీఎస్ అధికారులు

నవతెలంగాణ- దుమ్ముగూడెం

పర్ణశాల రామయ్యను మంగళవారం ట్రైనీ ఐపీఎస్ అధికారులు దర్శించుకున్నారు. అనంతరం సీత కుటీర ప్రదేశంతో పాటు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారచేర ప్రాంతాన్ని సందర్శించి పర్ణశాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీఐ బొడ్డు అశోక్ ఎస్సై గణేష్ కానిస్టేబుల్స్ రాజేష్, నరేష్ పథ్వీ పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు



నవతెలంగాణ -దుమ్ముగూడెం

దుమ్ముగూడెం శ్రీ ఆత్మ రామచంద్ర స్వామి వారి ఆలయంలో భద్రాచల రామయ్య కళ్యాణం కోసం మంగళవారం గోటి తలంబ్రాలు ఒలిచే కార్యక్రమం లాంఛనంగా చేపట్టారు. సీతారాముల కల్యాణానికి సమర్పించేందుకు తయారు చేస్తున్నారు. ధర్మ జాగరణ సంస్థ జిల్లా సహప్రముక్ ఎంవి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ పుచ్ టైమర్ ప్రవీణి, కె త్రినాధరెడ్డి పాల్గొన్నారు.

పాట్టకూటి కోసం కూలీలు వాహనాల్లో వలసలు

- ప్రమాదపుటంచున ప్రయాణం గ్రామాలలో ఉపాధి కరువు -
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-బోనకల్

ప్రమాదం అని తెలిసి కూడా పొట్టకూటి కోసం కూలీలు వాహనాలలో ఆంధ్రప్రదేశ్ లోనే పలు గ్రామాలకు వెళుతున్నారు. గ్రామాలలో ఉపాధి కరువు కావడంతో వాహనాలలో పరిమితికి మించి కూలీలు ప్రయాణం చేస్తున్నారు. అధికారులు మాత్రం కూలీలకు ఉపాధి కల్పించడంపై దృష్టి సారించడం లేదు. మధిర, ఎర్రుపాలెం, చింతకాని, బోనకల్ మండలాల పరిధిలోనే అనేక గ్రామాలకు చెందిన వ్యవసాయ కార్మికులు ట్రాక్టర్లు, ఆటోలు, టాటా ఏసీలు, డీసీఎంలలో ఆంధ్ర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ఈ మండలాల్లో వ్యవసాయ పనులు దాదాపు పూర్తికావడంతో పాటు ఉపాధి హామీ పనులను అధికారులు కల్పించడం లేదు. దీంతో పొట్టకూటికోసం చింతకాని మండలం పాతర్లపాడు, నాగులవంచ, చింతకాని, కోడుమూరు బోనకల్ మండలం నుంచి చిరునోముల, చొప్పకట్లపాలెం, బోనకల్, రావినూతల, నారాయణపురం, ముష్టికుంట్ల తదితర గ్రామాల నుంచి ప్రతి రోజు వందల సంఖ్యలో ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలంలోని పలు గ్రామాలకు మిర్చి పనులకు 50 కిలోమీటర్ల దూరం వరకు వెళుతున్నారు. రోజు కూలి రూ.300 చెల్లిస్తున్నారు. ఒక వాహనంలో 20 నుంచి 30 మంది కూలీలు వెళ్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే బస్తాలో పత్తిని, మిర్చిని ఎలా కుక్కుతారో ఆయా వాహనాలలో



కూలీలను ఆ విధంగా కుక్కి, నిలబడటానికి కూడా చోటు లేని విధంగా తీసుకెళ్తున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కూలీల ప్రాణాలు గాలిలో కలిసినట్లే. రైతులే ఆయా గ్రామాలలో కూలీల కోసం వాహనాలను పంపిస్తారు. ఒక్కొక్క సందర్భంలో వాహనాలకు డ్రైవర్ల దొరకకపోవటంతో లైసెన్స్ లేని డ్రైవర్ల ను కూడా పంపిస్తున్నారు. రెండు రోజుల క్రితమే రావినూతల గ్రామానికి చెందిన 17 మంది కూలీలు ట్రాక్టర్లు ముదిగొండ మండలం బాణాపురం మిర్చి పనులకు వెళ్లి తిరిగి వస్తూ బోనకల్ ఆర్వోబి బ్రిడ్జి పై ప్రమాదానికి గురై 17 మంది తీవ్ర గాయాలు పాలైన సంగతి విధితమే. ప్రమాద సమయంలో ఆర్‌ఓబి బ్రిడ్జికి కంటే గోడ లేకపోతే కూలీలందరూ బ్రిడ్జి నుంచి సుమారు 20 మీటర్ల కిందపడేవారు. తృటిలో ప్రాణాల నుంచి బయటపడ్డారు. కూలీలను తొందరగా తీసుకెళ్లాలని, మరల తొందరగా ఇంటికి తీసుకురావాలని ఉద్దేశంతో డ్రైవర్లు అతివేగంగా బోనకల్ బ్రాంచ్ కెనాల్ మీదుగా వెళుతున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే వారందరూ కెనాల్ లో ప్రమాదానికి గురికావాల్సిందే. ఇప్పటికైనా ఆయా మండల అధికారులు, ఆయా గ్రామాలలో కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పేదల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండల వ్యాప్తంగా పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌కు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి బెల్లం లక్ష్మీ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మండల వ్యాప్తంగా పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఐద్వా మండల నాయకులు బలుసు ప్రమీల, మున్నంగి లక్ష్మి, కొప్పుల జానకి, విజయ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విశిష్ట సేవల నాగేశ్వరరావుకు పురస్కారం

- గంటా నాగేశ్వరరావు అవార్డుల ప్రదానం

నవతెలంగాణ-ముదిగొండ

హైదరాబాదులోని ఆర్టీసీ క్రాస్ రోడ్ సిటీ కల్చర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన అక్షయ హెల్పింగ్ చేయూత వ్యవస్థాపధ్యక్షులు సామాజిక కార్యకర్త, 45 సార్లు రక్తదానం చేసిన ప్రధాత గంట నాగేశ్వరరావుకు మంగళవారం గౌరవ ప్రైడ్ ఆఫ్, భారత్ నేషనల్ అవార్డుతోపాటు, మెడల్ ను స్వార్డి సర్వీసెస్ సొసైటీ ఎన్జీవో చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆకుల రమేష్ మాట్లాడుతూ గత నాలుగైదు సంవత్సరాల నుండి. గర్భిణీలు, వికలాంగులకు, ఉచిత ఆటో సర్వీసు చేస్తూ సోషల్ యాక్టివేట్ ప్రోగ్రాంలో పాల్గొంటూ, పేషెంట్లకు తన వంతు సహాయంగా 45 సార్లు రక్తదానం చేశారన్నారు. తన వంతు సమాజానికి సహాయ సహకారాలు అందిస్తున్న గంట నాగేశ్వరావు సేవలను గుర్తించిన ప్రైడ్ ఆఫ్ భారత్ నేషనల్ అవార్డు ప్రదానం చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా అక్షయ హెల్పింగ్ చేయూత వ్యవస్థాపకధ్యక్షులు గంట నాగేశ్వరరావు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల సామాజిక సేవలో భాగంగా సమాజానికి వివిధ స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేస్తున్నందుకుగాను, అవార్డు అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాదయ్యగౌడ్, గంజి నరసింహారావు, బెల్లం భరత్, డాక్టర్ ఆర్ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- ఎంపీఓ శ్రీనివాసరావు

నవతెలంగాణ - అళ్ళపల్లి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, కలెక్టర్ ప్రియాంక అలా, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 7 నుండి 14వ తేదీ వరకు అన్ని మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించుటకు రోజువారి షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని స్థానిక ఎంపీఓ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. 7న అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించాలన్నారు. 8న యువత మహిళలు గ్రామస్తులు గ్రామ పెద్దలు అందరితోటి గ్రామపంచాయతీలో శ్రమదానం నిర్వహించాలని తెలిపారు. 9న గ్రామపంచాయతీ లోని డంపింగ్ షెడ్లు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, తదితర గ్రామపంచాయతీలలో గల అన్ని ప్రదేశాలలో గ్రామపంచాయతీ సిబ్బందితో చెత్తను తొలగించి శుభ్ర పరచాలని చెప్పారు. 10న గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న గడ్డి, చెత్తాచెదారం తొలగించాలని అన్నారు. 11న గ్రామపంచాయతీలో గల వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలి అదేవిధంగా ఎక్కడైనా పైప్ లైన్ లీకేజెస్ ఉంటే వాటిని సరి చేయించాలని అన్నారు. 12న మురికి గుంటలు శుభ్రపరచాలని, చెత్త ఎక్కడ రోడ్లమీద పడేయకుండా, ఉండకుండా అందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. 13న పాఠశాల పిల్లలకు దేవాలయాల దగ్గర గల షాపులు హెూటలలో వారికి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. 14న గ్రామంలోని యువతకు, మహిళలకు తెలంగాణ క్రీడా ప్రాంగణంలో క్రీడలు నిర్వహించాలి. అదేవిధంగా వాళ్లకి మత్తు పదార్థాలు గుట్కాలు పాన్ పరాకులు గంజాయి మొదలగు చెడు వ్యసనాలకు పాల్పడకూడదనీ అవగాహన కలిగించాలని అన్నారు. ఈ పారిశుధ్య పనుల కార్యక్రమాలు అన్నీ కూడా ఎనిమిది రోజులు షెడ్యూల్ వారీగా నిర్వహించాలి. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలందరినీ కూడా ఇన్వాల్వ్ చేసి అదే విధంగా రోజు వారి షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీలకు, ఎంపీపీలకు, జడ్పీ చైర్మన్ ను స్థానిక సభ్యులు, అందరు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనే విధంగా వారికి ఆహ్వానం అందించి 8 రోజుల ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. అదేవిధంగా స్పెషల్ శానిటేషన్ డే కొరకు ఫ్లెక్సీలు ప్రింట్ చేయించి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ 8 రోజుల శానిటేషన్ డ్రైవ్ లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడబ్ల్యులకు ఎవరికీ ఎటువంటిసెలవులు 14వ తేదీ వరకు ఇవ్వబడవని పేర్కొన్నారు.



విద్యుత్ రీడర్స్‌పై మోయలేని భారం

- 'గృహలక్ష్మి' సర్వేపై ఇబ్బందులు..!

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ ఈఆర్ఓ పరిధిలో సుమారు 44, 170 విద్యుత్ సర్వీసులు ఉన్నాయని, బిల్ రీడర్స్ 9 మంది ఉన్నారని, ప్రస్తుతం చేస్తున్న పనే మోయలేని భారంగా ఉందని, కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకంలో వినియోగదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్, అనుసంధానం చేసే ప్రక్రియను తమపై మోపడం సహేతుకమని రీడర్స్ వాపోయారు. విద్యుత్ శాఖ వారు ఇచ్చిన సమయంలోపే వారికి ఇచ్చిన సర్వీసులను రీడింగ్ చేయాల్సి ఉండగా ఇప్పుడు పెట్టిన కొత్త పథకంతో అధిక సమయం వృథా అవుతుందని, కొత్త పథకాన్ని సంబంధించిన ప్రక్రియకు మీటర్ రీడర్స్ ఎటువంటి, పారితోషకం ప్రకటించకపోవడంతో పని భారాన్ని మోయలేమని తమ బాధలు వెల్లడించారు. ప్రతి సర్వీస్కు 20 నిమిషాల సమయం పడుతుందని తమకు కేటాయించిన సర్వీసులు నెల రోజులైనా పూర్తయ్యే అవకాశం లేదన్నారు, తమ విద్యార్హతలను , సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పనికి తగిన వేతనం అందించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మద్యం సిండికేట్



మండలంలో మద్యం దుకాణం లేకపోయినా జోరుగా విక్రయాలు

- అధికారుల అండదండలతోనే వ్యాపారం..?
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు..!

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

సిండికేట్ ఆధ్వర్యంలో మద్యం దందా.. కాదు.. కాదు.. అధికారుల కనుసన్నల్లో నడుస్తున్న ఆఫీషియల్ లిక్కర్ వ్యాపారం. కొంతమంది అధికారులు, రాజకీయ నాయకుల అండదండ చూసుకుని మండలంలో వైన్ షాపు లేకుండా, కొత్తగూడెంలో ఉన్నటువంటి వైన్ షాప్ నిర్వాహకులు సిండికేట్ అయ్యారు. రేగళ్ల మెయిన్ రోడ్డులో సిండికేట్‌గా సబ్ సెంటర్ చేశారు. వైన్ షాపులో దొరికే మందుపై ఏజెన్సీలోని బెల్ట్ షాపు వ్యాపారులకు క్వార్టర్‌కి ఎంఆర్పీ పైన రూ.20లు పెంచి మద్యాన్ని దర్జాగా విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ వారికి కావాల్సినంత సరుకును ఎప్పుడు పడితే అప్పుడు అవసరమైతే బెల్ట్ షాపుల దాక ఆటోల్లో వెళ్లి మరి మద్యం రవాణా చేస్తున్నారు. ఇక వైన్ షాపులపై నిత్యం నిఘా ఉంచాల్సిన ఎక్సైజ్ అధికారులు నిద్రపోతున్నారు. సిండికేట్ వ్యాపారులు అధికారులతో ఒక ఒప్పందానికి వచ్చి మద్యాన్ని బెల్ట్ షాపులకు ఎప్పుడు కావాలంటే అప్పుడు తరలిస్తున్నారు. శాఖ అధికారులు చూసిచూడనట్లు ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. పైగా గట్టిగా నిలదీసిన వారిపై మద్యం సిండికేట్ వ్యాపారులు దాడులకు కూడా వెనుకాడటం లేదు. ఇంత జరుగుతున్న అటు పోలీసు, ఇటు ఎక్సైజ్ అధికారులు స్పందించక పోవడం వెనుక మతలబ్ ఏంటో ఎవరికీ అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పోలీసు, ఎక్సైజ్ అధికారులు, నాయకులు వాటాదారులే ?

తమ సిండికేట్ వ్యాపారం సాఫీగా సాగాలంటే కొంతమంది అధికారుల సహకారం ఉండాలని నిర్ణయించుకున్న కేటుగాళ్ళు అటు పోలీసు, ఇటు ఎక్సైజ్ శాఖ ఉద్యోగులను, ఏకంగా రాజకీయ నాయకులను వాటాదారులుగా చేర్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందరు చేతిలో ఉండటంతో సిండికేట్ లో ధరలు ఏకంగా క్వార్టర్ కు రూ.20లకు పెంచేశారు. బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ మద్యం తరలిస్తున్నారు. వైన్ షాపులో అమ్మే ధరకన్నా బెల్ట్ షాపులో 40 రూపాయలు అధికంగా అమ్ముతున్నారని, ఇలా ప్రతి క్వాటర్ కు వైన్ షాపులో కన్నా దాదాపు బ్రాండ్ ను బట్టి 40 నుండి 50 రూపాయలు ఎక్కువకు అమ్ముతూ మందుబాబుల జేబులను గుల్ల చేస్తున్నారు.



ఎక్సైజ్ అధికారులు ఎక్కడ..?

వైన్ షాపులు అడుగడుగునా నిబంధనలు అతిక్రమించినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. పత్రికల్లో మద్యం దందాపై వార్తలు వచ్చినా.. బయటికొచ్చి తనిఖీలు చేసింది లేదు. మరీ జిల్లాలో ఎక్సైజ్ అధికారులు ఉన్నట్టా? లేనట్టా అనే అనుమానం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. భారీగా జీతాలు తీసుకుంటూ ఆఫీసు నుండి బయటకు వచ్చే ఆలోచనే లేదన్నట్టు వ్యవహరిస్తోన్న ఎక్సైజ్ అధికారులపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు ప్రజలు.

బెదిరిస్తున్న వ్యాపారులు

బెల్ట్ షాపుల వ్యాపారులు అధిక ధరల పేరుతో దోచుకుంటున్నారు. ధరలు ఎందుకు పెంచి అమ్ముతున్నారని ప్రశ్నిస్తే మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ బెదిరింపులకు దిగుతున్నారు. మీరు ఎవరికి ఫిర్యాదు చేసినా ఎవరూ చర్యలు తీసుకోరు, అంతా మా వాళ్లే అంటూ దర్జాగా బహిరంగగానే చెబుతున్నారు.



కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎంపీ వెంకటేష్ నేత

- ఏఐసీసీ చీఫ్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక
- హస్తం గూటికి టీటీడీ మాజీ సభ్యుడు మన్నె జీవన్ రెడ్డి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీఆర్ఎస్ పార్టీకి చెందిన పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొంతకాలంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ అనుసరిస్తున్న వైఖరితో తీవ్ర అసంతృప్తిగా ఉన్న వెంకటేష్ నేత ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, సీఎం ఏ. రేవంత్ రెడ్డి సమక్షంలో వెంకటేష్ నేత, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీటీడీ మాజీ సభ్యుడు మన్నె జీవన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కేసీ వేణుగోపాల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మన్నె జీవన్ రెడ్డితో పాటు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేత రహ్మాన్, పలువురు కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. చేరికల అనంతరం కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఎంపీ వెంకటేష్ నేత, మన్నె జీవన్ రెడ్డి, ఇతర నేతలు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకటేష్ నేత, మన్నె జీవన్ రెడ్డిలను సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ చీఫ్ ఖర్గేకు పరిచయం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ జి. చిన్నారెడ్డి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు ఎంపీ స్థానాల గెలుపునకు కృషి : మన్నె జీవన్ రెడ్డి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ నేత మన్నె జీవన్ రెడ్డి అన్నారు. పార్టీ తనపై విశ్వాసంతో ఏ బాధ్యత ఇచ్చినా శక్తి వంచన లేకుండా పని చేస్తానని చెప్పారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలకు చెందిన రెండు ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలిచేలా కృషి చేస్తానని తెలిపారు. తన బాబాయి, బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డితో చర్చించాకే కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో 17 స్థానాలకు 17 కాంగ్రెస్ గెలిచే అవకాశముందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ లేఖను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపించారు.

మేడారం జాతర నేపథ్యంలో.. మావోయిస్టుల లేఖ కలకలం

నవతెలంగాణ -తాడ్వాయి

మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల మహా జాతర అభివృద్ధి పనులలో నాణ్యత లోపాలను ఎత్తి చూపుతూ జాతర నిర్వహణ, అనంతరం తీసుకోవాల్సిన చర్యలను పేర్కొంటూ మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీ జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి ఏరియా కార్యదర్శి వెంకటేశ్ పేరిట సోమవారం విడుదలైన లేఖ కలకలం రేపింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం ప్రభుత్వం కేటాయించిన నిధుల దుర్వినియోగం అవుతోందని లేఖలో పేర్కొన్నారు. హడావుడిగా పనులు ప్రారంభించి నాణ్యత లేకుండా ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా చేస్తున్నారని పేర్కొన్నారు. వనదేవతల జాతరను ఆదివాసీ సంప్రదాయాలతోనే ఘనంగా నిర్వహించాలని, జాతరకు వచ్చే సందర్శకులకు లడ్డు, పులిహోర లాంటి ప్రసాదాలు అమ్మకుండా బెల్లాన్ని ప్రసాదంగా అందించాలని, జాతర సమయంలో పంట వేయకుండా నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వివరించారు. జాతర అనంతరం పరిసర ప్రాంతాలలో సందర్శకులు వదిలేసి వెళ్లిన వ్యర్థాలను తొలగించాలని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతకు తిలోదాకాలు ఇచ్చిన కాంట్రాక్టర్లు, అధికారులు, నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ లేఖలో పేర్కొన్నారు.

చిట్టీల పేరుతో రూ.20 కోట్ల మోసం

- మాదాపూర్‌లో సమతామూర్తి చిట్ ఫండ్ నిర్వాహకుల అరెస్ట్

నవతెలంగాణ-మియాపూర్

సమతామూర్తి చిట్ ఫండ్ పేరుతో రూ.20 కోట్లు వసూలు చేసి బాధితులను మోసగించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బయటపడింది. ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సమతామూర్తి చిట్ ఫండ్ పేరుతో ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మాదాపూర్ ప్రాంతాల్లో మూడు బ్రాంచ్‌లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో బాధితుల నుంచి సుమారు రూ.20 కోట్లు వసూలు చేశారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు స్పందించకపోవడంతో బాధితులు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తును పట్టించుకోకపోవడంతో బాధితులు మంగళవారం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతిని కలిసి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలు మేరకు కేసు విచారించిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే పూర్తి విచారణ అనంతరం మోసపోయిన బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ కేసుపై మాదాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం కోరగా సీఐతోపాటు ఇతర సిబ్బంది గోప్యత పాటించారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,000	▼	220
22 క్యారెట్లు	57,750	▼	200
కిలో వెండి	76,000	▼	700



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	111
రిటైల్ (లైవ్)	రూ.	133
స్కిన్‌తో	రూ.	193
స్కిన్‌లెస్	రూ.	219

వేతనాల్లేవ్..

ఆశాలు, అంగన్‌వాడీలకు అందని జీతాలు



2 నెలలుగా రూ.14కోట్లు పెండింగ్

- చేతులెత్తేస్తున్న జిల్లా అధికారులు
- రాష్ట్రం నుంచి రావాలని సమాధానం

గ్రామాల్లో అన్నీ తామై సేవలందిస్తున్న ఆశాలు, అంగన్‌వాడీల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. నెల జీతం వస్తే తప్పా పూట గడవని వీరికి రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. వేతనాలు కోసం జిల్లా అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో స్కీంవర్కర్లు నిరాశకు గురవుతున్నారు. ఒత్తిడి పెట్టి మరీ పనులు చేయిస్తున్న ప్రభుత్వం.. తమ వేతనాల విషయంపై మాత్రం చొరవ చూపడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రూ.14కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆశావర్కర్లు 2,100 మంది ఉన్నారు. అంగన్‌వాడీలు సుమారు 2,400 మంది, ఆయాలు మరో 2400 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశా లు ఎక్కువ దళిత, అట్టడుకు తరగతులకు చెందిన వారు. వీరికి నెల వేతనం వస్తే తప్పా కుటుంబం గడవని పరిస్థితి. అలాంటిది రెండు నెలలుగా వేతనాలు రావడం లేదు. అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం నెలసరి వేతనం రూ.13,500 చెల్లిస్తుండగా, ఆయాలకు రూ.8 వేలు చెల్లిస్తోంది.

ఆశావర్కర్లకు రూ.9,750 ఇస్తోంది. అయితే, డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటికీ చెల్లించలేదు. జిల్లా స్థాయి అధికారులను అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాలి.. తమ దగ్గర ఏమీ లేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆశావర్కర్లకు రెండు నెలలకు సంబంధించి సుమారు రూ.4 కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అంగన్‌వాడీ, ఆయాలకు సంబంధించి రూ.10 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.14కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

మా బతుకులు మారలే..

పరిపాలనలో ఏ ప్రభుత్వం ఉన్నా తమ బతుకుల్లో మార్పు కనిపించడం లేదని స్కీమ్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ నెలా సమయానికి వేతనం చెల్లించింది లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సకాలం లో వేతనాలు పడుతాయని ఆశించిన తమ ఆశలు అడియాశలు అయ్యేట్టున్నాయని వాపోయారు. ఇప్ప టికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో తమకు వేతనాలు చెల్లించి, ఆదుకోవాలని అంగన్‌వాడీ, ఆశావర్కర్లు కోరుతున్నారు.



మా గోస పట్టించుకోరా..

రెండు నెలలుగా వేతనాలు రాలేదు. అయినా విధులు నిర్వహి స్తున్నాం.. మా గోస ఎవరూ పట్టించు కోవడం లేదు. పనులు మాత్రం ఎక్కడా ఆగకుండా వెంటపడి చేయిస్తున్నారు. జిల్లా అధికారుల ను అడిగితే.. అటెండెన్స్ పంపినం వేతనాలు వస్తాయని చెబుతున్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలి.

సునీత, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి



సకాలంలో వేతనాలు చెల్లించాలి

స్కీమ్ వర్కర్లకు ఇచ్చే అరకొర వేతనాలు పెండింగ్ పెట్టి కార్మికులను ఇబ్బందులకు గురిచేయొద్దు. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలు, అంగన్‌వాడీల వేతనాలను సకాలంలో చెల్లించాలి. లేని పక్షంలో పెద్దఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

కవిత, సీఐటీయూ (ఆశా,అంగన్‌వాడీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు)

రాష్ట్ర కేంద్రం నుంచి రావాల్సి ఉంది

ప్రతి నెలా ఆశావర్కర్ల అటెండెన్స్ సకాలంలో రాష్ట్ర కేంద్రానికి పంపిస్తున్నాం. వేతనాల చెల్లింపు విషయం ప్రభుత్వం చూసుకుంటుంది. జిల్లా కేంద్రంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదు. రాష్ట్ర కేంద్రం నుంచే వేతనాలు రావాలి.

వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి

అనాథ పిల్లలను అక్కున చేర్చుకోవాలి

ఇది సామాజిక బాధ్యత : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రతి ఒక్కరూ అనాథ పిల్లలను అక్కున చేర్చుకోవాలని రవాణా శాఖ బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది అధికారుల బాధ్యత ఒకటే కాదు సామాజిక బాధ్యత కూడా అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చిల్డ్రన్ ఆఫ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పిల్లలకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, టీమ్ అంతా కలిసి 2700 మంది పిల్లలకు తక్కువ సమయంలో వివిధ రకాల సర్టిఫికెట్‌లు అందిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం తరపున శిశు విహార్ రక్షణగా నిలబడుతుందన్నారు. విద్య, ఉపాధితోపాటు.. భవిష్యత్‌లో సమాజంలో గుర్తింపు లేని వారికి ప్రభుత్వం గుర్తింపు ప్రామాణిక కార్డు ఇస్తుందన్నారు. స్వచ్ఛంద సంస్థ నుంచి ప్రామాణిక మైన గుర్తింపు కార్డు పొందుతున్నారని తెలిపారు. 50 కేంద్రాల్లో 2300 మంది విద్యార్థులు ఉన్నారని.. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఎవరూ అనాథలుగా, అభాగ్యులుగా రోడ్డు మీద ఉండకుండా ఈ సంస్థ మరిన్ని సేవలు అందించాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఎవరైనా అనాథలుగా ఉన్న పరిస్థితి ఉంటే స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైల్డ్ కేర్ దృష్టికి తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బృందానికి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల కళా రూపాలు, నృత్యాలు ఆకట్టుకున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైద రాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, ఇతర ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు, చిన్నారులు పాల్గొన్నారు.

స్టేట్ హోమ్ వద్ద శిశు విహార్ ఆయాల నిరసన

అకారణంగా తొలగించారని ఆవేదన

- సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం : సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఈశ్వరరావు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

శిశు సంక్షేమ శాఖ స్టేట్ హోమ్‌లో పని చేసే ఇద్దరు ఆయాలను అకారణంగా తొలగించారని, యూనియన్ నాయకురాలిని లోపలికి రానివ్వడం లేదని శిశు విహార్ ఆయాలు మంగళవారం నిరసనకు దిగారు. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్ వెంగళరావు నగర్ డివిజన్‌లో శిశు సంక్షేమ శాఖ స్టేట్ హోమ్‌లో ఇటీవల ఇద్దరు పిల్లలు కొట్లాడుకొని గాయపడ్డారు. అందుకు కారణం డ్యూటీలో ఉన్న ఇద్దరు ఆయాలని, వారిని విధుల నుంచి తొలగించి, ఇద్దరిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీగా ఉన్న సుజాతను శిశు విహార్ అధికారులు మంగళవారం లోపలకు రాకుండా అడ్డుకొని, ఆమెను కూడా డ్యూటీ నుంచి తొలగిస్తామని బెదిరించినట్టు తెలిసింది. దాంతో ఆమెకు మద్దతుగా సుమారు 50 మంది ఆయాలు విధులను బహిష్కరించి గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఈశ్వరరావు, హైదరాబాద్ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు స్టేట్ హోం వద్దకు చేరుకొని, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ సైదులుతో మాట్లాడారు. ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఈశ్వరరావు మాట్లాడుతూ.. అనాధ పిల్లలకు సొంత పిల్లల కంటే ఎక్కువగా ఆయాలు సేవలు చేస్తున్నారని, అలాంటి ఆయాలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని అన్నారు. లేని యెడల ఎన్ని రోజులైనా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతామని, ఆయాలకు సీఐటీయూ అండగా ఉంటుందని అన్నారు. ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ(సీతక్క)ను ఆయాలు కలిశారని, అప్పటి నుంచి వేధింపులు ఇంకా ఎక్కువయ్యాయని చెప్పారు. కొత్తగా వచ్చిన ప్రాజెక్టు డైరెక్టర్ అవగాహన లేకుండా సమస్యలు సృష్టిస్తున్నారని, ఆయాల సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన చేస్తామని అన్నారు. ఇప్పుడు ఆయాల నిరసన ఫలితంగా చిన్న పిల్లలకు ఏమైనా అయితే అధికారులు, ప్రాజెక్ట్ డైరెక్టర్ బాధ్యత వహించాలని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శిశు విహార్ ఆయాలు, సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు సాయి శేషగిరిరావు, అశోక్ పాల్గొన్నారు.



డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్ అరెస్ట్

- పంజాగుట్టలో రూ. 8 కోట్ల డ్రగ్స్ పట్టివేత

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ. 8 కోట్ల విలువైన హెరాయిన్, కొకైన్, తొమ్మిది ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పంజాగుట్ట వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ మంగళ వారం వివరాలు వెల్లడించారు. నైజీరియా దేశానికి చెందిన ఇవులా ఉకోడా స్టాన్లీ 2009 నవంబర్‌లో బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చాడు. ముంబయి లో అతని స్నేహితుడితో కలిసి రెడీమేడ్ దుస్తుల వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత బిజినెస్‌పై గోవాకు వెళ్లి కొందరు నైజీరియన్లతో పరిచయం చేసుకున్నాడు. అప్పటి నుంచే డ్రగ్స్ ఎలా సరఫరా చేయాలో అవగాహన పెంచుకున్నాడు. వాటి వల్ల ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చన్న ఉద్దేశంతో గోవాకు వచ్చే పర్యాటకులకు డ్రగ్స్ విక్రయించడం మొదలు పెట్టాడు. అలాగే, హైదరాబాద్‌కు డ్రగ్స్ సప్లై చేసే వాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం అతను హైదరాబాద్‌లో ఉన్నాడన్న సమాచారంతో ఎస్ఆర్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద నార్కోటిక్ పోలీసులు, పంజా గుట్ట పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుని నుంచి సుమారు 8 కోట్ల విలువైన మత్తు పదార్థాలతోపాటు 8 సెల్‌ఫోన్లు, రూ.5.40లక్షలు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు. స్టాన్లీకి వివిధ రాష్ట్రాలలో 500 మంది కస్టమర్లు ఉన్నారని, హైదరాబాద్‌లో ఏడుగురు కస్టమర్లకు డ్రగ్స్ సప్లై చేసేవాడని చెప్పారు. గతంలో ఎస్ఆర్ నగర్ డ్రగ్స్ కేసులో అరెస్టయిన నిందితుల ద్వారా స్టాన్లీ గురించి తెలుసుకుని నిఘా పెట్టినట్టు తెలిపారు. 2017లోనూ డ్రగ్స్ సప్లయ్ చేస్తుండగా ఎన్సీబీ పోలీసులు అరెస్టు చేశారు.

ఇది అప్రజాస్వామికం

- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- స్పష్టం చేసిన సీపీఐ (ఎం)
- కోవింద్ కమిటీతో భేటీ

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికల ప్రతిపాదనపై సీపీఐ (ఎం) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జమిలి ఎన్నికలపై ఇప్పటికే నిర్ణయం తీసుకొన్నారని, వాటిని ఎలా నిర్వహించాలనే విషయంపై మాత్రమే రాజకీయ పార్టీల అభిప్రాయాలు కోరుతున్నారని గుర్తు చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యుడు నీలోత్పల్ బసు, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు మురళీధరన్‌తో కూడిన సీపీఐ(ఎం) త్రిసభ్య ప్రతినిధి బృందం మంగళవారం ఉన్నత స్థాయి కమిటీతో సమావేశమైంది. జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఒకే దేశం...ఒకే ఎన్నికపై ఈ కమిటీ వివిధ పార్టీల అభిప్రాయాలు సేకరిస్తోంది. అందులో భాగంగా కమిటీ ఆహ్వానం మేరకు సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం దానితో సమావేశమైంది.పార్టీ అభిప్రాయాన్ని తెలియజేస్తూ సీపీఐ(ఎం) గత సంవత్సరం డిసెంబర్ ఏడవ తేదీన కమిటీకి సవివరమైన లేఖను అందజేసింది. ఈ నేపథ్యంలోనే పార్టీ నేతలు కమిటీతో సమావేశమై జమిలి ఎన్నికలపై తమ అభ్యంతరాలను పునరుద్ఘాటించారు. కోవింద్ నేతృత్వంలోని కమిటీ సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఆలకించింది. కమిటీ లేవనెత్తిన కొన్ని ప్రశ్నలకు నేతలు సమాధానం ఇచ్చారు. జమిలి ఎన్నికల అంశాన్ని పరిశీలించి, వాటి నిర్వహణ కోసం సిఫార్సు లు చేయడానికి మాత్రమే ఉన్నత స్థాయి కమిటీ పరిమితమైందన్న సంగతి స్పష్టమవుతోందని డిసెంబరులో రాసిన లేఖలోనే సీపీఐ(ఎం) గుర్తు చేసింది. కమిటీ ఎజెండాను, దాని లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించారని, ఫలితాన్ని కూడా ముందే నిర్ణయించారని అంటూ దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 2018 జూలై 4న లా కమిషన్‌కు సమర్పించిన నోట్‌లోనే పార్టీ అభి ప్రాయాన్ని తెలియజేశామని, దానికే కట్టుబడి ఉన్నామని తెలిపింది. జమిలి ఎన్నికల ప్రతిపాదన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ ప్రతి పాదన అప్రజాస్వామికమని, సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని తెలిపింది. జమిలి ఎన్నికల నిర్వహణ ఆచరణ సాధ్యం కాదని సీపీఐ (ఎం) అభిప్రాయ పడుతోంది. దీనిని పార్లమెంటరీ ప్రజాస్వామ్య మూలాలపై జరుగుతున్న దాడిగా అభివర్ణించింది. లోక్‌సభ లేదా రాష్ట్ర శాసనసభల పదవీకాలాన్ని పొడిగించేందుకు జరిపే ఏ ప్రయత్నమైనా రాజ్యాంగ విరుద్ధమని, అప్రజాస్వామికమని విమర్శించింది.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు పెట్టాలి

- 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- అసెంబ్లీలో ఫూలే విగ్రహంపై ఏప్రిల్ 11లోగా ప్రకటన చేయాలి : ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ - భగత్‌నగర్


రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారత జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగమాగంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. బీసీ హక్కుల సాధన కోసంకరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుపై ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 1931లో బ్రిటీష్ హయాంలో కులగణన జరిగిందన్నారు. యూపీఏ ప్రభుత్వం రూ.4500 కోట్లు ఖర్చు చేసి కులగణన చేపట్టినా సంబంధిత వివరాలను ప్రజల ముందు పెట్టలేదని చెప్పారు. బీహార్‌లో కులగణన చేసినా కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని, కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ కులగణన చేస్తామని హామీ ఇచ్చి చేయలేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా ముందడుగు వేయలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే కొత్తగా దాదాపు 24 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అవుతారని కాంగ్రెస్ పార్టీనే చెప్పిందని గుర్తు చేశారు. 6నెలల్లో కులగణన చేపట్టడానికి తక్షణమే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. అలాగే, బీసీల సంక్షేమ కోసం ప్రతి ఏటా రూ.20 వేల కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, 2024-25 బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని, ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అన్నారు. జనగామా జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణం చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి రాజేశంగౌడ్, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచందర్‌రావు, నాయకులు బొల్ల శివశంకర్, రాజారాం యాదవ్, గుంజపడుగు హరిప్రసాద్, వారాల శ్రీనివాస్, భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్, నాయకురాలు గందె కల్పన పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు ..ఇద్దరు మృతి

నవతెలంగాణ-పెద్దకొడప్ గల్

బైక్‌ను కారు బలంగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని 161వ జాతీయ రహదారిపై పోచారం గేటు వద్ద మంగళవారం ఉదయం జరిగింది. ఎస్ఐ కోనారెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన వెంకటేష్ సంబాజి బన్సుడే(25), వాగ్మరే నిఖిల్(20), సూర్యవంశీ సోంనాథ్ కలిసి మండలంలోని తలాబ్ తండాలో ఇంటి నిర్మాణం స్లాబ్ వేయడానికి బైక్‌పై బయలుదేరారు. జాతీయ రహదారి 161పై పోచారం గేటు వద్ద వీరు బైక్‌ను హైదరాబాద్ నుంచి దెగ్లూర్ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో బన్సుడే, నిఖిల్ అక్కడికక్కడే మృతిచెందారు. మోటర్ సైకిల్‌పై ఉన్న మరోవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తిని బిచ్కుంద ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ ఖమ్మం
మానవి
www.navatelangana.com
బుధవారం 7 ఫిబ్రవరి 2024



చర్చ జరుగుతోంది...

ముప్పై రెండేండ్ల పూనమ్ పాండే ఇటీవల గర్భాశయ క్యాన్సర్‌తో మరణించిందని వార్తలు వచ్చాయి. తర్వాత రోజే ఆమె 'నేను మరణించలేదు, క్యాన్సర్ ఎంత ప్రమాదకరమైనదో మహిళలకు, సమాజానికి అవగాహన కల్పించేందుకే ఈ ప్రకటన చేయించాను' అని ఆమె సమాధానం చెప్పింది. కానీ చాలా మంది దీన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. 'తన సొంత పబ్లిసిటీ కోసమే ఆమె ఇలాంటి దారుణమైన ప్రకటనలు చేసింది' అంటూ తిట్టిపోశారు. ఆమె చేసింది తన సొంత ప్రచారానికా లేక నిజంగా అవగాహన కోసమా అనేది పక్కన పెడితే ఆమె మరణ వార్త తర్వాత గర్భాశయ క్యాన్సర్‌పై ఇప్పుడు ఓ పెద్ద ప్రచారం జరుగుతుంది. మన దేశంలో సర్వికల్ క్యాన్సర్ రోజురోజుకు పెరిగిపోతోంది. దీనిపై సరైన అవగాహన లేక మహిళలు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

గర్భాశయ క్యాన్సర్ భారతదేశంలో రెండవ అత్యంత సాధారణంగా వస్తున్న క్యాన్సర్. ప్రతి ఏడాది 1,23,907 కొత్త కేసులు నమోదవుతున్నాయి. 77,348 మంది దీని కారణంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ క్యాన్సర్‌ని నిరోధించడానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఒక మంచి మార్గం. కానీ ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్నది. అయితే ఈ మధ్య మన దేశ పాలకులు ఈ టీకాలు వేయడానికి ప్రాధాన్యం ఇస్తామని, దానికి బడ్జెట్ కూడా ప్రత్యేకంగా కేటాయిస్తామని అంటున్నారు. దీని ఫలితంగా వ్యాక్సిన్ అత్యంత తక్కువ ధరలో సామాన్యులకు కూడా అందుబాటులో ఉంటుందని కూడా చెప్పారు. ఇదే జరిగితే చాలా మంది ప్రాణాలు కాపాడినవారు అవుతారు.

ఒక్క శాతం మాత్రమే...

అవగాహన లేకపోవడం, క్యాన్సర్ బారిన పడిన వారిని అంటురోగులుగా చూడటం, ఆరోగ్య సంరక్షణలో నెలకొన్న అసమానతలు మన దేశంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవగాహనకు ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం గర్భాశయ క్యాన్సర్‌ను 2030 నాటికి నిర్మూలించాలి అని పెట్టుకున్న లక్ష్యం సాధ్యం కాదని పిస్తుంది. ఇప్పటి వరకు కేవలం 1% కంటే తక్కువ మంది అమ్మాయిలకే హెచ్‌పీవీ టీకాలు వేశారు. అంటే మన పాలకుల లక్ష్యం ఎంత దూరంలో ఉందో అర్థమవుతుంది. ప్రభుత్వం ఇంకా ఉచిత టీకాలు ప్రారంభించలేదు. ఎవరైనా ఈ టీకా వేసుకోవాలంటే ధర చెల్లించాల్సిందే. అందుబాటులో ఉన్న తాజా వ్యాక్సిన్ మూడు డోస్‌లలో ఇస్తున్నారు. ఒక్కో డోస్ ధర రూ. 11,000 వరకు ఉంటుంది. అందుకే దీన్ని ఎక్కువమంది తీసుకోలేకపోతున్నారు.

అవగాహన కల్పించారు

ఈ నెల ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం జరుపుకున్నాం. ఇదే సమయంలో మన బడ్జెట్‌లో కూడా వ్యాక్సిన్ అందుబాటులో తీసుకొస్తామని ప్రకటించారు. కాబట్టి ఈ వ్యాక్సిన్‌పై అవగాహన పెంచేందుకు ఇదే సరైన సమయం. పైగా పాండే మరణ ప్రకటన తర్వాత ఈ క్యాన్సర్‌పై పెద్దఎత్తున చర్చ జరుగుతుంది. తన సొంత పబ్లిసిటీ కోసం దీన్ని వాడుకుంది అనే పుకార్లు వస్తున్నా ఇదే సమయంలో గర్భాశయ క్యాన్సర్‌పై అధ్యయనం చేసిన వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని కొన్ని లెక్కలు చెబుతున్నాయి. గర్భాశయ క్యాన్సర్ భయంతో జీవిస్తున్న చాలా మంది మహిళలకు పాండే అబద్ధపు మరణం కొంత వరకైనా అవగాహన కల్పిస్తుందనే కామెంట్లు కూడా వస్తున్నాయి.



ఆలోచించేలా ఉండాలి...

పూనమ్ పాండే మరణ వార్త విన్న తర్వాత చాలా మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్ అవగాహన గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ గురించి పరిశోధిస్తున్నారు. దీని ప్రకారం చూస్తే ఆమె చెప్పిన అబద్ధం ఒక విధంగా మన దేశ మహిళలకు, అమ్మాయిలకు మంచే చేసిందను కోవాలి. అయితే ఇదే పద్ధతిలో మరి కొందరు ఇలాంటి నకిలీ ప్రచారాలు చేస్తారనే వాదన కూడా లేకపోలేదు. నిజంగా ఇలాంటివే భవిష్యత్‌లో కొందరు వాడుకుంటే అలాంటి వార్తలకు ఎంతటి విశ్వసనీయత ఉంటుందో చూడాలి. నేటి సోషల్ మీడియా ఆధారిత ప్రపంచంలో సమాజంలో అభిప్రాయాలను రూపొందించడంలో, సందేశాలను వ్యాప్తి చేయడంలో సెలబ్రిటీలు పెద్ద పాత్ర పోషిస్తారు. వీటికి వారే బాధ్యత వహించాల్సి వస్తుంది. అయితే కొన్ని మెసేజ్లు సాధారణ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపుతాయి అనేది కచ్చితంగా చెప్పడం కష్టం. దేన్ని నమ్మాలి, దేన్ని నమ్మకూడదు అనే విషయంలో ప్రజలు కూడా కాస్త ఆలోచించాలి. ఒక సెలబ్రిటీ పేరు ప్రతిష్టలు సోషల్ మీడియాలోని ఫాలోవర్లు, లైక్‌లపై ఆధారపడి ఉన్న యుగం మనది. ఏది ఏమైనా పూనమ్ ఆలోచన చాలా మంది మహిళలను తాకినట్టు కనిపిస్తుంది. దీన్ని బట్టి సెలబ్రిటీలైనా, రాజకీయ నాయకులైనా, సమాజంపై ప్రభావం చూపే వ్యక్తులైనా తమ సందేశాలతో ప్రజల్లో ఓ అవగాహన కల్పించాల్సిన అవసరమైతే ఉందనిపిస్తుంది.



(గర్భాశయ క్యాన్సర్ గురించి మరింత సమాచారం కోసం ఇండియన్ క్యాన్సర్ సొసైటీ వారి క్యాన్సర్ హెల్ప్‌లైన్‌ను 1800-22-1951లో సంప్రదించవచ్చు. దయచేసి హెచ్‌పీవీ వ్యాక్సిన్ గురించి, మీరు వాటిని ఎప్పుడు తీసుకోవాలో తెలుసుకునేందుకు మీ వైద్యుడిని సంప్రదించండి.)

అందాన్ని, ఆరోగ్యాన్ని అందించే కొబ్బరిపాలు

కొబ్బరి నుండి మనకు చాలా పోషకాలు లభిస్తాయి. వీటితో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. కొబ్బరి నీళ్ళు, కొబ్బరి నూనె రెండూ కొబ్బరి నుండి విరివిగా ఉపయోగించేవి. అయితే కొబ్బరి పాలలో అనేక పోషకాలున్నాయి. వీటితో చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.అసలు కొబ్బరిపాలలో ఉండే పోషకాలు, అవి శరీరానికి, జుట్టుకు ఏ విధంగా ఉపయోగపడతాయో తెలుసుకుందాం..



ప్రయోజనాలు :

కొబ్బరి పాలలో విటమిన్ సి, ఇ, బి1, బి3, బి5, బి6, ఐరన్, సెలీనియం, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. చర్మం మంచి ఛాయతో మెరిసేందుకు దోహదం చేస్తాయి.కొబ్బరి పాలు శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. చర్మానికి ఉపశమనం కలిగించడానికి వీటిని ఉపయోగిస్తారు. ఎగ్జిమా, సోరియాసిస్ వంటి చర్మ వ్యాధులను దూరం చేయడంలో సహాయపడుతుంది. కొబ్బరి పాలలోని ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మాన్ని హైడ్రేట్ చేయడానికి సహాయపడతాయి. ఇందులోని ఆరోగ్యకరమైన ప్రొటీన్లు జుట్టును బలోపేతం చేయడానికి సహకరిస్తాయి. కొబ్బరి పాలలోని మాయిశ్చరైజింగ్ గుణాలు చర్మం, జుట్టుకు మంచివి.

మాయిశ్చరైజర్ తయారీ :

ఒక గిన్నె తీసుకుని అందులో అరకప్పు కొబ్బరి పాలు పోయాలి. దీనికి ఒకటి లేదా రెండు చెంచాల గ్లిజరిన్, చెంచా రోజ్ వాటర్ కలపాలి. వీటిని బాగా కలిపిన తర్వాత ఇందులోనే నాలుగు లేదా ఐదు చుక్కల రోజ్‌మేరీ ఎసెన్షియల్ ఆయిల్ లేదా లావెండర్ ఆయిల్ తోపాటు టీ ట్రీ ఆయిల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక కంటైనర్‌లోకి మార్చి రిఫ్రిజిరేటర్‌లో కొద్ది గంటల పాటు ఉంచి చల్లబరచాలి. తర్వాత దీన్ని మాయిశ్చరైజర్‌గా ఉపయోగించవచ్చు.

స్క్రబ్ తయారీ :

ఒక గిన్నెలో కొద్ది మొత్తంలో ఓట్స్ తీసుకోవాలి. వాటికి ఒకటి లేదా రెండు చెంచాల తేనె కలపాలి. తర్వాత అందులో సగం కొబ్బరి పాలు వేసి 20 నిమిషాలు నాననివ్వాలి. స్క్రబ్ తయారైనట్టే. దీనిని చర్మంపై అప్లై చేయాలి. తర్వాత 10-15 నిమిషాల తర్వాత ఈ స్క్రబ్‌ను చర్మంపై సున్నితంగా రుద్దాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడుక్కోవాలి. ఈ స్క్రబ్ ముఖంపై మొటిమలను నివారిస్తుంది. చర్మాన్ని మెరిసేలాచేస్తుంది. దీన్ని మీ తలకు స్క్రబ్‌గా కూడా ఉపయోగించవచ్చు.

కండీషనర్‌గా... :

జుట్టు మృదువుగా మెరుస్తూ ఉండాలంటే కొబ్బరి పాల కండీషనర్ బెస్ట్. ఒక కప్పు కొబ్బరి పాలను తీసుకుని అందులో రెండు చెంచాల నిమ్మరసం, చెంచా అలోవెరా జెల్ కలపాలి. కండీషనర్ తయారైనట్టే. తేలికపాటి షాంపూతో తలస్నానం చేశాక, ఈ కండిషనర్‌ని జుట్టుకు పట్టించాలి. ఇది జుట్టును మృదువుగా, మెరిసేలా చేస్తుంది. కొబ్బరి పాలు సహజమైన క్లెన్సర్‌గా పనిచేస్తాయి. సురక్షితమైనవి, ప్రభావవంతమైనవి కూడానూ.



చిట్కా

పనీర్ ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే దాన్ని బ్లాటింగ్ పేపర్లో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి.

అజిత్ వర్గానికే ఎన్సీపీ

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీలిక వర్గ నాయకుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చేతికి ఎన్సీపీ, దాని ఎన్నికల గుర్తు దక్కుతుందని ఈసీ తెలిపింది. ఎన్సీపీకి అసలైన నేతగా అజిత్ పవారేనని పేర్కొంది. ఎన్సీపీ ఎవరిదనే విషయంలో గత కొంతకాలంగా ఆ పార్టీ చీలిక వర్గాల మధ్య వివాదం కొనసాగుతున్నది. ఈ క్రమంలో అసెంబ్లీలో ఎక్కువమంది ఎమ్మెల్యేలు కలిగిన అజిత్ పవార్ వర్గానికే పార్టీ చిహ్నం, ఎన్నికల గుర్తును ఈసీ కేటాయించింది. త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తన వర్గానికి ఒక పేరును ఎంచుకోవాలని శరద్ పవార్‌కు ఈసీ సూచించింది. బుధవారం (7వ తేదీ) మధ్యాహ్నం 4 గంటల లోపు తమ వర్గం పేరు, గుర్తును ఎన్నికల సంఘానికి తెలియజేయాలని గడువు ఇచ్చింది.

గతేడాది ఎన్సీపీ నుంచి చీలిపోయి మెజార్టీ ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీ -షిండే సర్కారుకు మద్దతు పలికిన అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయన వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలూ మంత్రులయ్యారు. దీంతో ఎన్సీపీలో చీలిక ఏర్పడింది. అప్పటి నుంచి అసలైన ఎన్సీపీ ఎవరిదనే దానిపై శరద్ పవార్, అజిత్ పవార్ మధ్య వివాదం కొనసాగుతున్నది. ఎన్సీపీకి మొత్తంగా 53మంది ఎమ్మెల్యేలు ఉండగా.. అజత్ వర్గం చీలికతో ప్రస్తుతం శరద్ పవార్‌కు 12మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉన్నట్టు తెలుస్తున్నది.

కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి నివాసంపై ఈడీ దాడి

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ నివాసంపై ఈడీ అధికారులు మంగళవారం దాడి చేశారు. రాజధానిలోని పన్నెండు నివాసాలపై దాడులు జరిగాయని సమాచారం అందింది. రాజ్యసభ సభ్యుడు ఎన్‌డీ గుప్తా, ఢిల్లీ జల బోర్డు మాజీ సభ్యుడు షలభ్ కుమార్ నివాసాలపై కూడా దాడులు జరిగాయి. దాడులకు గురైన వారందరికీ ఆమ్‌ఆద్మీ పార్టీతో సంబంధాలు ఉన్నాయి. ఆర్థిక అవకతవకలు, మనీ లాండరింగ్ కేసులో జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు నిర్వహించారు. ఈడీ బండారాన్ని బయటపెడతానని ఢిల్లీ మంత్రి అతిషి హెచ్చరించిన గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. 'మంగళవారం ఉదయం 10 గంటలకు ఈడీకి సంబంధించిన సంచలన విషయాలు బయటపెడతానని నిన్న చెప్పాను. దీనిని అడ్డుకునేందుకు, ఆప్‌ను భయపెట్టేందుకు ఈడీ అధికారులు ఈ రోజు ఉదయం ఏడు గంటల నుండే పార్టీ నేతలు, కార్యకర్తల నివాసాల్లో సోదాలు ప్రారంభించారు. దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ఆప్‌ను భయపెట్టాలని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అని చెప్పారు.

రెండు లక్షల ఉద్యోగాలివ్వాల్సిందే..

పార్లమెంటు మాజీ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెండు లక్షల కొత్త ఉద్యోగాల భర్తీ అని చెప్పి... 60 ఉద్యోగాల నోటిఫికేషన్‌తో ప్రభుత్వం ఆరంభం చేసిందని పార్లమెంట్ మాజీ సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి ఈ నెల చివరి నాటికి మిగతా 1, 99,940 ఉద్యోగాలకు షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం ఖాళీలపై నిరుద్యోగులకు స్పష్టతనివ్వాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో 1,60, 083 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. 42వేల ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించిందని పేర్కొన్నారు.

ఎల్డీఎఫ్ నిరసనకు డీఎంకే మద్దతు

తిరువనంతపురం : ఫెడరలిజం పరిరక్షణకు కేరళ ప్రభుత్వం చేస్తున్న ఆందోళనకు తమిళనాడు సీఎం స్టాలిన్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాజ్యాంగ నిర్మాతలు ఊహించిన ఫెడరలిజం ప్రాథమిక సూత్రం తీవ్ర ముప్పులో ఉందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కేరళ సీఎం విజయన్‌కు స్టాలిన్ లేఖ పంపించారు. కేరళకు నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష ప్రదర్శించడాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తప్పుపట్టారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేరళ సర్కారు తీసుకున్న చట్టపరమైన చర్యలను ఆయన సమర్థించారు. ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఢిల్లీలో చేపట్టబోయే ఆందోళనలో డీఎంకే కూడా భాగస్వామి అవుతుందని లేఖలో స్టాలిన్ తెలిపారు. సహకార ఫెడరలిజాన్ని నెలకొల్పి, రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని సాధించేంత వరకూ మన గళం ఆగకూడదని ఆయన అన్నారు. దేశ రాజ్యాంగంపై విశ్వాసం ఉన్న వారందరూ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కోసం కలసికట్టుగా నిలవాలని మమతా బెనర్జీ, పినరయి విజయన్ తదితర నేతలను కోరారు. 'రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించాలన్న నినాదపు వేడిని ఫాసిస్టు బీజేపీ ఎప్పటికీ చల్లార్చలేదు. ఆర్థిక, పాలనా వ్యవహారాలలో రాష్ట్రాలకు ఉన్న హక్కులను పరిరక్షించాల్సిన అవసరముంది. అందుకు ఇప్పుడు సమయం ఆసన్నమైంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

తమిళనాడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని డీఎంకే ప్రతినిధి శరవరణ్ చెప్పారు. 'రెండు తీవ్రమైన తుపానులు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నిధులు విడుదల చేయాల్సిందిగా కేంద్రాన్ని కోరాము. అయితే కేంద్రం కాలయాపన చేస్తోంది. తమిళనాడుకు బదులు ఇతర రాష్ట్రాలన్నింటికీ సాయం అందిస్తోంది' అని ఆయన మండిపడ్డారు. రాష్ట్రానికి ఆర్థిక పరమైన స్వయం ప్రతిపత్తి ఉంటే కేంద్రాన్ని అడగాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. సంక్షోభ సమయంలోనూ కేంద్రం ఆదుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రాల రుణ పరిమితిపై కేంద్రం ఆంక్షలు విధించడాన్ని సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం డిసెంబరులో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్య రాష్ట్రాల ఆర్థిక నిర్వహణలో పరోక్షంగా జోక్యం చేసుకోవడమే అవుతుందని తెలిపింది. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని విమర్శించింది.

మధ్యప్రదేశ్‌లో దారుణం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని ఒక బాణాసంచా ఫ్యాక్టరీలో మంటలు ఎగిసి పేలుళ్లు సంభవించిన ఘనటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 100 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటన హర్దాలో చోటు చేసుకున్నది. ఫ్యాక్టరీలో మంటలు వ్యాపించటంతో అనేక పేలుళ్లు జరిగాయి. దీంతో చుట్టుపక్కన ప్రాంతాలు వణికిపోయాయి.

గాయాలపాలైనవారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నదని అధికారులు తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా నర్మదాపురం జిల్లాలోని సియోని మాల్వా ప్రాంతంలో ప్రకంపనలు వచ్చినట్టు అక్కడి ప్రజలు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంటల్లో చిక్కుకొని గాయాలపాలైనవారి కోసం భోపాల్, ఇండోర్‌లో మెడికల్ కాలేజీలను సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఘటనా ప్రదేశానికి అనేక ఫైర్ ఇంజిన్లను తరలించినట్టు సీఎం 'ఎక్స్'లో వివరించారు.

ఫ్యాక్టరీలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి, పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మంటలు, పొగ పెత్త ఎత్తున చెలరేగటంతో దగ్గరలో ఉండే ప్రజలు భయానికి పరుగెత్తారు. ఘటనా ప్రదేశానికి చేరుకున్న అగ్నిమాపక యంత్రాలు మంటలు ఆర్పటానికి ప్రయత్నిస్తున్నాయని అధికారులు చెప్పారు. "రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను కూడా పిలిచాం" అని జిల్లా కలెక్టర్ రిషి గార్గ్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో దాదాపు 150 మంది ఉన్నట్టు ఒక కార్మికుడు చెప్పాడు.

563కు పెరిగిన గ్రూప్-1 పోస్టులు

(మొదటిపేజి తరువాయి)

పంచాయతీ అధికారి పోస్టులు రెండు, డిప్యూటీ కలెక్టర్ల పోస్టులు మూడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టులు నాలుగు, జిల్లా రిజిస్ట్రార్ (రిజిస్ట్రేషన్) పోస్టులు ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది జూన్ 11న టీఎస్‌పీఎస్సీ ప్రిలిమ్స్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానాన్ని పాటించలేదంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రిలిమ్స్‌ను కోర్టు రద్దు చేసింది. ఈ పరీక్ష కోసం 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 2,32,457 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ సుప్రీంకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. అది ప్రస్తుతం విచారణలో ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఉద్యోగాల భర్తీపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈనెల ఒకటో తేదీన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందులో భాగంగానే 60 గ్రూప్-1 పోస్టులను మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను రద్దు చేసేందుకే టీఎస్‌పీఎస్సీ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టుకు నివేదించి కేసును ఉపసంహరించుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. న్యాయనిపుణులు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించినట్టు తెలిసింది. ఎందుకంటే సుప్రీంకోర్టులో కేసుకు సంబంధించి తీర్పు ఎప్పుడు వస్తుందో తెలియదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో నిరుద్యోగుల పాత్ర కీలకంగా ఉన్నది. అందుకే నిరుద్యోగులకు మేలు చేసే దిశగానే రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన చేస్తున్నట్టు తెలిసింది. సుప్రీంలో కేసు ఉపసంహరించుకుని 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి అనుబంధ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశమున్నది. ఇంకోవైపు గురువారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి.

మొదటిరోజు గవర్నర్ ప్రసంగంలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించిన అంశం ఉండే అవకాశమున్నది. టీఎస్‌పీఎస్సీ ఈ దిశగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేసినా గతంలోని అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని తెలుస్తున్నది. కొత్త వారికి అవకాశం కల్పించాలని భావిస్తున్నట్టు సమాచారం. మళ్లీ ప్రిలిమ్స్ రాతపరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ సమాలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఇంకోవైపు 503 పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్‌తో జత చేయకుండా 60 పోస్టుల భర్తీకి కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలన్న కోణంలోనూ టీఎస్‌పీఎస్సీ అధికారులు ఆలోచన చేస్తున్నారని సమాచారం.

సహజీవన సంబంధాల నమోదు తప్పనిసరి

- లేకుంటే జైలు లేదా జరిమానా
- ఉత్తరాఖండ్ యూసీసీ బిల్లులో ప్రతిపాదన

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ మంగళవారం రాష్ట్ర శాసనసభలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లును ప్రవేశపెట్టారు. అన్ని రకాల సహజీవన సంబంధాలను నెల రోజుల్లో జిల్లా అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని అందులో నిర్దేశించారు. అలా చేయని పక్షంలో మూడు సంవత్సరాల వరకూ జైలు శిక్ష లేదా పది వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సహజీవన సంబంధం అంటే ఏమిటో బిల్లులో నిర్వచించారు. దీని ప్రకారం ఒక పురుషుడు, ఒక మహిళ వివాహ బంధం వంటి సంబంధం ఏర్పరచుకొని ఒకే ఇంటిలో సహజీవనం చేస్తున్నట్లయితే అది సహజీవన సంబంధం అవుతుంది. అయితే అలాంటి సంబంధం యూసీసీలోని పార్ట్-3 కింద నిషేధానికి గురై ఉండకూడదు.

సహజీవనం చేస్తున్న దంపతులు రాష్ట్ర వాసులైనా కాకపోయినా విధిగా నమోదు చేసుకోవాలి. తాము సహజీవనం సాగిస్తున్నామని వారు రిజిస్ట్రార్ వద్ద స్టేట్‌మెంట్ ఇచ్చిన తర్వాత ఆయన విచారణ జరుపుతారు. బిల్లులోని సెక్షన్ 380లో పేర్కొన్న కేటగిరీల్లో దేనికీ ఈ సంబంధం వర్తించదని ధృవీకరించుకునేందుకు ఈ విచారణ అవసరమవుతుంది. రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వకపోయినా లేదా తప్పుడు సమాచారం ఇచ్చినా మూడు నెలల వరకూ జైలు శిక్ష విధించవచ్చు. లేదా ఇరవై ఐదు వేల రూపాయల జరిమానా విధించవచ్చు. లేకుంటే ఈ రెండూ విధించవచ్చు.

సహజీవనంలో ఉన్న పురుషుడు తన భాగస్వామిని విడిచి వెళ్లిపోతే అతని నుండి జీవనభృతి పొందే హక్కు ఆమెకు ఉంటుంది. కాగా ముఖ్యమంత్రి బిల్లును ప్రవేశపెట్టినప్పుడు సభ్యులు 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం', 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేశారు. ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే స్వాతంత్ర్యానంతరం ఇలాంటి పౌరస్మృతిని ఆమోదించిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ పేరు పొందుతుంది. ముసాయిదా బిల్లుకు రాష్ట్ర క్యాబినెట్ ఆదివారం నాడే ఆమోదముద్ర వేసింది.

బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం ముఖ్యమంత్రి ధామీ మాట్లాడుతూ ఇది చారిత్రాత్మకమైనదని అభివర్ణించారు. కాగా బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, అయితే బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కి దానిని ఆమోదింపజేసుకునేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ నేత యశ్‌పాల్ ఆర్య విలేకరుల సమావేశంలో విమర్శించారు.

21న ఎప్‌సెట్ నోటిఫికేషన్

(మొదటిపేజి తరువాయి)

నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరంలో వంద శాతం సిలబస్‌తో ఎప్‌సెట్‌ను నిర్వహిస్తామని డీన్‌కుమార్ స్పష్టం చేశారు.

పెట్టుబడిదారుల చేతిలో దేశ సంపద

(మొదటిపేజి తరువాయి)

చాలా ముఖ్యమని అంటూ ప్రస్తుతం రిజర్వేషన్లను యాభై శాతానికే పరిమితం చేశారని గుర్తు చేశారు. 'దేశంలో 8శాతం గిరిజనులు, 15శాతం దళితులు, 50శాతం ఓబీసీలు ఉన్నారు. వీరందరి జనాభా 73శాతం వరకూ ఉంది. అలాంటప్పుడు రిజర్వేషన్లను 50%కే పరిమితం చేయడం ఏమిటి? అందుకే కులగణన జరపాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జీఎస్టీని మారుస్తామని, చిన్న, మధ్య తరహా వ్యాపారాల కోసం కొత్తగా ఆర్థిక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. 'మనం పోరాటాన్ని కొనసాగించాల్సిందే.

అది ఎన్నికల కమిషన్ కానివ్వండి. దర్యాప్తు సంస్థలు కానివ్వండి. అధికార యంత్రాంగం కానివ్వండి. పోలీసులు కానివ్వండి. ఈ వ్యవస్థలన్నింటినీ దుర్వినియోగం చేస్తున్నారు. వీటితో మనం పోరాడాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ తెలిపారు. క్షీర విప్లవం, హరిత విప్లవం తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా రాహుల్ యాత్ర సాయంత్రం ఒడిషాలో ప్రవేశించింది.




పాలేరు..కన్నీరు

లక్ష ఎకరాలకుపైగా ఆయకట్టు విలవిల

- తాగునీటి అవసరాలూ తీరేలా లేవ్..
- ప్రస్తుత నిల్వలతో మార్చి 15వరకు తాగునీరు
- రెండు నెలల తర్వాత మూడు జిల్లాల్లో దాహార్తి తప్పదు
- మంత్రి పొంగులేటి చొరవతో అధికారుల దృష్టి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి
పాలేరు జలాశయం అడుగంటుతోంది. రోజురోజుకూ రిజర్వాయర్‌లో నీటిమట్టం పడిపోతోంది. నీటిమట్టం గణనీయంగా పడిపోతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంచేందుకు సాగర్ నుంచి విడుదల చేయిస్తున్నారు. అయితే, ఆ నీటిని కూసుమంచి, నేలకొండపల్లి మండలాల ఆయకట్టు రైతులు మూడ్రోజుల కిందట విడుదల చేసుకున్నారు. వెంటనే అధికారులు ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి పడిపోతే తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తుతాయని రైతులకు నచ్చజెప్పి నీటి విడుదలను నిలుపు చేయించారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం 17 అడుగుల వరకు నీరు ఉంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నాగార్జునసాగర్‌లోనూ ఆశించిన స్థాయిలో నీరు లేదు. కృష్ణా పరివాహకంలో వర్షాలు సరిగా కురవకపోవడంతో ఆగస్టు నుంచే సాగర్ ఆయకట్టుకు నీటికష్టాలు మొదలయ్యాయి. ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల ఆయకట్టుకుపైగా నీటి సమస్యతో అల్లాడుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో అధికారులు పాలేరు జలాశయం నీటిమట్టం పెంచేందుకు చర్యలు చేపట్టారు. రెండ్రోజులుగా సాగర్ నుంచి పాలేరుకు నీరు విడుదల చేస్తున్నా.. ఎగువ ప్రాంతం నుంచి సరైన ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌కు చేరడం లేదు.

సాగునీరు లేనట్టే..!
ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీరు తప్ప సాగర్ ఆయకట్టులో సాగు నీరు ఇచ్చే పరిస్థితి లేదని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఉన్న నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో ఆధారంగా చూస్తే తాగు నీరు సైతం మార్చి 15 వరకే ఇవ్వగలిగే పరిస్థితి ఉంది. దాదాపు రెండు, మూడు నెలల తర్వాత సాగర్ నుంచి పాలేరుకు నీరు విడుదల చేశారు.



కానీ ఆ నీటిలో 40% వృథాగానే పోతుందని అధికారులు చెబుతున్నారు. ఎగువన రైతులు మోటార్లు పెడుతుండటం, ఎక్కువ రోజులుగా కాల్వలు ఎండిపోవడం, వివిధ రూపాల్లో నీరు వృథా అవుతుంది. నీరు విడుదలయ్యాక ఎగువ ప్రాంతంలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల రైతులు వాటిని వినియోగించడంతో ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌కు చేరలేదు. మంగళవారం నుంచే కొంతమేర నీటి ప్రవాహం పెరిగింది. ఎన్నెస్పీ అధికారుల లెక్కల ప్రకారం 1.2 టీఎంసీలు పాలేరుకు వదిలినట్టు చెబుతున్నా వృథా పోను 0.6 టీఎంసీల నీరు మాత్రమే రిజర్వాయర్‌లోకి చేరుతోంది.

తాగునీటికీ కటకట
పాలేరు రిజర్వాయర్ ఆధారంగా నిర్వహిస్తున్న మిషన్ భగీరథ పథకానికి సైతం నీరు అందేలా లేదు. రిజర్వాయర్ ద్వారా ప్రతిరోజూ150 క్యూసెక్కుల నీరు మిషన్ భగీరథ ప్రాజెక్టుతోపాటు పాలేరు డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్నారు. ఇక్కడి నుంచే ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీరు సరఫరా అవుతోంది. కృష్ణా బేసిన్‌లో సరైన వర్షాలు లేని కారణంగా తాగునీటికీ కటకట ఏర్పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా రిజర్వాయర్‌ను మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టు నీటిమట్టాన్ని పరిశీలించారు. జీళ్లచెరువులోని మిషన్ భగీరథ ప్రాజెక్టునూ సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాగునీటికే కష్టం..
ఎం.వెంకటేశ్వర్లు, ఈఈ ఇరిగేషన్
తాగునీటి అవసరాలకే నీరు అందించే పరిస్థితి లేదు. కాబట్టి రైతులు సాగునీటి కోసం ఎదురు చూడొద్దు. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీటిని బట్టి మార్చి 15 వరకు తాగునీరు ఇవ్వొచ్చు.

ఆశించిన స్థాయిలో చేరని నీరు
పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నుంచి నీరు ఆశించిన స్థాయిలో చేరడం లేదు. కనీసం తాగునీటి అవసరాలకు సరిపడా నీరందే పరిస్థితి లేదు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ నుంచి కూడా నీరందే పరిస్థితి లేదు కాబట్టి నాగర్జునసాగర్ తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. కనీసం 1.5 టీఎంసీల నీరు అందితేనే తాగునీటి అవసరాలైనా తీరుతాయని అధికారులు చెబుతున్నారు. అది కూడా మార్చి వరకే సరిపోతాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలలో తాగునీటి అవసరాలకు కూడా పాలేరు నుంచి నీరందే పరిస్థితి ఉండదని అధికారుల అంచనా.



కుర్రాళ్లు..కేక..

- ఫైనల్లో భారత యువజట్టు
- సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై సంచలన విజయం
- ఐసిసి అండర్-19 ప్రపంచకప్

జొహన్నెస్‌బర్గ్: ఐసిసి(అండర్-19) వన్డే ప్రపంచకప్‌లో యువ క్రికెటర్లు కేక పుట్టించారు. దక్షిణాఫ్రికాతో మంగళవారం జరిగిన తొలి సెమీస్‌లో ఓటమి అంచుల్లో నిలిచి టీమిండియా.. విజయతీరాలకు చేరిన తీరు వర్ణణాతీతం. సఫారీ యువ జట్టు నిర్దేశించిన 245పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత యువజట్టు 32పరుగులకే టాప్ ఆర్డర్ నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో కెప్టెన్ ఉదయ్ సహారన్(81) అర్ధసెంచరీకి తోడు.. సచిన్ ధాస్(96) తృటిలో సెంచరీని చేజార్చుకొన్నారు. వీరిద్దరూ కలిసి 5 వికెట్‌కు ఏకంగా 171పరుగులు జతచేశారు. ఆ తర్వాత వీరి ఔటైనా.. ఆల్‌రౌండర్ లింబాని(13నాటౌట్; 4బంతుల్లో ఫోర్, సిక్సర్) మ్యాచ్‌ను ముగించాడు. దీంతో భారత్ 48.5ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 248పరుగులు చేసి విజయం సాధించి వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. విల్లోమోర్ పార్క్ వేదికగా జరిగిన తొలి సెమీస్‌లో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా.. నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా యువ జట్టులో లువాన్ డ్రి ప్రిటోరియస్ (76; 102బంతుల్లో, 6ఫోర్లు, 3సిక్సర్లు), రిచర్డ్ సెలెట్స్వేన్ (64; 100బంతుల్లో, 4ఫోర్లు, 2సిక్సర్లు) రాణించారు. సఫారీలు ఐదో ఓవర్లోనే తొలి వికెట్‌ను కోల్పోయారు. ఓపెనర్ స్టీవ్ స్టాక్(14)ను రాజ్ లింబాని ఔట్ చేశాడు. వన్ డౌన్‌లో వచ్చిన డేవిడ్ టీగర్ పరుగులేమీ చేయకుండానే నిష్క్రమించాడు. 46పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన సఫారీలను ప్రిటోరియస్-రిచర్డ్‌లు ఆదుకున్నారు. ఈ జోడీ మూడో వికెట్‌కు 72పరుగులు జోడించారు. భారీషాట్లు ఆడకపోయినా వికెట్లు కాపాడుకుంటూ ఆడుతున్న ఈ జోడీని ముషీర్ ఖాన్ విడదీశాడు.

30వ ఓవర్లో రెండో బంతికి ప్రిటోరియస్.. మురుగన్ అభిషేక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ప్రిటోరియస్ ఔట్ అయినా రిచర్డ్.. ఒలీవర్ వైట్‌హెడ్ (22)తో కలిసి నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. ఒలీవర్‌ను కూడా ముషీర్ ఖాన్ ఔట్ చేశాడు. అర్ధ సెంచరీ చేసుకున్నాక రిచర్డ్.. నమన్ తివారి బౌలింగ్‌లో ప్రియాన్షుకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఆఖర్లో కెప్టెన్ జువాన్ జేమ్స్ (24, 19 బంతుల్లో ఫోర్, సిక్సర్), ట్రిస్టన్ లూస్ (23నాటౌట్, 12 బంతుల్లో ఫోర్, 2సిక్సర్లు) దూకుడుగా ఆడటంతో సఫారీ స్కోరుబోర్డు 244లకు చేరింది. భారత బౌలర్లు లింబానికి మూడు, ముషీర్ ఖాన్‌కు రెండు, తివారి, సౌమీ పాండేలకు ఒక్కో వికెట్ దక్కాయి.

32పరుగులకు 4వికెట్లనుంచి.. గెలుపు తీరాలకు..
లక్ష్యఛేదనలో టీమిండియా 32పరుగులకే 4వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. సఫారీ పేసర్ ట్రిస్టాన్ లూస్ భారత బ్యాటర్లను హడలెత్తించాడు. లూస్ 3 వికెట్లతో భారత్ టాపార్డర్‌ను దెబ్బతీశాడు. ఇన్నింగ్స్ మొదటి బంతికే ఓపెనర్ ఆదర్శ్ సింగ్(0) డకౌట్ అయ్యాడు. ఈ వికెట్ క్వెనా ఎంఫాకా ఖాతాలో చేరింది. అక్కడ్నించి ట్రిస్టాన్ లూస్ నిప్పులు చెరిగే బంతులతో భారత బ్యాటింగ్ లైనప్‌కు పరీక్ష పెట్టాడు. తొలుత ముషీర్ ఖాన్(4)ను అవుట్ చేసిన లూస్... అదే ఊపులో మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి(12), ప్రియాన్షు మోలియా(5)లను పెవిలియన్ చేర్చాడు. ఆ దశలో కెప్టెన్ సహారన్(81; 124బంతుల్లో 6ఫోర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. సచిన్ ధాస్(96; 95బంతుల్లో 11ఫోర్లు, సిక్సర్) ధాటిగా ఆడినా.. కెప్టెన్ ఆచి తూచి ఆడాడు. వీరిద్దరూ కలిసి ఆచి తూచి ఆడడంతో భారతజట్టు 203పరుగుల వరకు 5 వికెట్లు కోల్పోలేదు. ఆ తర్వాత వీరు ఔటైనా.. మిగతా పని లింబాని(13; 4బంతుల్లో ఫోర్, సిక్సర్) మ్యాచ్ ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సచిన్ దాస్‌కు లభించింది. పాకిస్తాన్-ఆస్ట్రేలియా జట్ల మధ్య 8న రెండో సెమీస్ జరగనుండగా.. ఫైనల్ మ్యాచ్ 11న ఆదివారం బెనోని మైదానంలో జరగనుంది.

రేపటి నుంచి జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్



హైదరాబాద్: రెండు దశాబ్దాల అనంతరం జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోందని ఆ సంఘం రాష్ట్ర జీవితకాల అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గచ్చిబౌలి క్రీడా సముదాయంలో గురువారం నుంచి నాలుగు రోజులు పాటు ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. దాదాపు 20 రాష్ట్రాల నుంచి 4వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. లాంగ్‌జంప్, హైజంప్, డిస్క్ త్రో, జావెలిన్ త్రో, స్ప్రింట్, హర్డిల్స్, లాంగ్ డిస్టెన్స్ రన పోటీలను 30 ప్లస్ నుంచి 70 ప్లస్ వయో విభాగాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ప్రభుకుమార్, కోశాధికారి రాజేశ్వరి, సహాయ కార్యదర్శి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



హేమంత్ అకాడమీ జిమ్నాస్ట్‌ల పతక మోత

హైదరాబాద్ : ట్విన్ సిటీ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో హేమంత్ జిమ్నాస్టిక్స్ అకాడమీకి చెందిన జిమ్నాస్ట్‌లు పతకాల మోత మోగించారు. గచ్చిబౌలిలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో తొమ్మిది స్వర్ణాలు, 22 రజతాలు, 14 కాంస్య పతకాలు గెలిచారు. టీమ్ చాంపియన్‌షిప్‌లో హేమంత్ అకాడమీ బాలురు, బాలికలు రెండో స్థానం కైవసం చేసుకున్నారు. పతక విజేతలను చీఫ్ కోచ్ హేమంత్, కోచ్‌లు నగేశ్, కిశోర్, హర్షవర్ధన్ అభినందించారు.



వాసిరాజు ప్రకాశంకి ఇట్ మా అవార్డు

స్వర్ణోత్సవ సినీ జీవన లబ్ధ ప్రతిష్ఠులకు 'ఇట్ మా' వంటి ప్రతిష్టాత్మక అవార్డుతో గౌరవిస్తున్న అంతర్జాతీయ సినీ అవార్డుల సంస్థ ఇంటర్నేషనల్ తెలుగు మూవీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సీనియర్ పాత్రికేయులు, నిర్మాత వాసిరాజు ప్రకాశంకి బహూకరించి, ఘనంగా సత్కరించారు. సంస్కృతి రత్న కె.ధర్మారావు అధ్యక్షతన జరిగిన సభలో నిర్మాతల మండలి కార్యదర్శి, ఫిల్మ్ ఛాంబర్ కోశాధికారి ప్రసన్నకుమార్, అవార్డును బహుకరించారు.
నిర్మాతలు రామసత్యనారాయణ, కె, ధర్మారావు, సీనియర్ పాత్రికేయులు కేశవ్‌తోపాటు కళా పత్రిక సంపాదకులు మొహ్మద్ రఫీ, నిర్మాతలమండలి సభ్యులు రాజు, పరుచూరి మోహన్ తదితరులు ఈ సందర్భంగా వాసిరాజు సినీ పాత్రికేయ జీవన వైశిష్ట్యాన్ని, నిర్మించిన, సందేశాత్మక చిత్రాల గురించి కొనియాడారు. తనకు జరిగిన ఈ సత్కారానికి వాసిరాజు ప్రకాశం సంతోషం వ్యక్తం చేస్తూ, 'ఇట్ మా' సంస్థకు క్రతజ్ఞతలు తెలియజేశారు.

తండ్రికి ఇచ్చిన మాట కోసం


కేతకి నారాయణ్, జీవా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి పేదల కష్టనష్టాలను తెలుసుకుని వాటిని తీర్చటానికి చేసిన పాదయాత్ర ఆధారంగా రూపొందిన సినిమా 'యాత్ర'. దీనికి కొనసా గింపుగా రూపొందిన చిత్రం 'యాత్ర 2'. వై.ఎస్.ఆర్ పాత్రలో మలయాళ స్టార్ మమ్ముట్టి నటించగా , ఆయన తనయుడు వై.ఎస్.జగన్ పాత్రలో కోలీవుడ్ స్టార్ జీవా నటించారు. 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ పరిస్థితులు, వై.ఎస్.జగన్ పేదల కోసం చేసిన పాదయాత్ర ఆధారంగా 'యాత్ర 2' చిత్రాన్ని రూపొందించారు. ఈనెల 8న సినిమాని విడుదల చేస్తున్నారు.
ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో దర్శకుడు మహి వీ రాఘవ్ మాట్లాడుతూ,'ఈ టీజర్, ట్రైలర్‌లో చూసిన సీన్లు ప్రజలకి తెలిసి ఉండకపోవచ్చు. ఓ చెవిటి అమ్మాయితో ఉన్న సీన్, ఓ అంధుడితో సీన్ ఇవన్నీ బయటి ప్రజలకు తెలియవు. ఇలాంటి ఎన్నో ఎమోషనల్ సీన్స్, ఎన్నో తెలియని అంశాలతో 'యాత్ర 2'ని తీశాను. ఇందులో కేవలం ఓ తండ్రికి కొడుకు ఇచ్చిన మాట అనే పాయింట్ చుట్టూనే తిరుగుతుంది. ఇందులో నేను ఎవ్వరినీ కించపరిచేలా పాత్రలు సృష్టించలేదు' అని అన్నారు. హీరో జీవా మాట్లాడుతూ, 'వైఎస్ జగన్ పాత్రలో నటించడం కష్టంగా అనిపించింది' అని చెప్పారు. 'వైస్ భారతిగా నటించడం నాకు సవాల్‌గా నిలిచింది. నా పాత్రకు న్యాయం చేశాను' అని కేతకి నారాయణ్ తెలిపారు.

నవచిత్రం

నందనందనా.. సందడి షురూ


మృణాల్ ఠాకూర్, విజయ దేవరకొండ

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ సినిమా నుంచి ఈ నెల 7వ తేదీన ఫస్ట్ సింగిల్ 'నందనందనా..'ని రిలీజ్ చేయబోతున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ సాంగ్ ప్రోమో ఆకట్టుకుంటోంది. ఈ పాట ప్రోమోలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జాయ్ ఫుల్ మూడ్‌లో కనిపిస్తున్నారు. విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ పెట్ల సూపర్ హిట్ మూవీ "గీత గోవిందం'లో ఛాట్ బస్టర్ సాంగ్ 'ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే...'కు వర్క్ చేసిన లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్, సింగర్ సిధ్ శ్రీరామ్, మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ కాంబోలో ఈ సాంగ్ వస్తుండటంతో ఈ పాటపై బజ్ క్రియేట్ అయింది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 5వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నట్లు రీసెంట్‌గా మేకర్స్ అనౌన్స్ చేశారు. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందనే పాజిటివ్ టాక్ ఇప్పటికే మొదలైందని, ఈ సినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే ధీమాని మేకర్స్ వ్యక్తం చేశారు.
ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : కేయూ మోహనన్, సంగీతం : గోపీసుందర్, ఆర్ట్ డైరెక్టర్ : ఏ ఎస్ ప్రకాష్, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్, రచన, దర్శకత్వం - పరశురామ్ పెట్ల.


ఎస్‌కేఎన్

లవర్స్ కనెక్ట్ అవుతారు

ప్రతి రోజు పండగే, ట్యాక్సీ వాలా, బేబి' వంటి సినిమాలతో సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్‌గా పేరు తెచ్చుకున్నారు ఎస్ కేఎన్. మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ మూవీ లవర్‌ను 'ట్రూ లవర్' పేరుతో డైరెక్టర్ మారుతితో కలిసి ఆయన తెలుగులో విడుదల చేస్తున్నారు. దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ రూపొందించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాత ఎస్‌కేఎన్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు తమతో పోల్చు కుంటారు. ప్రేమలో ఉన్న యువతకు రీచ్ అయ్యే సబ్జెక్ట్ ఇది. లవర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. తను ఎంచుకున్న కథకు డైరెక్టర్ పూర్తి న్యాయం చేశాడు. నా స్నేహితుడు బన్నీవాస్ డిస్ట్రిబ్యూషన్‌కు ముందు కొచ్చాడు. ఏ రిలేషన్ లోనైనా నమ్మకం అనేది పునాదిగా ఉంటుంది. ఉండాలి. ఈ సినిమాలో మెయిన్ పాయింట్ అదే. ఈ సినిమాలో కొన్ని సీన్స్ చాలా షాకింగ్‌గా అనిపించాయి. అవి చూసే సినిమా సక్సెస్‌ను బిలీవ్ చేశా' అని అన్నారు.

ప్రేక్షకులంతా గర్వంగా ఫీలయ్యే సినిమా


వరుణ్ తేజ్, మానుషి చిల్లర్

వరుణ్ తేజ్ నటిస్తున్న తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. ఈ సినిమాలోని రొమాంటిక్ లేయర్‌ని చూపించ డానికి మేకర్స్ రెండవ సింగిల్ 'గగనాల..'ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఫస్ట్ సింగిల్ కంపో జిషన్‌తో అందరినీ ఆకట్టుకున్న మిక్కీ జె మేయర్ ఈ పాట కోసం ఒక ఆకర్షణీయమైన రొమాంటిక్ మెలోడీని అందించారు.
సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి ఈ పాటకు సాహిత్యం అందించగా, అర్మాన్ మాలిక్ ఆకట్టుకునేలా పాడారు.
ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ మాట్లాడుతూ,'ఈ పాట మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. పాట కంటే సినిమా మరో స్థాయిలో ఉంటుంది. మనందరికీ ఫ్యామిలీస్, ఫ్రెండ్స్ ఉంటారు. ఒకరిని ఒకరం జాగ్రత్తగా చూసుకుంటాం. కానీ దేశాన్ని కాపాడే సైనికుడు 130కోట్ల మందిని తన కుటుంబంగా భావించి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. అలాంటి సైనికుల కోసం, వాళ్ళు చేసిన త్యాగాల కోసం, వాళ్ళ కథని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే గొప్ప ఉద్దేశంతో ఈ సినిమా చేశాం. మన రియల్ సూపర్ హీరోస్ కథని చూసి ప్రేక్షకులంతా చాలా గర్వంగా ఫీలౌతారు. మార్చి 1న ఈ సినిమా థియేటర్స్‌లోకి వస్తుంది. మీ అందరికీ నచ్చుతుందని గర్వంగా చెబుతున్నాను' అని అన్నారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించాయి. గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ (వకీల్ ఖాన్), నందకుమార్ అబ్బినేని సహ నిర్మాతలు.

ఇదొక యూనిక్ ఈగల్


కావ్యా థాపర్

రవితేజ నటించిన తాజా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్స్‌గా నటించిన ఈ సినిమా ఈనె 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ కావ్య థాపర్ ఈ చిత్ర విశేషాలను మీడియాతో షేర్ చేసుకున్నారు.
'ఓ బాలీవుడ్ సినిమా షూటింగ్ కోసం ముంబైలో వున్న సమయంలో దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ కథ చెప్పారు. చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. అలాగే రవితేజ సినిమాలో చేయడం గొప్ప అవకాశం కూడా అనిపించింది. ఇందులో యాక్షన్, రొమాన్స్ చాలా యూనిక్‌గా ఉంటాయి. ముఖ్యంగా రొమాన్స్ అయితే చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. ఖచ్చితంగా ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు.ఇందులో నా పాత్ర పేరు రచన. జీవితంలో చాలా యూనిక్ గోల్స్ ఉన్న అమ్మాయిగా కనిపిస్తాను. ఇందులో ఉన్న అద్భుతమైన ప్రేమకథ గురించి అప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు(నవ్వుతూ). రవితేజ, నా పాత్ర మధ్య కెమిస్ట్రీ చాలా బాగా ఉంటుంది. సినిమా చాలా బాగా వచ్చింది. రవితేజ, డైరెక్టర్ కార్తిక్, మా టీం అంతా చాలా హ్యాపీగా, కాన్ఫిడెంట్‌గా వున్నాం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. సినిమాని ఇంటర్నేషనల్‌గా చాలా గ్రాండ్‌గా చిత్రీకరించారు. వారితో మరిన్ని చిత్రాలు చేయాలని కోరుకుంటున్నాను.నాకు ఫుల్ మాస్ యాక్షన్ సినిమా చేయాలని ఉంది(నవ్వుతూ). అలాగే అవకాశం వస్తే సూపర్ నేచురల్ సినిమాలు చేస్తా'.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886